
**నివాళి**

# ఆదర్శ ప్రజా నాయకుడు కామ్రేడ్ కొడియేరి బాలకృష్ణన్

కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) పొలిట్ బ్యూరో సభ్యులు, పార్టీ కేరళ రాష్ట్ర కార్యదర్శిగా మూడుసార్లు పనిచేసిన కామ్రేడ్ కొడియేరి బాలకృష్ణన్ అక్టోబర్ 1వ తేదీన తన డెబ్బయ్యవ ఏట తుదిశ్వాస విడిచారు. ఆయన కేరళ ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని వరుసగా రెండవసారి విజయపథంలో నడిపించిన సారథి.

"కార్యకర్తలు నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలలో ఉత్సాహం నింపడం నాయకుడికి ఉండవలసిన ప్రధాన లక్షణం" అంటారు హో చి మిన్. కొడియేరి బాలకృష్ణన్‌కి ఈ లక్షణం పుష్కలంగా ఉంది. 52 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో కార్యకర్తలకు సదా అందుబాటులో ఉండేవారు. వారిలో ఉత్సాహం నింపేవారు. అందుకనే ఐదుసార్లు – 1982 నుండి 2011 వరకు – తలసేరి నియోజక వర్గం నుండి శాసనసభకి ఎన్నిక కాగలిగారు.

నాయకుడు కార్యకర్తలలో ఎలా మెలగాలో వివరిస్తూ డిమిట్రోవ్ సూచించిన లక్షణాలు– "లక్ష్యం పట్ల నిబద్ధత, ప్రజలతో నిత్యసంబంధాలు, స్వతంత్రంగా సమస్యను పరిష్కరించగల సమర్థత, ఉక్కు క్రమశిక్షణ" – కొడియేరి బాలకృష్ణన్‌లో పుష్కలంగా ఉన్నాయి. అనేక సందర్భాలలో ఇవన్నీ మనకు స్పష్టంగా కనిపించాయి. 1975–77 మధ్య ఎమర్జెన్సీ కాలంలో కాంగ్రెస్ – సిపిఐ, ఉమ్మడి ప్రభుత్వం 'మీసా' చట్టం కింద అదుపులో తీసుకుని 18 నెలలు జైలులో ఉంచినప్పుడు ఏ మాత్రం వెరవలేదు. నాటి ప్రధాని ఇందిరాగాంధి ఎన్నికలను ప్రకటించిన తర్వాత మాత్రమే కొడియేరి జైలు నుండి విడుదలయ్యారు. జైలులో ఉన్న కాలాన్ని తన కాలేజి విద్యను పూర్తిచేయటానికి వినియోగించుకున్నారు. జైలులో సిద్ధాంత అధ్యయనాన్ని కూడా కొనసాగించటంతో పాటు అరెస్టయి తనతో ఉన్న మిగతా కామ్రేడ్స్‌కు కూడా అధ్యయన వేదికగా జైలును ఉపయోగించుకున్నారు. అరెస్టు అయ్యేనాటికి ఆయన ఎస్‌ఎఫ్‌ఐ కేరళ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీలో గాని, ఇతర పార్టీలతో గాని ఎటువంటి సంక్షోభం ఎదురైనా దానిని ధైర్యంగా ఎదుర్కొనేవారు. ప్రత్యర్థుల వ్యూహాలు ముందే పసికట్టి వాటిని అధిగమించేందుకు ఏమాత్రం తొణకకుండా బెణకకుండా, సమర్థవంతంగా పథక రచన చేయగలిగేవారు. 1974లో కలకత్తాలో రెండో



జాతీయ మహాసభకు ఎస్‌ఎఫ్‌ఐ బృందం హాజరు అయ్యేందుకు వెళుతుండగా కొందరు ఛాత్ర పరిషద్ (కాంగ్రెస్ విద్యార్థి సంఘం) గుండాలు చుట్టుముట్టి రెచ్చగొట్టారు. కొడియేరి వారి పథకాన్ని పసిగట్టి తనతో ప్రయాణిస్తున్న విద్యార్థులనందరినీ సంయమనం పాటించే విధంగా నియంత్రించగలిగారు. అందువలనే ప్రత్యర్థుల పాచిక పారలేదు. ప్రతినిధులు సభకు హాజరవగలిగారు. ఈ తరహా నైజం తుదిశ్వాస విడిచే వరకు ఆయనలో అనేక సందర్భాలలో కనిపిస్తుంది.

పోరాటాలలో ఆరితేరిన ధీరుడు కొడియేరి బాలకృష్ణన్. ఎటువంటి పరిస్థితులలో నయినా ధైర్యం కోల్పోయేవారు కాదు. ఆర్‌ఎస్‌ఎస్ లాంటి మితవాద శక్తులు కొడియేరిని ఏనాడూ భయపెట్టలేకపోయాయి. ప్రణాళికాబద్ధంగా వ్యూహరచనలు చేయడం, నిర్మాణాన్ని పటిష్ట పరచుకోవడం, ప్రజా బాహుళ్యానికి నాయకత్వం వహించడంతో కొడియారి ప్రతిభాపాటవాలు అసమానం. "మార్క్సిజం లెనినిజం, విప్లవ సూత్రాల పట్ల నిబద్ధత, అసమాన ధైర్య సాహసాలు, నిర్మాణ దక్షత" కొడియారి సొత్తు.

మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంత మౌలిక సూత్రాలకు దృఢంగా కట్టుబడిన వ్యక్తి ఆయన. లక్ష్యాలను సాధించటానికి అడ్డదారులను వెతకటానికి ఆయన వ్యతిరేకం. దోపిడీ రహిత సమాజాన్ని నిర్మించటం కోసం సాగించిన స్థిరమైన పోరాటాలలో ఇది మనకు కనిపిస్తుంది. పార్టీ పంథాని ఎల్లప్పుడూ అనుసరిస్తూ, పెడధోరణులు జొరబడకుండా కాపాడేవారు. అయన నిర్మించిన పోరాటాల నుండే ఆ బలం సంక్రమించింది. దోపిడీ రహిత సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతోనే కొడియేరి జీవితాంతం కృషి చేశారు. తలసెరిలో మత ఘర్షణలు జరిగినపుడు మత సామరస్యం కోసం చేసిన కృషిలో ఆయన పాత్రకూడా ముఖ్యమైనది.

"ప్రజల నుండి ప్రజల వద్దకు" అనే మావో సూత్రం తుచ తప్పకుండ పాటించిన వ్యక్తి కొడియేరి. చురుకైన కార్యకర్తలను ఎంచుకోవడం, వారి సారథ్యంలో ప్రజలోకి చొచ్చుకుపోవడం కొడియేరి విజయ రహస్యం. స్థానిక పరిస్థితులను అంచనా వేసుకోవడం, సమస్యల తీవ్రతను తెలుసుకోవడం, వేగవంతంగా నిర్ణయాలు తీసుకోవడం, ఆ నిర్ణయాలు కచ్చితంగా అమలయేటట్టు చూడడం వలననే ఆయన జీవితంలో అధికంగా సత్ఫలితాలు పొందగలిగారు. కేరళను విజయ పథంలోకి నడిపించగలిగారు.

ఏ పార్టీ అయినా లక్ష్య సాధనలో విజయం సాధించాలంటే తప్పనిసరిగా నాయకత్వంలో ఐక్యత ఉండాలి. ఈ ఐక్యత సాధించడంలో కొడియేరి బాలకృష్ణన్ కీలక పాత్ర పోషించారు.

కొడియేరి బాలకృష్ణన్ నిర్మాణ దక్షత ఎన్నదగినది. క్లిష్ట పరిస్థితులలో ధైర్యంగా ఉండడమే కాదు, మంచి చెడులను విశ్లేషించడం. లోతుగా అధ్యయనం చేయడం, సంక్షోభ నివారణకు స్థిత ప్రజ్ఞత ప్రదర్శించడం ఆయనకు అలవాటు. పార్టీ కార్యదర్శిగా ఉన్నప్పుడు కూతుపరంబ కాల్పుల సందర్భంలో ఎదుర్కొన్న సవాళ్ళను అయినా, 2011–2016 మధ్య శాసనసభలో ఉపనాయకుడిగా ఉన్నకాలంలో అయినా నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకుని తప్పనిసరిగా అనుసరించేవారు. అందువలనే ప్రత్యర్థుల మన్ననలను కూడా పొందగలిగారు.

కొడియేరి బాలకృష్ణన్ మరణం సిపిఎం పార్టీకి, ముఖ్యంగా కేరళ రాష్ట్రానికి తీరని లోటు. 2019లో క్యాన్సర్‌ను గుర్తించిన నాటి నుండి చివరి వరకు ఆ వ్యాధితో ధైర్యంగా పోరాడారు. చివరి క్షణం వరకు ప్రతి విషయంలో పార్టీకే ప్రాధాన్యతనిచ్చి, పార్టీపట్ల అత్యంత క్రమశిక్షణ, విధేయత ప్రదర్శించిన వ్యక్తి కొడియేరి బాలకృష్ణన్.

**(కామ్రేడ్ కొడియేరి బాలకృష్ణన్‌కు నివాళులర్పిస్తూ పీపుల్స్ డెమోక్రసీలో వచ్చిన వ్యాసాలలోని ముఖ్యాంశాల సంకలనం)**

## ఈ సంచికలో...

1. ఆదర్శ ప్రజా నాయకుడు కామ్రేడ్ కొడియేరి బాలకృష్ణన్ .......2

2. జనతా ప్రజాతంత్ర విప్లవమా? సోషలిస్టు విప్లవమా?
వి. శ్రీనివాసరావు........4

3. వ్యవసాయ సంక్షోభం- పరిష్కార మార్గాలు
పాలగుమ్మి సాయినాథ్ ......9

4. బిజెపి, సంఘ్ పరివార్ పెరుగుదలకు కారణాలు
బి.వి.రాఘవులు ..... 14

5. అశోకుని సామ్రాజ్యంలో లిపి, భాషలు, సాహిత్యం, శిల్పం
ఎం.వి.ఎస్.శర్మ ...... 20

6. ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొడుతున్న వైసిపి ప్రభుత్వం
ఎ.కోటిరెడ్డి....... 24

7. భారత స్వాతంత్ర్యం, దేశ విభజనపై చారిత్రక చర్చలు
సుచేతన మహాజన్...... 26

8. వర్ధమానదేశాలను దెబ్బతీస్తున్న అమెరికా విధానాలు
సిపి చంద్రశేఖర్..... 34

సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org

# లాటిన్ అమెరికా

బ్రెజిల్‌లో ట్రేడ్‌యూనియన్ నేత, వామపక్ష వర్కర్స్ పార్టీకి చెందిన లూలా డ సిల్వా దేశాధ్యక్షునిగా ఎన్నిక కావడంతో ఉత్తరాన మెక్సికో నుండి దక్షిణ కొసలోని చిలీ వరకు దాదాపు లాటిన్ అమెరికా భూభాగమంతా వామపక్ష, పురోగామి శక్తుల ఏలుబడిలోకి వచ్చినట్లయింది. దాంతో పదేళ్ల క్రితం అమెరికన్ సామ్రాజ్యవాదుల వెన్నుదన్నుతో దక్షిణమెరికా ఖండంపై మితవాద శక్తులు ఎగురవేసిన విజయబావుటా నేలకూలినట్లయింది.

సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై, సోషలిజం ఎదురు దెబ్బలు తిన్న తరువాత గడచిన నాలుగు దశాబ్దాల కాలంలో లాటిన్ అమెరికాలో సంభవించిన మార్పులు చారిత్రాత్మకమైనవి, ప్రపంచ పురోగామి శక్తులకు అనేక పాఠాలు నేర్పుతున్నాయి. అమెరికన్ సామ్రాజ్యవాదం తన పెరటి దొడ్డిగా భావిస్తూ ఆయా దేశాల్లో తనకు నచ్చని ప్రభుత్వాలను సైనిక కుట్రలతోనూ, కుయుక్తులతోనూ కూల్చివేస్తూ వచ్చిన లాటిన్ అమెరికాలో 1990 దశకం చివర, 2000 దశకంలో వరుసగా అనేక వామపక్ష, పురోగామి పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అవి సామ్రాజ్యవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రజానుకూల విధానాలు అనుసరించి పేదరికాన్నీ, అవిద్యను నిర్మూలించడానికి శాయశక్తులా ప్రయత్నించాయి. అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు పరిచాయి. అప్పటికే ఈ ఖండంలో ధ్రువతారగా ఉన్న కమ్యూనిస్టు క్యూబాతో కలిసి సామ్రాజ్యవాదనికి, అది ముందుకు తెచ్చిన ప్రపంచీకరణ విధానాలకూ ఎదురు నిలిచాయి. స్వావలంబన, ప్రజా సంక్షేమం, పేదరిక నిర్మూలన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టడంతో ఈ ఖండంలో వామపక్షాల ఏలుబడిలోని అన్ని దేశాల్లోనూ అసమానతలు తగ్గాయి. పేదరికం తగ్గింది. అక్షరాశ్యత పెరిగింది, ఆరోగ్య సదుపాయాలు పెరిగాయి.


కానీ 2010 దశకంలో చమురు, గ్యాస్ ధరలు తగ్గడంతోపాటు ఇతర కారణాలవల్ల ఈ దేశాల్లో ఏర్పడ్డ ఆర్థిక ఇబ్బందులతో ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తిని ఉపయోగించుకునీ, కుట్రకులు, కుయుక్తులతోనూ, అమెరికా సహకారాన్ని దానికి జోడించి వరుసగా అనేక దేశాల్లో మితవాద శక్తులు అధికారంలోకి వచ్చాయి. ఇంకేముంది, పురోగమనం తాత్కాలికం అంధకారం శాశ్వతమని చీకటి శక్తులు ప్రచారం చేశాయి. బ్రెజిల్‌లో బోల్సనారో వంటి పచ్చి మితవాత, నియంత ప్రభుత్వానికి అమెరికా అండదండలిచ్చింది. బొలీవియాలో కుట్రలతో ఇవో మోరెల్స్ ప్రభుత్వాన్ని కూలదోసింది. హ్యూగో ఛావెజ్ మరణించిన తరువాత వెనుజులాను చేజిక్కించుకోడానికి మదురో ప్రభుత్వంపైనా, ఆ దేశ ప్రజలపైనా అన్ని రకాల దాష్టీకాలకు పాల్పడింది. మితవాదుల పాలనలో ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగాయి. పేదరికం విలయ తాండం చేసింది. కరోనా సమయంలో బ్రెజిల్ అధ్యక్షుడు బోల్సనారో తదితరులు ప్రజల ప్రాణాలను పూర్తిగా గాలికొదిలేశారు. దాంతో అమెరికా, భారత్ తరువాత అక్కడ అత్యధికంగా ప్రజలు చేనిపోయారు. ఆర్థిక కష్టాలు మిన్నుముట్టాయి. జీవన ప్రమాణాలపై జరిగిన ఈ దాడిని ప్రజలు వీరోచితంగా ప్రతిఘటించారు. చిలీ, బొలీవియా, ఈక్వడార్ తదితర దేశాల్లో ప్రజా ప్రతిఘటన వెల్లువలు తలెత్తాయి.

ఫలితంగా ఒక్క దశాబ్దంలోనే పరిస్థితి తిరిగి వామపక్ష, పురోగామి శక్తులకు అనుకూలంగా మారింది. 2018లో మెక్సికోలోనూ, 2019లో అర్జెంటీనాలోనూ మితవాద ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలిచ్చిన తీర్పుతో వామపక్ష, పురోగామి ప్రభుత్వాలు ఏర్పడ్డంతో ప్రారంభించి ఈ నెలారంభంలో బ్రెజిల్‌లో లూలా విజయంతో మొత్తం ఖండం తిరిగి వామపక్షాలవైపు మొగ్గింది. కొలంబియా చరిత్రలో మొదటి సారిగా వామపక్ష ప్రభుత్వం ఏర్పడింది. అంతకు ముందే డేనియల్ ఒర్టెగా అధికాంలో ఉన్న నికరాగువాతో బాటు అర్జెంటీనా, చిలీ, పెరు, బొలీవియాల్లో మళ్లీ వామపక్షాలు అధికారంలోకి వచ్చాయి. విశేషమేమంటే 1973లో సాల్వడార్ అలెండీ నాయకత్వంలోని కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని సైనిక కుట్రతో కూలదోసి నయా-ఉదారవాద విధానాలకు లేబరేటరీగా మార్చిన చిలీలోనే నేడు ఆ విధానాలను వ్యతిరేకించే వామపక్ష ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారు.

ఈ పరిణామాలు వామపక్షాలకు అనేక పాఠాలు నేర్పుతాయి. లాటిన్ అమెరికా ప్రజలు నయా-ఉదారవాద విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. వాటికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడారు. అందులో భాగంగానే ఎన్నికల్లో వామపక్ష, పురోగామి శక్తులను ఎన్నుకున్నారు. ఈ ప్రభుత్వాలు నయా-ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా నికరంగా నిలిచినంత కాలం వాటికి ప్రజా మద్దతు ఉంటుంది. వెనిజులా దానికి ఒక మంచి ఉదాహరణ. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఇవి ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకు సాగుతాయని ఆశిద్దాం.

ఈ మాసం ముఖ్యాంశం

# జనతా ప్రజాతంత్ర విప్లవమా? సోషలిస్టు విప్లవమా?



రచయిత సిపిఐ(ఎం)
ఆంధ్ర ప్రదేశ్ కమిటీ కార్యదర్శి

**వి. శ్రీనివాసరావు**

భారతదేశంలో సోషలిస్టు సమాజ నిర్మాణం – సిపిఐ(యం) అంతిమ లక్ష్యం ఈ లక్ష్య సాధనకు మూడు దశల కార్యక్రమాన్ని రూపొందించుకున్నది. ఇందులో మొదటిది, సామ్రాజ్యవాద వ్యతిరేక దశ. వలస పాలనను వదిలించుకొని దేశానికి స్వాతంత్ర్యం తెచ్చుకోవడంతో ఇది పూర్తయింది. ప్రస్తుతం రెండవ దశలో ఉన్నాము. దానినే జనతా ప్రజాతంత్ర విప్లవ దశ అంటున్నాము. ఈ దశలో బడా పెట్టుబడిదారి నాయకత్వంలోని బూర్జువా, భూస్వామ్య వర్గ పాలనను వదిలించుకొని కార్మికవర్గ నాయకత్వంలో కార్మిక, కర్షక ఐక్యత పునాదిగా జనతా ప్రజాస్వామిక సమాజాన్ని నిర్మించాలి. ఈ కర్తవ్యం పూర్తయిన తరువాత సోషలిస్టు సమాజ దశలోకి అడుగు పెడతాము. దానికెంత కాలం పడుతుందన్నది ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబందాల అభివృద్ధి మీద ఆధారపడి ఉంటుంది.

ఒకానొక సమాజం ఏ దశలో ఉన్నది నిర్ణయించుకోవాలంటే ఆనాడున్న నిర్దిష్ట ఉత్పత్తి శక్తులను బట్టి అంచనా వేస్తాము. మార్క్స్, ఎంగెల్స్‌లు చారిత్రక భౌతికవాద సిద్ధాంతాన్ని దీని ఆధారంగానే రూపొందించారు. తత్వశాస్త్రం, ఆర్థిక శాస్త్రం సమగ్రంగా అధ్యయనం చేసి సమాజ పురోగమన నియమాలను వారు రూపొందించారు. సమాజంలో నిరంతరం ఉత్పత్తి శక్తులు అభివృద్ధి అవుతుంటాయి. అది వాటి సహజ లక్షణం. అయితే వర్గ దోపిడీ వల్ల వచ్చిన అసమానతలు ఈ అభివృద్ధి క్రమాన్ని ఆటంకపరుస్తుంటాయి. అదే సంక్షోభానికి దారితీస్తుంది. ఉత్పత్తి శక్తులు నిరాటంకంగా అభివృద్ధి కావాలంటే వాటికి అనుగుణంగా ఉత్పత్తి సంబంధాలు ఉండాలి. ఉత్పత్తి క్రమంలో మనుషుల మధ్య ఏర్పడే సంబంధాలను ఉత్పత్తి సంబంధాలు అంటారు. ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఉత్పత్తి సంబంధాలు ఆటంకంగా వచ్చినప్పుడు వాటి అడ్డు తొలగించుకొని ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి తోడ్పడే కొత్త ఉత్పత్తి సంబంధాలను ఏర్పాటు చేసుకోవడానికి చేసే పోరాటమే వర్గ పోరాటం. ఈ వర్గ పోరాటమే సామాజిక ప్రగతికి చోదక శక్తి. ఈ వర్గ పోరాట సిద్ధాంతాన్ని విశ్వసించి ఆ శాస్త్రాన్ని ఆచరణలో పెట్టేవారే మార్క్సిస్టులు. భారతదేశంలో ఉండే నిర్దిష్ట ఉత్పత్తి సంబంధాలను అధ్యయనం చేసి, దానికనుగుణంగా విప్లవ దశను రూపొందించుకున్న పార్టీ సిపిఐ(ఎం).

భారతదేశానికి సోషలిజమే విముక్తి మార్గమని నమ్మేవారు అశేష సంఖ్యలో ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీలతో సహా అనేక సంస్థలు, వ్యక్తులు కూడా దీనిని కోరుకుంటున్నారు. సోషలిజాన్ని సాధించడానికి మార్క్సిజమే మార్గమని కమ్యూనిస్టులు విశ్వసిస్తారు. ఈ విషయంలో అన్ని కమ్యూనిస్టు పార్టీల మధ్య ఏకాభిప్రాయం ఉన్నది. భారతదేశ నిర్దిష్ట పరిస్థితుల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ సోషలిజానికి పరివర్తన జరిగే ప్రక్రియలో మధ్యంతర దశ ఉంటుంది అనే విషయంలో సిపిఐ, సిపిఐ(ఎంఎల్) పార్టీల మధ్య తేడాలు లేవు. అయితే ఈ మధ్యంతర దశ ఎలా ఉండాలన్నదానిపై విభేధాలున్నాయి. ఇప్పటికీ సామ్రాజ్యవాదమే ప్రధాన శత్రువని, రాజ్యాధికారంలో ఉన్నది దళారీ బూర్జువా వర్గమని, స్థూలంగా ఎంఎల్ పార్టీల అంచనా. అధికారంలో ఉన్నది ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావం కలిగిన జాతీయ బూర్జువా వర్గమని సిపిఐ చెబుతున్నది. సిపిఐ(ఎం) అభిప్రాయం ఈ రెంటికీ భిన్నమైనది. రాజ్యాంగ యంత్రం భూస్వామ్య వర్గం భాగస్వామిగా ఉన్న బూర్జువా, భూస్వామ్య ప్రభుత్వమని, దీనికి బడా బూర్జువా వర్గం నాయకత్వం వహిస్తున్నదని, ఇది సామ్రాజ్యవాదంతో మిలాఖత్ అవుతున్నదని సిపిఐ(ఎం) అభిప్రాయం. భారతదేశంలో ఉన్న నిర్దిష్ట ఉత్పత్తి శక్తుల అభివృద్ధి, ఉత్పత్తి సంబంధాల స్థాయి ఆధారంగా సిపిఐ(ఎం) ఈ అంచనాకొచ్చింది.

ఆర్ఎస్‌పి, ఎస్‌యుసిఐ(సి) లాంటి కొన్ని పార్టీలు మొదటి నుండీ ఈ మధ్యంతర దశను నిరాకరించాయి. పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి నేరుగా సోషలిస్టు సమాజాన్ని సాధించే దశ ఒక్కటే ఉంటుందని వారి అభిప్రాయం. దీంతో సిపిఐ(ఎం) ఏకీభవించడం లేదు. ఇటవీల కాలంలో కొంత మంది మిత్రులు సోషల్ మీడియా ద్వారా సిపిఐ(ఎం) కార్యక్రమంపై దాడిచేస్తూ సోషలిస్టు దశ తక్షణ లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారు. ఇది భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు వర్తించేది కాదు. ఊహాజనితమైన వాదన. ప్రపంచ దేశాల అనుభవం, తాజా పరిణామాలు కూడా సిపిఐ(ఎం) ఆలోచన సరైనదేనని నిరూపిస్తున్నది.

మధ్యంతర దశ ఉండాలా? నేరుగా సోషలిస్టు సాధనకే పనిచేయాలా? అన్నది కమ్యూనిస్టుల ఇష్టాయిష్టాలను బట్టి కాకుండా నేటి సామాజిక వర్గ శక్తుల బలాబలాలను బట్టి ఆధారపడి ఉంటుంది. దేశంలో భూస్వామ్య వ్యవస్థ లేదని, పెట్టుబడిదారీ వ్యవస్థగా పరిణామం పూర్తయిందని కొందరు వాదిస్తున్నారు. వ్యవసాయ రంగంలో

పెట్టుబడిదారీ సంబంధాలు ఉన్నాయా? లేదా? అన్నది కాదు ఇక్కడ ప్రశ్న. మొత్తం వ్యవసాయ రంగవే పెట్టుబడిదారీ వ్యవస్థగా మారిపోయిందన్నది వాస్తవ విరుద్ధం. భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ పెరుగుతుందనడంలో సందేహం లేదు. కాని అది దేశవ్యాపితంగా ఒకే రకంగా లేదు. అసమానంగా విస్తరించింది. ఆ రకంగా వ్యవసాయం రంగంలో పెట్టుబడిదారీ విస్తరణ పరిమాణాత్మక (క్వాంటిటేటివ్) దశలో ఉన్నది.

సిపిఐ(ఎం) పార్టీ కార్యక్రమం 3.15 నుండి 3.24 వరకు వ్యవసాయ రంగంలోకి పెట్టుబడిదారీ విధానం ఎలా చొచ్చుకొని వస్తున్నదో సోదాహరణంగా వివరించింది. దీని సారాంశం “భారతదేశ వ్యవసాయంలో పెట్టుబడిదారీ అభివృద్ధి, పాత రూపాలను నిర్ణయాత్మకంగా రూపుమాపడం ప్రాతిపదికపైన జరగలేదు. పెట్టుబడిదారీ విధానపు పూర్వ ఉత్పత్తి సంబంధాలు, సామాజిక నిర్మాణం, ఊబిలా అడుగున ఉండగానే, దానిపైనే పెట్టుబడిదారీ అభివృద్ధి రుద్దబడింది. ‘ఆధునికత’ పెంపొందుతున్నదంటే పాత పద్ధతులు ఇంకా కొనసాగే పరిస్థితి లేకుండా పోయిందనడానికి లేదు. వ్యవసాయంలోకి, గ్రామీణ సమాజంలోకి పెట్టుబడిదారీ విధానం బహు విధాలుగా చొచ్చుకొనిపోతుందనే సూత్రానికి సజీవమైన, సువిశాలమైన ఉదాహరణ భారతదేశం.” 2000 సంవత్సరంలో తాజావర్చబడిన పార్టీ కార్యక్రమం, తరువాత వచ్చిన మార్పులు అధ్యయనం చేసిన వ్యవసాయ నివేదిక (2015) “ప్రస్తుతం వ్యవసాయ సంబంధాలలో కాలం చెల్లిన వ్యవస్థలు, సామాజిక నిర్మాణాలు ఇప్పటికీ కొనసాగుతున్నప్పటికీ పెట్టుబడిదారీ అభివృద్ధి విస్తృతీ, తీవ్రత బాగా పెరిగింది'' అని పేర్కొన్నది. దీనిని బట్టి వ్యవసాయ రంగంలో జరుగుతున్న పరిమాణాత్మక మార్పుల తీవ్రత మనకు అర్థమవుతున్నది. అదే సమయంలో పెట్టుబడిదారీ విస్తృతి దేశమంతా ఒకే రకంగా లేదని, అసమాన అభివృద్ధి ఉందని ఈ నివేదిక గుర్తించింది. “2004 తరువాత సంభవించిన అభివృద్ధి అసమానమైనది, గ్రామ సీమల్లోనూ, ఇతరంగానూ వ్యత్యాసాలను పెంచింది”. వ్యవసాయ రంగంలో నయా-ఉదారవాద విధానాలు తీసుకొచ్చిన మార్పుల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో నయా-ధనికవర్గం ఆధిపత్యం వచ్చింది. పెట్టుబడిదారీ ధనికరైతులు, భూస్వాములు ఒక్కటయ్యారు.

సిపిఐ(ఎం) అవగాహన ఇది కాగా తద్భిన్నంగా స్వాతంత్ర్యం రావడంతోనే సామ్రాజ్యవాదం, ఫ్యూడలిజం అంతరించి పోయిందని, భూసంబంధాలు మారిపోయాయని, భూమిపై పెట్టుబడిదారులకు ఆధిపత్యం వచ్చిందని కొందరి వాదన. స్వాతంత్ర్యానంతరం భూయాజమాన్యంలో మార్పులు వచ్చాయి. జమిందారీ వ్యవస్థ రద్దు తరువాత భూస్వామ్య వర్గాలకు భూమిపై ఆధిపత్యం వచ్చింది. వీరు రాజ్యాంగ యంత్రంలో భాగస్వాములయ్యారు. వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టడానికి సహకార బ్యాంకుల నుండి అప్పులు లభించాయి. ఆ బ్యాంకులపై రాజ్యాధికార విభజనలో భాగంగా భూస్వాములకు ఆధిపత్యం వచ్చింది. తెలంగాణా సాయుధ పోరాటం తరువాత పాలకులు తమ రాజ్యాధికారాన్ని కాపాడుకోడానికి అనివార్యంగా భూసీలింగ్ చట్టాలు తీసుకురావాల్సి వచ్చింది. ఈ చట్టాల ద్వారా “సొంత సాగు” పేరుతో భూస్వాములు భూముల్ని కాపాడుకున్నారు. ప్రభుత్వ సంస్థల ద్వారా సబ్సిడీలు పొంది నేరుగా కూలీలను పెట్టుకొని పనిచేయించుకోవడం ప్రారంభించారు. తద్వారా కౌలుదోపిడీ స్థానంలో కూలి దోపిడీ వచ్చింది.

> **“ అయితే ఒక పారిశ్రామిక కార్మికుడ్ని పారిశ్రామికవేత్త చేసే దోపిడీ పద్ధతికీ, ఒక వ్యవసాయ కూలీని భూస్వామి చేసే దోపిడీకి తేడా ఉన్నది. కులము, లింగ భేదము, ప్రాంతాల అభివృద్ధిలో తేడాలు ఈ దోపిడీలో ప్రతిబింబిస్తుంటాయి. పారిశ్రామిక కార్మికునిలా వ్యవసాయ కూలీ పూర్తిస్వేచ్ఛాయుత కార్మికుడని చెప్పలేము. ”**

అయితే ఒక పారిశ్రామిక కార్మికుడ్ని పారిశ్రామికవేత్త చేసే దోపిడీ పద్ధతికీ, ఒక వ్యవసాయ కూలీని భూస్వామి చేసే దోపిడీకి తేడా ఉన్నది. కులము, లింగ భేదము, ప్రాంతాల అభివృద్ధిలో తేడాలు ఈ దోపిడీలో ప్రతిబింబిస్తుంటాయి. పారిశ్రామిక కార్మికునిలా వ్యవసాయ కూలీ పూర్తిస్వేచ్ఛాయుత కార్మికుడని చెప్పలేము. ఒక వ్యవసాయ కూలి ఒకే ల్యాండ్ ఎస్టేట్‌లో లేదా ఒక భూస్వామి దగ్గర పనిచేయరు. ఆ మాటకొస్తే దేశంలో వ్యవసాయ ఎస్టేట్‌లు ఫిషరీస్, తేయాకు, కాఫీ లాంటి ప్లాంటేషన్స్‌లోనే మనకు కనిపిస్తాయి. వ్యవసాయ కూలీ రోజుకొకరి దగ్గర పనిచేస్తుంటారు. రోజువారీ కూలీకి పనిచేస్తారు. సీజన్ బట్టీ వేతనాలు మారుతుంటాయి. పనిలేని రోజుల్లో వలసలు పోతారు. ఏ పని లేకుంటే పస్తులుంటారు. అప్పులు చేస్తారు. అప్పులు తీర్చడానికి సీజన్‌లో తక్కువ వేతనాలకు పనికి పోతారు. వడ్డీ దోపిడీ, మరో రూపంలో కౌలుదోపిడీ కొనసాగుతున్నది. దీనికి కుల దోపిడీ (సామాజిక) తోడైంది. మగవారికన్నా ఆడవారికి,


## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి**

,

**పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

> **❝ ఫ్రాన్స్‌లో పెట్టుబడిదారీ విప్లవం జరిగే నాటికి భూసంస్కరణలు, దున్నేవాడికే భూమి పెట్టుబడి దారుల నినాదంగా ఉండేది. ఆ తర్వాత పాత ఫ్యూడల్ వ్యవ స్థను సంపూర్ణంగా ధ్వంసం చేసే కర్తవ్యం పెట్టుబడి దారీ వ్యవస్థ వదిలేసింది. తరువాత ఆ కర్తవ్యాన్ని కార్మికవర్గం స్వీకరించింది. ❞**

ఇతర కులస్థుల కన్నా దళిత ఆదివాసీలకు తక్కువ కూలీ ఇవ్వడం, వారిని లైంగికంగా వేధించడం, తక్కువచూపు చూడడం. ఇవన్నీ ఫ్యూడల్ లక్షణాలే. ఇప్పటికీ కులవివక్షత తీవ్ర రూపంలో కొనసాగుతున్నది. 1934లో సుందరయ్యగారు వ్యవసాయ కార్మిక సంఘం అనే పేరు కొత్తగా ప్రవేశించిన పెట్టుబడిదారీ మార్పులను దృష్టిలో పెట్టుకొని ఖరారుచేశారు. భూస్వాములకు చౌకగా శ్రమ అమ్ముకొంటున్న రోజువారీ వేతన కార్మికులు వీరు. అందువలన వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ సంబంధాలు గుణాత్మక (క్వాలిటేటివ్) దశకు చేరుకోలేదు. పరిమాణాత్మక మార్పులకు, గుణాత్మక మార్పులకు తేడా అర్థం చేసుకోలేనివారే గందరగోళానికి గురవుతున్నారు.

భారతదేశంలో ప్రస్తుతం విభిన్న ఉత్పత్తి సంబంధాలు కొనసాగుతున్నాయి. వీటినే పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి సంబంధాలు అంటాము. పెట్టుబడిదారీ లక్షణాలతోపాటు ఫ్యూడల్ ఆదిమ సమాజ లక్షణాలు కూడా కలగలసి ఉన్నాయి. బ్రిటీష్ కాలంలోనే పెట్టుబడిదారీ వ్యవస్థకు పునాదులు పడ్డాయి. పెట్టుబడిదారీ సంబంధాలు బలపడుతున్నాయి. అనేక వలస దేశాల్లో స్వాతంత్ర్యానంతరం ఇలాంటి ఉత్పత్తి సంబంధాలు కనిపిస్తాయి. భారతదేశం గురించి మార్క్స్ వ్రాసిన వ్యాసాల్లో బ్రిటీష్ పాలన "పాత సమాజాన్ని ధ్వంసం చేస్తున్నది. కాని కొత్తదాన్ని నిర్మించలేదు" అన్నారు. భూస్వామ్య దోపిడీకి తోడు వలస దోపిడి ప్రజల్ని మరింతగా పీక్కుతింది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని ఫ్యూడల్, పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటాలతో మమేకం చేసింది కమ్యూనిస్టు పార్టీ.

1928లోనే అంతర్జాతీయ 6వ మహాసభ (కొమిన్‌టర్న్) ఆమోదించిన – కార్యక్రమం ఇండియా గురించి ఇలా చెప్పింది.

''ప్రపంచంలో ఉన్న వలస దేశాలన్నింటిలోకి అత్యంత పెట్టుబడిదారీ అభివృద్ధిని సాధించిన దేశం భారతదేశమే. సామ్రాజ్యవాదం భారత వ్యవసాయ రంగాన్ని "ద్రవ్య మార్కెట్" అనే సుడిగుండంలోకి ఈడ్చుకుపోతోంది. గ్రామీణ ప్రాంతంలో ఇంకా పెట్టుబడిదారీ వ్యవస్థకు పూర్వపు దశలోని సంబంధాలు, ఫ్యూడల్ సంబంధాలు ఉంటున్నాయి. రైతాంగంలో వర్గ వ్యత్యాసాలు పెరిగాయి". రష్యాలో పెట్టుబడిదారీ అభివృద్ధి గురించి లెనిన్ పలు తరహా ఉత్పత్తి విధానాలు ఉన్నట్లు అందులో పెట్టుబడిదారీ సంబందాలు పైస్థాయిలో ఉన్నట్లు పేర్కొన్నారు.

సాధారణ సరుకుల ఉత్పత్తి (సింపుల్ కమాడిటీ ప్రొడ్యూసర్స్) ఆ కాలంలోనే మొదలైంది. ఈ తరహా పెట్టుబడి యూరప్‌లో పెట్టుబడిదారీ విప్లవానికి ముందే 15-16 శతాబ్దాల్లో విస్తరించింది. ఆ వ్యాపార పెట్టుబడితోనే వారు అనేక దేశాలకు సరుకులు ఎగుమతి చేసి దోపిడీ చేసి వలస దేశాలుగా మార్చుకున్నారు. టీ హోటల్, జనుము, పత్తి, పొగాకు, నీలిరంగు తొట్లు వంటివి ఆనాడే వ్యవసాయరంగంలో ప్రవేశించాయి. వ్యవసాయ మార్కెట్లు ఏర్పడ్డాయి. వ్యవసాయ కూలీలను పెట్టుకొని భూస్వాములు కూలి ఇవ్వడానికి మోసపూరితమైన పద్దతులు అనుసరించేవారు. స్వాతంత్ర్యానంతరం పెట్టుబడిదారీ విస్తరణ పెరిగింది. హరిత విప్లవం పేరుతో ప్రభుత్వమే పాత తరహా ఫ్యూడల్ పద్ధతి స్థానంలో కొత్త తరహా పెట్టుబడిదారీ భూస్వామ్య పద్ధతులకు ప్రోత్సాహాన్నిచ్చింది. పాలకులు పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించే క్రమంలో భూస్వామ్య వర్గంతో రాజీ పడి ఫ్యూడల్ పునాదులపైనే పెట్టుబడిదారీ సంబంధాలను రుద్దారు. ఫ్రాన్సులో లాగా పెట్టుబడిదారీ వర్గం ఫ్యూడలిజాన్ని పూర్తిగా విధ్వంసం చేసి పెట్టుబడిదారీ సమాజాని నిర్మించలేకపోయింది. యూరప్ అంతటా కూడా ఒకే రకమైన ఉత్పత్తి విధానం లేదు. జర్మనీలో ఫ్యూడలిజాన్ని పూర్తిగా నిర్మూలించకుండా రాజీ పడి పెట్టుబడిదారీ సమాజాన్ని నిర్మించింది. అందువల్లనే ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లకన్నా అభివృద్ధిలో వెనకబడింది. ఆలస్యంగా పెట్టుబడిదారీ పోటీలో వచ్చి యుద్ధాలకు తలపడింది.

"అమెరికా మార్గం, జంకర్ ప్రష్యన్‌మార్గం – రెండూ భారతదేశంలో అమలుకావడం లేదని 1967లో సిపిఐ(ఎం) ఆమోదించిన వ్యవసాయ రంగంలో కర్తవ్యాలు అనే నివేదికలో పేర్కొన్నది.

"భారత బూర్జువా వర్గానికి పారిశ్రామిక ప్రాతిపదిక లేదు. దేశంలో బూర్జువా వ్యవసాయ సంస్కరణలు ఫ్యూడల్, అర్థ ఫ్యూడల్ వర్గాలు విధించిన బంధనాలను బద్దలు చేయడానికి ఉద్దేశించినవి కావు. ఉత్పత్తి శక్తులను పెద్ద ఎత్తున విడుదల చేయించలేదు. అవి మన వ్యవసాయరంగాన్ని ఆధునిక పెట్టుబడిదారీ వ్యవసాయంగా మార్చడానికి ఉద్దేశించినవి కావు".

"స్వతంత్రత కలిగిన కూలీ కార్మికుడు కాదు. పారిశ్రామిక రంగ వేతనంతో ఏమాత్రం పోల్చడానికి లేదు". "ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో అటు పెట్టుబడిదారీ లక్షణాలు, ఇటు ఫ్యూడల్ లక్షణాలు రెండూ ఇమిడి ఉన్నాయి" సనాతన కాలం నాటి బానిస లక్షణం, ఆధునిక కూలీ లక్షణం రెండూ ఇమిడి ఉన్నాయి.

అమెరికాలో పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించిన తీరు మరొక రకమైంది. అక్కడ స్థానికంగా ఉండే అత్యంత వెనుకబడిన ఆదిమ సమాజ కాలం నాటి రెడ్ ఇండియన్‌లను నిర్మూలించి యూరప్ నుండి వెళ్ళిన పెట్టుబడిదారీ వర్గం పూర్తి ఆధిపత్యం సాధించింది. ఇక్కడ వారు రాష్ట్రాలకు రాష్ట్రాలనే పూర్తిగా కొనుగోలు చేసి సంపూర్ణ ఆధిపత్యం సాధించారు. ఇది దిగుమతి చేయబడిన పెట్టుబడిదారీ విధానం. బానిసలను దిగుమతి చేసుకొని క్రూరమైన దోపిడీచేసి పెట్టుబడిదారీ వర్గం బలపడింది. తరువాత ఈ వర్గం బ్రిటన్ రాజకీయ ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడి స్వాతంత్ర్యం సాధించుకొన్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఈ దేశం ఆధిపత్యంలోకి వచ్చింది. జపాన్, కొరియా దేశాల అనుభవం మరో రకమైంది. అక్కడ పెట్టుబడిదారీ వర్గం వ్యవసాయక విప్లవానికి నాంది పలికింది. భూసంస్కరణలు అమలు జరిపి అత్యధికమందికి భూమిపై హక్కు కల్పించడం ద్వారా ప్రజల

కొనుగోలు శక్తిని పెంచి అంతర్గత మార్కెట్‌ను విస్తరింపజేసుకొని పెట్టుబడిదారీ వ్యవస్థను అభివృద్ధి చేసుకున్నది. ఇలా ఒక్కొక్క దేశం అనుభవం ఒక్కోరకంగా ఉన్నది.

ఫ్రాన్స్‌లో పెట్టుబడిదారీ విప్లవం జరిగే నాటికి భూసంస్కరణలు, దున్నేవాడికే భూమి పెట్టుబడిదారుల నినాదంగా ఉండేది. ఆ తర్వాత పాత ఫ్యూడల్ వ్యవస్థను సంపూర్ణంగా ధ్వంసం చేసే కర్తవ్యం పెట్టుబడిదారీ వ్యవస్థ వదిలేసింది. తరువాత ఆ కర్తవ్యాన్ని కార్మికవర్గం స్వీకరించింది. పెట్టుబడిదారులు వదిలేసిన అసంపూర్ణ కర్తవ్యాలను పూర్తిచేసేందుకే కార్మికవర్గ రాజ్యాధికారంలో మధ్యంతర దశను పెట్టుకోవాల్సి వచ్చింది. ఈ దశలో సోషలిజంలో లాగా భూమిని జాతీయం చేయరు. రైతు యాజమాన్యం కొనసాగుతుంది. భూస్వామ్య విధానాన్ని సంపూర్ణంగా రద్దు చేస్తారు. గుత్త పెట్టుబడిని రద్దు చేస్తారు. ప్రయివేటు పెట్టుబడిని అనుమతిస్తారు. చిన్న మధ్యతరహా పరిశ్రమలుంటాయి.

రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి లెనిన్ అనేక వ్యాసాలు, గ్రంథాలు రాశాడు. సోవియట్ యూనియన్ ఆవిర్భావం తరువాత గుత్త పెట్టుబడిని రద్దు చేసి, పెట్టుబడిదారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించకుండానే సోషలిజానికి పరివర్తన చెందడానికి మధ్యంతర దశను లెనిన్ రూపొందించాడు. ప్రజాతంత్ర విప్లవంలో రెండు దశలన్న గ్రంథంలో కార్మిక కర్షక ఐక్యత గురించి లెనిన్ వివరించాడు. భూములు జాతీయం చేయకుండా సొంత వ్యవసాయాన్ని కొనసాగించారు. ఈ విషయంలో మార్క్స్ కాలంనాటి అవగాహనకు, లెనిన్ అవగాహనకు మార్పు వచ్చింది.

ప్రజాతంత్ర విప్లవం – రెండు ఎత్తుగడలు అన్న లెనిన్ గ్రంథం 10వ అధ్యాయంలో ఇలా రాశారు. "రష్యాలో ఇంకా ప్రజాతంత్ర విప్లవ దశ పూర్తి కాలేదు. సోషలిస్టు దశకు త్వరలోనే చేరుకుంటాం. ఈలోగా ఈ దశను పూర్తిచేయాలి. ప్రజాతంత్ర విప్లవానికి, సోషలిస్టు విప్లవానికి మధ్య తేడాను అర్థం చేసుకోవడంలో కొందరు గందరగోళానికి గురవుతున్నారు. అందుకనే రష్యాలో "కార్మిక, కర్షక, ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వాన్ని" అమలు చేయాలి. జర్మనీలో కూడా ఇలాంటి పరిస్థితిని అంచనావేసి సోషల్ డెమోక్రాటిక్ పార్టీ అవసరాన్ని గుర్తించారు. జర్మనీలో ప్రజాతంత్ర రిపబ్లిక్ అవసరాన్ని తక్కువ అంచనా వేస్తే పొరపాటు చేసినట్టేనని లెనిన్ కన్నా ముందు 1891లో ఎంగెల్స్ గుర్తించారు – "ఈ పరిస్థితి

> "చైనాలో ఫ్యూడలిజాన్ని నిర్మూలించి విప్లవానంతరం నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించారు. ఇదీ సోషలిజానికి ముందున్న మధ్యంతర వ్యవస్థే. లెనిన్ నాటికన్నా చైనాలో మావో దీనిపై మరింత స్పష్టమైన వైఖరి తీసుకున్నారు. పెట్టుబడిదారీ వర్గం పరిపూర్తి చేయాల్సిన కర్తవ్యాలను కూడా ఇక్కడ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కార్మికవర్గం చేసింది. అయితే ఏడెనిమిదేళ్ళు కూడా నిండకుండానే నేరుగా సోషలిజంలోకి వెళ్ళిపోవాలన్న తొందర పాటు నిర్ణయాన్ని మావో నాయత్వంలో నాడు చైనా కమ్యూనిస్టు పార్టీ చేపట్టింది."

ఎక్కడా శాశ్వతంగా ఉండదు. మారుతుంటుంది. మారిన పరిస్థితులనుబట్టి ఎత్తుగడలు మారుతుంటాయి. ఇదొక పరివర్తనా దశ" అని లెనిన్ పేర్కొన్నారు.

చైనాలో ఫ్యూడలిజాన్ని నిర్మూలించి విప్లవానంతరం నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించారు. ఇదీ సోషలిజానికి ముందున్న మధ్యంతర వ్యవస్థే. లెనిన్ నాటికన్నా చైనాలో మావో దీనిపై మరింత స్పష్టమైన వైఖరి తీసుకున్నారు. పెట్టుబడిదారీ వర్గం పరిపూర్తి చేయాల్సిన కర్తవ్యాలను కూడా ఇక్కడ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కార్మికవర్గం చేసింది. అయితే ఏడెనిమిదేళ్ళు కూడా నిండకుండానే నేరుగా సోషలిజంలోకి వెళ్ళిపోవాలన్న తొందరపాటు నిర్ణయాన్ని మావో నాయత్వంలో నాడు చైనా కమ్యూనిస్టు పార్టీ చేపట్టింది. దీనికి "పెద్దగంతు" అని పేరు పెట్టారు. పెట్టుబడిదారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించే పేరుతో భూమిని జాతీయం చేశారు. చిన్న వ్యాపారాలను, వృత్తులను రద్దు చేశారు. అన్నింటినీ ప్రభుత్వరంగంలోకి తెచ్చారు. ఇది రైతుల్లో తీవ్రమైన అసంతృప్తికి దారితీసింది. పోరాడి సాధించుకున్న భూమి చేజారిపోయిందన్న భావం నెలకొన్నది. అందరికోసం తామెందుకు కష్టపడాలన్న భావం ముందుకొచ్చింది. కొత్త ఉత్పత్తి సంబంధాలకనుగుణంగా ప్రజల చైతన్య స్థాయి పెరగకుండానే ఒంటెత్తు నిర్ణయాలు చేయడం వల్ల దుష్ఫలితాలు వచ్చాయి. వ్యవసాయోత్పత్తిని తగ్గించి ఆహార కొరతను సృష్టించింది. వ్యవసాయ రంగం సంక్షోభంలో పడింది. ఉత్పత్తి శక్తులు అభివృద్ధి కాకుండానే కృత్రిమంగా ఉత్పత్తి శక్తుల స్థాయికి మించిన సంబంధాలను పైనుండి రుద్దడం ద్వారా ఈ సంక్షోభం వచ్చింది. అందువలనే 1978 సంస్కరణల తరువాత భూమిపై ఉమ్మడి యాజమాన్యం కొనసాగిస్తూనే రైతుల వ్యక్తిగత చొరవను పెంచడానికి కాంట్రాక్టు పద్ధతిని ప్రవేశపెట్టారు. ఇది వ్యవసాయ ఉత్పత్తిని గణనీయంగా పెంచడానికి దోహదపడింది. గ్రామీణ ప్రజల ఆదాయాలు పెరిగాయి. కొనుగోలు శక్తి పెరిగింది. ఇది పారిశ్రామిక అభివృద్ధికి పునాదిని సృష్టించింది. ఆ రకంగా నేడు చైనా ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగానూ, సరఫరాదారుగానూ ముందుకొచ్చింది. ఈ అనుభవాల నుండి మనం నేర్చుకోవాలి.

నేడు మన ఆర్థిక వ్యవస్థ నయా–ఉదారవాద సంస్కరణల తరువాత అభివృద్ధి అయిన మాట వాస్తవమే. దాని ఆయుష్షు కూడా పెరిగింది. అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడితో జతకట్టి మన దేశంలో పెట్టుబడి మరింతగా బలపడింది. అయితే ఈ అభివృద్ధి ప్రధానంగా విదేశీ పెట్టుబడి, సర్వీసు సెక్టార్‌మీద ఆధారపడింది. రియల్ ఎస్టేట్, హోటళ్ళు, రిటైల్, ఫైనాన్సు, షేర్ మార్కెట్, ఇన్‌ఫ్రాస్టక్చర్ వంటి రంగాల్లోకి ఎక్కువ పెట్టుబడి వచ్చింది. ఇది మన స్వదేశీ అభివృద్ధిలోంచి వచ్చిన పెట్టుబడి కాదు. విదేశీ పెట్టుబడుల విస్తరణ, లాభాపేక్షలోంచి వచ్చిన అభివృద్ధి. వ్యవసాయ పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి జరిగి ఆ పునాదిపై వస్తే అది నిలకడగా ఉంటుంది. బయట నుండి వచ్చిన పెట్టుబడి ప్రవాహాలతో నిర్మించిన సర్వీసు రంగం ఉపాధిని పెంచలేకపోయింది. కొత్తగా వచ్చిన ఉపాధి నిలకడ లేనిది. ప్రజల ఆస్తులు, ఆదాయాలు పెరగలేదు. కొద్దిమంది సంపన్నులు శతకోటీశ్వరులయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో "నయా–ధనికవర్గం" పెత్తనంలోకి వచ్చింది. పాత తరహా భూస్వాములు కొత్త తరహా పెట్టుబడిదారీ ధనికవర్గం కలసి ఈ కొత్త రూపం ధరించాయి. గ్రామీణ ఆర్థిక రాజకీయ, సామాజిక వ్యవస్థలమీద వీరి పెత్తనమే సాగుతున్నది. పాలకులు ప్రస్తుత వ్యవసాయాన్ని పరిశ్రమగా మార్చాలని చూస్తున్నారు. భూస్వామ్య, ధనిక వర్గాలు కూడా దీనిని బలపరుస్తున్నాయి. అంటే దీనర్థం వ్యవసాయానికి

**❝ పెట్టుబడిని విస్తరించుకునేందుకు అత్యంత విధ్వంసకర, అమానవీయ పద్ధతులకు కూడా పెట్టుబడిదారీ వర్గం పాల్పడుతుంది. నాడు యూరప్‌లో జరిగిన పరిణామాలు నేడు భారతదేశంలో జరుగుతున్నాయి. సహజవనరులను కొల్లగొట్టడం, భూసేకరణ పేరుతో రైతులను భూములనుండి వెళ్లగొట్టి కార్పొరేట్‌ల పరం చేయడం, చిన్న వృత్తిదారులను నాశనం చేయడం, చిన్న పరిశ్రమలను మింగివేయడం, ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటు పరం చేయడం వంటివన్నీ పెట్టుబడి విస్తరణకు దోహదపడేవే. ❞**

ఇంకా పరిశ్రమ లక్షణాలు రాలేదనే. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో నయా-ధనికవర్గం వ్యవసాయంపై కన్నా రియల్ ఎస్టేట్ ఇతరేతర వ్యాపారాలపై మొగ్గు చూపుతున్నారు. దీనికి మద్దతుగా "పట్టణీకరణ" కూడా ఒక సాధనంగా మారింది. చిన్నా చితక పట్టణాల చుట్టూ ఉన్న గ్రామాలన్నింటినీ కలిపి మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, మెగా కార్పొరేషన్‌ల క్రింద మార్చడం ఈ వ్యూహంలో భాగమే. దీనివల్ల వ్యవసాయ భూమి రియల్ ఎస్టేట్‌గా మారుతుంది. భూసీలింగ్ చట్టాలు ఎత్తేస్తారు. భూకేంద్రీకరణ పెరుగుతుంది. ఈ సంస్కరణల ఫలితంగా వివిధ కులాల్లో వర్గ పీడన పెరిగింది. కొత్త మధ్యతరగతి ఆవిర్భవించింది. ఈ వర్గం పెట్టుబడిదారీ సంస్కరణలకు అనుకూలంగా ఉంది. అందువలనే ఇప్పటి వరకు బడా బూర్జువా వర్గం తన విస్తరణ కొనసాగించగలుగుతోంది. తిరిగి ఇప్పుడు సంక్షోభంలో పడింది. వ్యవసాయ రంగంలో ఫ్యూడలిస్టు సంబంధాలు కొనసాగుతున్నందువల్ల మన ఆర్థిక వ్యవస్థ పునాది ఇప్పటికీ బలహీనంగా ఉన్నది. విదేశీ పెట్టుబడిపై ఆధారపడే ఊహాజనిత అభివృద్ధి (గాలిబుడగలాంటి) జరుగుతోంది. ఇది ఎప్పుడైనా పేలిపోవచ్చు. అంతర్జాతీయ ఫైనాన్సు పెట్టుబడి విస్తరణను చూసి ఇదే పెట్టుబడిదారీ అభివృద్ధి అనుకుంటే పొరపాటు. ఈ పెట్టుబడికి స్థిరత్వం ఉండదు. దేశభక్తి, జాతీయత అసలే ఉండదు. ఎక్కడ లాభాలు వస్తే అక్కడికి వెళ్ళిపోతుంది. శత్రు దేశాన్నైనా కౌగిలించుకుంటుంది. సొంత గడ్డనైనా కాదనుకుంటుంది. ఈ అస్థిర స్వభావం కలిగిన పెట్టుబడిని చూసి దేశంలో ఫ్యూడలిజం నాశనమైపోయి పెట్టుబడిదారీ వ్యవస్థ పూర్తిగా విస్తరించి గుణాత్మక దశకు చేరుకుందనుకుంటే అది పొరపాటు అవుతుంది. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీల వర్గ స్వభావాన్ని బట్టి రాజ్యాధికారంలో ఉన్న వర్గాల స్వభావాన్ని అంచనా వేయాలని ఒక వింత వాదన చేస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థిక విధానాలే రాజకీయ వ్యవస్థను శాసిస్తాయి. తద్భిన్నంగా సోషలిజంలో రాజకీయ వ్యవస్థ ఆర్థిక విధానాలను శాసిస్తున్నది. కొంత మంది ఈ వాస్తవాలను తిరగతిప్పి అర్థం చేసుకుంటున్నారు.


పెట్టుబడిని విస్తరించుకునేందుకు అత్యంత విధ్వంసకర, అమానవీయ పద్ధతులకు కూడా పెట్టుబడిదారీ వర్గం పాల్పడుతుంది. నాడు యూరప్‌లో జరిగిన పరిణామాలు నేడు భారతదేశంలో జరుగుతున్నాయి. సహజవనరులను కొల్లగొట్టడం, భూసేకరణ పేరుతో రైతులను భూములనుండి వెళ్లగొట్టి కార్పొరేట్‌ల పరం చేయడం, చిన్న వృత్తిదారులను నాశనం చేయడం, చిన్న పరిశ్రమలను మింగివేయడం, ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటుపరం చేయడం వగైరా పద్ధతులన్నీ పెట్టుబడి విస్తరణకు దోహదపడేవే. ఆర్టికల్ 370 రద్దు, నల్ల వ్యవసాయ చట్టాలు ఇందులో భాగమే. ఈ పద్ధతులనే కార్ల్‌మార్క్స్ "ప్రాథమిక పెట్టుబడి సంచయం" (ప్రిమిటీవ్ ఎక్యుములేషన్ ఆఫ్ క్యాపిటల్) అన్నారు. 2019లో మోడీ రెండవసారి విజయం సాధించాక వ్యవసాయ రంగాన్ని బడా కార్పొరేట్ల చేతుల్లో పెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇందులో వారు విజయవంతమైతే వ్యవసాయ రంగంలో గుణాత్మక మార్పులు రావచ్చు.

చారిత్రక భౌతికవాదంపై అవగాహన ఉన్నవారెవరికైనా కొన్ని విషయాలు సదా గుర్తుంటాయి. ఒకటి : పాత సమాజ గర్భంలో కొత్త సమాజ లక్షణాలు ఆవిర్భవిస్తాయి. ఉదా:- ఫ్యూడల్ వ్యవస్థలోనే మార్కెట్, సరుకుల చలామణి ఉంటుంది. దీనిని బట్టి అది పెట్టుబడిదారీ వ్యవస్థగా మారిందని చెప్పలేం. మన వ్యవసాయ రంగంలో ఇప్పటికీ పారిశ్రామిక పెట్టుబడికన్నా మర్కెంటైల్ (వ్యాపార) పెట్టుబడి ప్రధానపాత్ర వహిస్తున్నది. పెట్టుబడిదారులు తాము తయారుచేసిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, యంత్రాలు భూస్వామ్య, ధనిక రైతాంగానికి అమ్ముకొని లాభపడుతుంటారు. నేరుగా ఇప్పటికీ కార్పొరేట్ పెట్టుబడి వ్యవసాయరంగంలోకి రాలేదు. మోడీ మూడు చట్టాల ద్వారా అలాంటి మార్పుకు బాటలు వేసి విఫలమయ్యాడు. అయితే దొడ్డిదారిని ప్రవేశపెట్టి పథకాలు రూపొందిస్తున్నాడు. భూమిపై కార్పొరేట్ ఆధిపత్యం వస్తే కార్పొరేట్ ఫార్మింగ్ వస్తుంది. రైతులు భూములు కోల్పోతారు. ఇప్పటికీ మనదేశంలో 70% చిన్న, సన్నకారు రైతులే. భూమి గుత్తాధిపత్యం భూస్వామ్య చేతుల్లో ఉంది తప్ప కార్పొరేట్ చేతుల్లోకి మారలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ సంపూర్ణరూపం తీసుకుంటే చిన్న, మధ్య తరహా వృత్తిదార్లు, రైతులు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు అదృశ్యమైపోతాయి. వ్యవసాయంపై పూర్తి కార్పొరేట్ గుత్తాధిపత్యం వస్తుంది. ఈ వ్యవసాయ క్షేత్రాల్లో భూములు కోల్పోయిన రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలుదార్లు ఫామ్ వర్కర్స్‌గా మారిపోతారు. ఈ వ్యవసాయ క్షేత్రాల్లో శాశ్వత కూలీలు పనిచేస్తారు. అటువంటి దశ వస్తే భారతదేశ విప్లవ స్వభావం కూడా మారిపోతుంది. జనతా ప్రజాస్వామిక విప్లవ దశ స్థానంలో సోషలిస్టు విప్లవం కోసం పోరాడాల్సిన ఆవశ్యకత ముందుకొస్తుంది. గుడ్డు పరిపక్వం కాకముందే పిల్ల బయటకు వస్తే బ్రతకదు. నీళ్ళు వేడి కాసినంత మాత్రాన ఆవిరైనట్టు కాదు. గుణాత్మక మార్పు తీసుకుంటేనే మనకు దాని స్వభావంలో మార్పు అర్థమవుతుంది. భారతదేశంలో ప్రస్తుతం పరిమాణాత్మక మార్పులు ఒకదశలో వేగంగా ఒక దశలో నెమ్మదిగా సాగుతున్నాయి. ఇప్పుడు పూర్తిగా స్థంభించిపోయింది. ఇది గుణాత్మక దశకు చేరుకోకుండానే సోషలిస్టు విప్లవమంటూ కేకలు పెడితే అది ఆదర్శవాదమవుతుంది తప్ప వాస్తవికత కాదు. నేటి భారతదేశ వాస్తవిక స్థితిలో భూస్వామ్య, సామ్రాజ్యవాద, బడా బూర్జువా వ్యతిరేక ఐక్య సంఘటన - జనతాప్రజాంతత్ర సంఘటన - నిర్మించడం ద్వారా మాత్రమే సోషలిజానికి పురోగమించగలం. ఈ వ్యూహానికి అనుగుణంగానే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మించటమనే రాజకీయ కర్తవ్యాన్ని సిపిఐ(ఎం) నిర్దేశించుకొంది. మన శక్తులన్నీ వొడ్డీ దాన్ని విజయవంతం చేయాలి. ❊

వ్యవసాయ రంగం

# వ్యవసాయ సంక్షోభం-పరిష్కార మార్గాలు

పాలగుమ్మి సాయినాథ్



రచయిత ప్రముఖ జర్నలిస్టు, మెగసెసె అవార్డు గ్రహీత

**(ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ 27వ తేదీన విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో "వ్యవసాయ సంక్షోభం - పరిష్కార మార్గాలు" అనే అంశంపై జరిగిన సదస్సులో ప్రముఖ పాత్రికేయులు, మెగసెసె అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ చేసిన విశ్లేషణాత్మక ప్రసంగం పాఠాన్ని మార్పిస్తు పాఠకులకు అందజేస్తున్నాం... సంపాదకుడు)**

మన ప్రధాన మంత్రి మోడీగారు రైతుల ఆదాయం ఐదేళ్లలో రెట్టింపు చేస్తానని 2013లో వాగ్దానం చేశారు. అది ఎంతవరకు వచ్చిందో నేషనల్ సాంపిల్ సర్వే, వ్యవసాయంలో పరిస్థితి అంచనా నివేదికల ప్రకారం రైతుల ఆదాయం చూసి లెక్కలు వేశారు. అయితే అది వ్యక్తిగత ఆదాయం కాదు. ఒక కుటుంబానికి ఆదాయం. దానిని లెక్కల ప్రకారం ఒక కుటుంబానికి సగటు ఆదాయం తీస్తే ఏడాదికి 6,426/- వస్తుంది. అంటే ఇంట్లో ఐదుగురు ఉంటే ఒక రైతుకి 1,300/- కూడా రాదు. అయితే ఒక్క ఏడాదిలోపల స్వామినాథన్ కమిటీ రిపోర్టులు అమలు చేస్తాం అని ఎన్నికల సందర్భంగా మోడీ చెప్పారు. చాలా మంది రైతులు ఇది నిజమే అనుకుని నమ్మకం పెట్టుకుని ఓటు వేశారు. 12 నెలలు కాదు, ఒక్క నెలలోనే ప్రభుత్వం స్వామినాథన్ కమీషన్ సిఫార్సులను అమలు చేయలేమని సుప్రీకోర్టుకు వెళ్లి అఫిడవిట్ ఇచ్చింది. మరి దాని తర్వాత ఏమైంది? రైతులకు ఆదాయం రెట్టింపు అయిందా? లేదు. సరికదా వారి పరిస్థితి మరింత దిగజారింది. ఇక్కడ ఒక్క విషయం చెప్పుకోవాలి. కోవిడ్ మహమ్మారి వచ్చిన మొదటి 12 నెలల్లోనే శతకోటీశ్వరుల ఆదాయం రెట్టింపయింది. నేను చెప్పేది రూపాయి కోటీశ్వరుల గురించి కాదు. డాలర్ కోటీశ్వరులు గురించి.

నయా-ఉదారవాద విధానాలు అమలైన నాటి నుండి, అంటే 1991 నుండి ప్రతి ఏడాది గమనిస్తే ఒక విషయం అర్థం అవుతుంది. 1991లో మన దేశంలో ఒక్క డాలర్ శతకోటీశ్వరుడూ లేదు. ఇప్పుడు అంటే 2022లో 180 మంది శత కోటీశ్వరులు అయ్యారు. వీరి మొత్తం ఆదాయం కలిపితే దేశ జిడిపిలో 26 శాతం ఉంది. ఇక్కడ ఎవరికి రెట్టింపు ఆదాయం పెరిగిందో అర్థం చేసుకోవాలి. మరో పక్క రైతులకు ఏమైంది? వారి ఆదాయంలో మూడు భాగాలున్నాయి. ఒకటి వ్యవసాయ పంట నుండి వచ్చే ఆదాయం. ఇంకొకటి పశు సందప నుండి, మరొకటి వ్యవసాయ కూలి నుండి వారికి వచ్చే ఆదాయం. మోడీ ప్రభుత్వం తాము ఇచ్చన వాగ్దానం అమలు చేశాం అని ప్రచారం చేసుకుంటున్నది. రైతుల ఆదాయం చాలా పెరిగిపోయింది, ఎంత పెరిగిపోయింది అంటే రూ.6,500 నుండి రూ. 8,300కు అని ప్రచారం చేస్తోంది. అయితే ఇక్కడ మూడు అంశాల్లో ఎక్కడ పెరిగిందో చూద్దాం. పశువుల ద్వారా వచ్చే సంపాదనలోనూ, కూలి ఆదాయంలోనూ పెరుగుదల నమోదయింది. వ్యవసాయంలో మాత్రం రైతులకు 8 శాతం ఆదాయం తగ్గిపోయింది. కూలీ ఆదాయం పెరగడానికి వెనుక ఒక పెద్ద వైరుధ్యం ఉంది. ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సింది ఏంటంటే, ఎక్కువ మంది రైతులు రోజు కూలీలుగా కూడా పనిచేస్తున్నారు. కనుకనే వారికి ఆదాయం పెరిగింది. పశుసంపాదనలో మరో వైరుధ్యం ఉంది. అదేంటంటే ధనిక రైతులు పెట్టుబడి పెట్టి ఆవుల్ని, గేదెల్ని కొనుగోలు చేసి పెంచడం వల్ల వారికి ఆదాయం వచ్చింది. అయితే చిన్న రైతుకు పెట్టుబడి పెట్టే అవకాశం లేనివారికి ఈ ఆదాయం కూడా రాదు. అందువల్ల ఒక్క వ్యవసాయ ఆదాయమే చూసుకుంటే నికరంగా రైతులకు అదాయం ఈ కాలంలో పడిపోయింది. ఈ ప్రభుత్వ హయాంలో ఒక పక్క శత కోటీశ్వరులు పెరిగిపోతుంటే మరో పక్క రైతులకు ఆదాయం 8 శాతం తగ్గిపోయింది. అయితే ఈ ప్రభుత్వం ఎన్ఎస్ఎస్ నివేదికలోనే మార్పు తీసుకువచ్చి తిమ్మిని బమ్మిని చేయడానికి ప్రయత్నించింది. ఎలాగంటే లెక్కల పద్ధతిలోనే మార్పు తీసుకువచ్చింది. అటువంటి లెక్కల జిమ్మిక్కుల్ని చేసి వారి ఆదాయంలో మార్పు వచ్చిందని చెబుతోంది. కానీ అలా చూసుకున్నా ఐదుగురు ఉన్న కుటుంబంలో మనిషికి ఏడాదికి రూ. 8,300 ఆదాయం ఎలా సరిపోతుంది? ఏ సంఘటిత రంగ ఉద్యోగంలో చూసుకున్నా, ఏ ప్రభుత్వ ఉద్యోగంలో చూసుకున్నా, చివరికి సెక్యూరిటీ గార్డు ఏ ఉద్యోగం చూసుకున్నా కూడా రైతుకు వచ్చే ఆదాయం వారికన్నా తక్కువే ఉంటుంది. రైతు వార్షిక సగటు కుటుంబ ఆదాయం రూ. 8,300కు రెట్టింపు అయినా సరే కూడా వారి ఆదాయం ఇతరుల కంటే తక్కువే ఉంటుంది.

ప్రభుత్వం రైతుల సగటు కుటుంబ ఆదాయం రూ. 8,300కు పెరిగిందిదని చెబుతున్నా దీనితో కుటుంబం మొత్తం ఏలా బతకగలుగుతారు!? ఇది కూడా లెక్కల జిమ్మికుల్ని చేసి చూపిన ఆదాయమే తప్ప అసలైంది కాదు. ఎన్సిఆర్బిలో కూడా ఆత్మహత్యల్లో లెక్కలు తీసుకున్నప్పుడు చాలా మార్పులు తెచ్చారు. 1995 నుండి 2011 వరకు ఒక్క పద్ధతి ఉంది. 2011 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం గణాంకాలను చాలా వరకు తారుమారు చేసింది. 2004 నుండి మీడియాలో దీనికి చాలా ప్రాముఖ్యత ఇచ్చారు. నేషనల్ క్రైం రికార్డు బ్యూరో సంవత్సర నివేదికలో రెండు రిపోర్టులు ఉంటాయి. ఎన్సిఆర్బి, (నేషనల్ క్రైం రికార్డు బ్యూరో) ఏడిఎస్ఐ (యాక్సిడెంటల్ డెత్ సూసైడ్స్ ఇన్ ఇండియా) రిపోర్టులు.

> **"2011లో అమెరికాలోని న్యూయార్క్ నగరంలో 'వాల్ స్ట్రీట్ ముట్టడి' జరిగింది. అప్పటికి అది చరిత్రలోనే పెద్ద పోరాటం. 9 వారాల పాటు సాగింది. మన దేశంలో రైతులు సంవత్సరం పాటు పోరాటం చేశారు. దీంతో వ్యవసాయ సంక్షోభం తీరిందని చెప్పను. వాస్తవానికి సమస్యలు పెరిగాయి. రైతులు చేసిన పోరాటం నుండి సరైన గుణపాఠం నేర్చుకుంటే అదే పెద్ద విజయం."**

బాధాకరమైన విషయం ఏమంటే ఏడిఎస్ఐ రిపోర్టులో 1995 నుండి 2022 వరకు అంటే 27 ఏళ్లల్లో ఆత్మహత్యల్లో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉంటే ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉంది. ఒక్కోసారి రెండో స్థానంలోకి వస్తే 2004 సమయంలో మొదటి స్థానంలోకి వచ్చింది. ఆ సమయంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం వ్యవసాయ సంక్షోభం విషయాన్ని ముందుకు తీసుకువచ్చింది. దాని నుండి ఎన్నో విషయాల్ని తెలుసుకున్నాం. కాని ఇప్పుడు ఈ సంక్షోభం నుండి ఎలా భయటపడాలనే దాన్ని మనం చూడాలి. అయితే ఇక్కడ ఎన్‌సిఆర్‌బిలో లెక్కల్ని తగ్గించాలని 2011లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది ఏలాగంటే... ఒక్క రాష్ట్రంలో ఎన్ని పోలీసు స్టేషన్లు ఉన్నాయో వాటి పరిధిలో ఎంత మంది చనిపోయారో దాన్ని బట్టి లెక్కలు కట్టాలని ప్రకటించింది. జిల్లా క్రైం రికార్డు బ్యూరో నంబర్లు ఇస్తారని చెప్పింది. ఒక రాష్ట్రంలో ఎన్ని జిల్లాలు ఉంటాయో ఆ జిల్లా వాళ్లందరూ డిస్టిక్ క్రైం బ్యూరో డేటా సమీక రించి స్టేట్ క్రైం బ్యూరో రికార్డులో ఇస్తారు. 28 రాష్ట్రాలు, 9 కేంద్ర పాలిత ప్రాంతాలు నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరోకు ఆ లెక్కలు ఇస్తారునే 2007 – 2011 మధ్యలో మీడియా ఆత్మహత్యల పెద్ద ఎత్తున వర్తాలు ఇచ్చింది. ఛతీస్‌ఘడ్ ముఖ్యమంత్రి రమన్ సింగ్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, 2011లో మన రాష్ట్రం రైతుల ఆత్మహత్యలు సున్నా అని ప్రకటించాయి. తార్వత అదొక ట్రెండ్‌గా అయిపోయింది. 2013 వచ్చే సరికి 12 రాష్ట్రాలు, 6 కేంద్ర పాలిత ప్రాంతాలు మొత్తం సున్నా రైతుల ఆత్మహత్యలు అని ప్రకటించాయి. 2014 మోడీ కేంద్రంలో అధికారంలోకి వచ్చారు. అప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే సున్నా ఆత్మహత్యలు ప్రకటించేవి. కానీ 2014 నుండి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని నేషనల్ క్రైం బ్యూరోకి మీరు చేసిన పద్ధతి సరైంది కాదు, నూతన పద్ధతులు తేవాలని చెప్పింది. రైతులను కౌలు రైతులు, సెన్‌ఎస్ డిఫైన్డ్ రైతులు వంటి వేర్వేరు క్యాటగిరీలుగా విభజించి చూడాలని చెప్పింది. అలా చూసినప్పుడు రైతుల ఆత్మహత్యల సంఖ్య 4,200 నుండి 2,100 లకు తగ్గింది.

ఆశ్చర్యకరమైన విషయమేంటే, 2016లో కేంద్ర ప్రభుత్వం పది నెలలపాటు ఎన్‌ఆర్‌బిని పూర్తిగా మూసేసింది. గణాంకాలను బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలంప్‌మెంట్‌లో వేయాలని తెలిపింది. కానీ, చాలా పెద్ద దెబ్బ అక్కడే తగిలింది వాళ్లకు. ఎందుకంటే అసలు 10 నెలల పాటు డేటా లేకుండా పోవడంతో ఈ పని చేయడం కష్టమైంది. అదే కేంద్ర ప్రభుత్వం 10 నెలల తార్వత 2017 ఏప్రిల్లో ఎన్‌ఆర్‌బిని రీ–ఓపెన్ చేసింది. మరి ఇలా లెక్కల్ని తీసుకుంటే రైతుల ఆదాయం గణాంకాలు కూడా ఈ విధంగానే చూపిస్తున్నారు.

2020లో మూడు రైతు చట్టాల్లో సవరణలు తీసుకొచ్చారు. కోవిడ్ మహమ్మారి సమయంలో వీటిని తీసుకొచ్చారు. ఆ సమయంలో రైతులందరూ కలిసి వాటిని తిప్పికొట్టేందుకు ఢిల్లీలో ఎటువంటి పోరాటం చేశారో కూడా మనం చూశాం. కానీ ఏ మీడియాలోనూ దీనిని సరిగ్గా చూపించలేదు. ఇక్కడ రెండు విషయాలు చెప్పాలి. మహామ్మారి సమయంలో చేసిన పోరాటం ఈ ప్రపంచంలోనే అతి పెద్ద శాంతియుత ప్రజా తంత్ర నిరసన కార్యక్రమం. అయితే, వాళ్లు అక్కడ మోడీకి వ్యతిరేకంగా నినాదాలు ఇవ్వలేదు. అంబానీ, ఆదానీలకు వ్యతిరేకంగా ఇచ్చారు. పంజాబ్, హర్యానాలే కాక దేశంలోని అన్ని చోట్ల నుండి రైతులు ఢిల్లీ వచ్చి అంబానీ ఆదానీ పేర్లు చెప్పారు. పంజాబ్ రాష్ట్ర జిడిపి 8,450 కోట్ల డాలర్లు అయితే, అంబానీ వ్యక్తి గత ఆస్తి 10,360 కోట్ల డాలర్లు. ఆదానీ వ్యక్తి గత ఆస్తి 11,600 కోట్ల డాలర్లు. హర్యానా జిడిపి 10,500 కోట్ల డాలర్లు. రెండు అతి పెద్ద డిజిపి ఉన్న రాష్ట్రాలకంటే కూడా కేవలం ఇద్దరి ధనికులు వ్యక్తిగత ఆస్తే ఎక్కువ. అంత తీవ్రమైన పోరాటం కారణంగా ఒక్క సంవత్స రం తార్వత ఆ రైతు చట్టాలను ఉపసంహరించు కుంది ప్రభుత్వం. అందుకే దీన్ని అతి పెద్ద ప్రజాతంత్ర ప్రతిఘటన అని చెప్పుకోవాలి.

2011లో అమెరికాలోని న్యూయార్క్ నగరంలో 'వాల్ స్ట్రీట్ ముట్టడి' జరిగింది. అప్పటికి అది చరిత్రలోనే పెద్ద పోరాటం. 9 వారాల పాటు సాగింది. మన దేశంలో రైతులు సంవత్సరం పాటు పోరాటం చేశారు. దీంతో వ్యవసాయ సంక్షోభం తీరిందని చెప్పను. వాస్తవానికి సమస్యలు పెరిగాయి. రైతులు చేసిన పోరాటం నుండి సరైన గుణపాఠం నేర్చుకుంటే అదే పెద్ద విజయం. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎన్ని అడ్డంకులు వచ్చినా, ఎన్ని సమస్యలు వచ్చినా వాటిని ఏ మాత్రం లెక్క చేయకుండా రైతులు ఎదుర్కొన్నారు. నీటి ట్యాంకర్లను, హైవేపైన అడ్డుకున్నవాటిని సైతం లెక్క చేయని వాళ్లు మనకు అనేక విషయాల్ని నేర్పారు.

ఇప్పుడు ఈ కేంద్ర ప్రభుత్వం 75 ఏళ్ల స్వాతంత్ర్య మహోత్సవం గురించి చాలా గొప్పగా చెప్పుకుంటోంది. కాని నిజానికి ఈ 75 ఏళ్ల కాలంలో ఒక కొత్త తరం వచ్చింది. ఈ 75 ఏళ్ల స్వాతంత్ర్యోత్సవాలు దేని గురించి చేస్తున్నాం అన్న విషయాన్ని గురించి వారికి ఎవరూ చెప్పలేదు. అంతటి గొప్ప స్వాతంత్ర్య సంగ్రామం ఏమైంది. బ్రిటీష్‌లకు వ్యతిరేకంగా పోరాడాం. ఈ పోరాటంలో మూడు కోట్ల మంది జనంతమ ప్రాణ త్యాగం చేశారు. కానీ 75 ఏళ్ల స్వాతంత్ర్యం పేరుతో ప్రభుత్వం రెండు పెద్ద కార్యక్రమాల్ని చేసింది. అందులో మొదటిది 100 కోట్ల పెట్టుబడి పెట్టి ఒక పెద్ద వెబ్‌సైట్‌ను ప్రారంభించడం. రెండోది ఆజాదీకా అమృత్ మహోత్సవ్. అయితే, ఆ వెబ్‌సైట్ హోం పేజీలో ఒక్క స్వాతంత్ర్య సమర యోధని ఫొటోగానీ, వీడియోగానీ, ఆర్టికల్‌గానీ, స్టేట్‌మెంట్‌గానీ లేదు. ఎవరి ఫొటోలున్నాయో మీరే చూడండి. ఇప్పుడు స్కూల్‌కి వెళ్లే పిల్లలు ఆ వెబ్‌సైట్ చూస్తే మన స్వాతంత్ర్య సమర యోధులు నరేంద్ర మోడీగారే నని అనుకుంటారు. దాంతోపాటు హర్ ఘర్ తిరంగా అనే నినాదం ముందుకు తీసుకొచ్చారు. దానికి మన జాతీయ జెండా న్యాయ కోడ్‌లోనే మార్పు చేశారు. చట్టంలో ఫ్లాగ్ కోడ్ అని ఒక కోడ్ ఉంది. దాని ప్రకారమే మన జాతీయ జెండా ఖాదీతో తయారు చేయా లని ఉంది. ఆ చట్టాన్ని సవరించి జెండాని పాలిస్టర్ గుడ్డతో చేసుకోవచ్చని మార్చారు. దీని వల్ల ఎంత మంది నేతగాళ్లు దివాళా తీశారో తెలుసా..! నేత గాళ్లకు ఏడాదిలో రెండు

సార్లు ఆదాయం వస్తుంది. ఒకటి స్వాతంత్ర్య దినోత్సవం నాడు, రెండు గణతంత్ర దినోత్సవ నాడు. కాని హర్ ఘర్ తిరంగా... పేరుతో పాలిస్టర్ గుడ్డ ప్రవేశ పెట్టడంతో నేత పరిశ్రమ ఒక్కసారిగా మూతపడిపోయింది. అయితే ఇక్కడ పెండా అనేది కేవలం రంగులతో ఉన్న బట్ట కాదు.. జెండా వెనుక ఎంతో చరిత్ర ఉంది. అదొక గొప్ప భావ వ్యక్తీకరణ. దానిని కూడా వీళ్లు నాశనం చేశారు. తమిళనాడులో, యుపిలో, ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని గ్రామాలు ప్రత్యేకంగా జెండాలు నేస్తారు. ఈ సారి ఖాదీ పరిశ్రమలకు ఒక్క కాంట్రాక్టూ ఇవ్వని కారణంగా నేతగాళ్లంతా దివాళా తీశారు.

కోవిడ్ మహమ్మారి సమయంలో 2020 మార్చి 24 రాత్రి ప్రధాన మంత్రి మోడీ ఉపన్యసిస్తూ 140 కోట్ల మంది ప్రజలు తమ పనులనూ, వ్యాపారాల్ని షట్‌డౌన్ చేయాలని చెప్పారు. నాలుగు గంటల్లో లాక్‌డౌన్ అని ప్రకటించారు. ఎంత తీవ్రమైన నష్ట వచ్చిందో మనకు తెలియంది కాదు. అప్పుడే 2020 జూన్‌లో కొత్త వ్యవసాయ చట్టాలను తీసుకు రావా లని వారికి ఆలోచన వచ్చింది. ఏడాది పాటు తీవ్రమైన నిరసన తెలపడంతో వాటిని ఉపసంహరించుకున్నారు. కానీ ఆ చట్టాలను అయితే తిప్పికొట్టినప్పటికీ ఇంకా తీవ్రమైన నష్టాల్ని, తీవ్రమైన వ్యవసాయ సంక్షోభాన్ని మాత్రం ఎదుర్కొంటూనే ఉన్నాం.

ప్రభుత్వం, బహుళజాతి కంపెనీలు.. వీళ్లే అజండా సెట్ చేస్తున్నారు. మరోవైపు రైతులు ఈ సంక్షోభం నుండి బయటకు పడేందుకు రకరకాలుగా ప్రయత్నిస్తున్నారు. అయితే వ్యవసాయంలో కొత్త కొత్త సమస్యలు వచ్చాయి. నేను అనంతపురంలోనూ, రాయలసీమలోనూ ప్రత్యక్షంగా చూసిన సమస్య గురించి చెబుతాను. ఆ సమస్యేమంటే, వాతావరణం మార్పు. వాతావరణ మార్పు సమస్య ఆంధ్రప్రదేశ్‌లో ఎంత తీవ్రంగా ఉందంటే అనంతపురంలోని దర్గాహోనూర్ గ్రామంలో మూడు వేల ఎకరాల భూమి 30 ఏళ్లల్లో పూర్తిగా ఎడారిలాగా మారిపోయింది.. ప్రభుత్వం దీనిని ఏమాత్రం పట్టించుకోదు. నా ఉద్దేశంలో వ్యవసాయంలో నిష్ణాతుడు కేవలం రైతు మాత్రమే. కాబట్టి ఈ సమస్యల నుండి బయట పడేందుకు... రైతులుగా మనమే ఈ పరిస్థితుల్ని అర్థం చేసుకోవాలి, మనమే స్టడీ చేయాలి, మనమే అందుకు తగిన పరిష్కారాల్ని ముందుకు పెట్టాలి. ఇదిలా ఉంటే విశాఖపట్నంలో మత్స్యకారులకు ఎంతో పెద్ద దెబ్బ తగిలింది. పర్యావరణంలో వచ్చిన అనేక మార్పుల కారణంగా తీర ప్రాంతాల్లో అనేక మంది మత్స్య కార్మికులకు ఉపాధి

**“ ప్రభుత్వం, బహుళజాతి కంపెనీలు.. వీళ్లే అజండా సెట్ చేస్తున్నారు. మరోవైపు రైతులు ఈ సంక్షోభం నుండి బయటకు పడేందుకు రకరకాలుగా ప్రయత్నిస్తున్నారు. అయితే వ్యవసాయంలో కొత్త కొత్త సమస్యలు వచ్చాయి. ఆ సమస్యేమంటే, వాతావరణం మార్పు. వాతావరణ మార్పు సమస్య ఆంధ్రప్రదేశ్‌లో ఎంత తీవ్రంగా ఉందంటే అనంతపురంలోని దర్గాహోనూర్ గ్రామంలో మూడు వేల ఎకరాల భూమి 30 ఏళ్లల్లో పూర్తిగా ఎడారిలాగా మారిపోయింది. ”**

పోయింది. ఎవరు దీనిని పట్టించుకుంటున్నారు? వ్యవసాయంలో బహుళ జాతి కంపెనీలు, అదానీ, అంబానీలు రకరకాల మార్పుల్ని చేస్తుంటే.. వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలోకి కూరుకుపోతోంది. వాటికి స్పందిస్తున్నాం. కానీ ఆ విధానాలను పూర్తిగా మన చేతుల్లోకి తీసుకోగలగాలి. రైతులే అజండాని సెట్ చేయాలి.

ఈ 20 ఏళ్లలో రెండు పెద్ద మంచి మార్పులు జరిగాయి. ఒకటి నేషనల్ కమిషన్ ఆఫ్ ఫార్మర్స్ కమిటీ చేసిన ఎం.ఎస్. స్వామి నాథన్ కమిషన్ రిపోర్టు. దీన్ని ఈ దేశంలో మొదటి వ్యవసాయ బ్లూ ప్రింట్ అని చెప్పవచ్చు. ఆ సమయంలో యుపిఏ ప్రభుత్వం అధికారం లో ఉంది. ఆ తర్వాత ఎన్‌డిఏ ప్రభుత్వం వచ్చింది. ఈ రిపోర్టులో 5 నివేదనలు, 6 వాల్యూమ్స్ ఉన్నాయి. ఇందులో రైతుల కోణం నుండి పూర్తిగా రకరకాల సూచనలతో రాసి ఉన్నాయి. 2004 డిసెంబర్‌లో పార్లమెంట్‌లో మొదటి రిపోర్టు ఇచ్చారు. 2006 అక్టోబర్‌లో ఫైనల్ రిపోర్టు అయిన 5 వది ఇచ్చారు. ఈ రోజు వరకు పార్లమెంట్‌లో ఒక్క గంట కూడా దీనిపైన చర్చ చేయలేదు. పార్లమెంట్‌లో వ్యవసాయ సంక్షోభంపైన ప్రత్యేక సమావేశం జరిపి చర్చించాలని మనమంతా డిమాండ్ చేస్తున్నాం. అంతేకాదు, అన్ని రాష్ట్రాల శాసన సభల్లోనూ ఒక ప్రత్యేక సమావేశం దీనికోసం జరపాలని కోరుతున్నాం. కాని బాధాకరమైన విషయం ఏమంటే, స్వామినాథన్ కమిషన్ రిపోర్టుని అన్ని రకాలుగానూ చంపేశారు. ఇప్పటికి ఆ రిపోర్టు వచ్చి 18 ఏళ్లు పూర్తవు తుంది. 18 ఏళ్లలో వాతావరణంలోనే కాకుండా చాలానే మార్పులు వచ్చాయి. చివరికి ఈ సంక్షోభం ఉచ్చులోనే రైతుల్ని ఉంచారు. అయితే ఇప్పుడు పోరాడవల్సింది కేవలం రైతు ఉనికి కోసం మాత్రమే కాదు. దీర్ఘకాలంలో వ్యవ సాయంలో చేయవల్సిన అనేక మార్పులపైన కూడా మనం ఆలోచన చేయాల్సి ఉంటుంది. 20 ఏళ్లు పాటు వ్యవసాయ సంక్షోభంపై పోరాటం సాగింది. అందు కోసం ఈ దేశ రైతులందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పాలి. ఇది కేవలం రైతు కోసం చేసే పోరాటం మాత్రమే కాదు, దేశంలో ఉన్న ప్రతి పౌరుని ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కోసం ఈ పోరా టం సాగింది.

ముఖ్యమైన విషయమేమంటే, గతంలోనూ అనేక రకాల కమిషన్లు వేశారు. కానీ కమిషన్ పేరుతో కొంత సమయాన్ని సాగతీయడం తప్ప మరో ఉపయోగం ఏం జరగలేదు. అయితే ఇటువంటి ఎన్ని కమిషన్లు వేసినా అందులో బహుళజాతి కంపెనీలను, అంబానీ, ఆదానీలు అజండా సెట్ చేస్తున్నారు తప్ప, రైతులను కూర్చొబెట్టడం లేదు. కాబట్టి నేను చెప్పాలను కుంటుందేంటంటే.. మనకు ఒక కొత్త కమిషన్ కావాలి. అది కోర్టు నియంత్రించేదో, లేక ప్రభుత్వం నియంత్రించేదో లేక బహుళజాతి కంపెనీల నియంత్రించేవో కాదు. మనకు జాతీయ కిసాన్ కమిషన్ ఉండాలి. ఇది కేవలం రైతులు, రైతు కూలీల ఆధ్వర్యంలోనే ఉండాలి. ఇది కేవలం కొంత మందితో కాదు.. మొత్తం ఆల్ ఇండియా కిసాన్ కమిషన్‌గా ఉండాలి. అందుకోసం ప్రత్యేక అధ్యయనంతోపాటు గ్రామ స్థానిక స్థాయి వరకు కూడా కృషి జరగాలి. అందుకు ప్రత్యేకంగా రైతులు దీనిపై చర్చించి అందుకు తగిన ఆచరణ చేయాలి ఉంటుంది. అప్పుడే ఒక కొత్త కమిషన్ సాధ్యపడుతుంది. ఇది సాధ్యమే అని ఏడాది పాటు రైతులు చేసిన పోరాటమే దీనికి నిదర్శనం అని నేను బలంగా నమ్ముతున్నాను.

అంతేకాదు, రకరకాల పద్ధతుల్ని అనుసరించి ఎటువంటి విత్తనాలు మంచివి, ఏ వాతావరణంలో ఎటువంటి పంట వేయాలి, ఏ భూ సారంలో ఏది పండుతుంది వంటివి కేవలం ఎడ్వర్టైజ్‌మెంట్ ద్వారా కాకుండా స్వయంగా రైతే వీటిపై శ్రద్ధ తీసుకోవాలి. ఎందుకంటే, రైతు సమస్యను మరెవరో పట్టించు కోరు. రైతు సమస్య రైతే పట్టించుకోవాలి. మేమంతా బయట నుండి ఆందోళనలు చేస్తున్నా సమస్యను మాత్రం రైతే పరిష్కరించుకోగలడు అని గట్టిగా నమ్ముతున్నా. ❊

**పుస్తక సమీక్ష**

# ఆర్ఎస్ఎస్ లోతుపాతులు

**వై రాము**



రచయిత డి.వై.ఎఫ్.ఐ రాష్ట్ర అధ్యక్షులు


"ఇది 21 వ శతాబ్దం. మనం దేవుడ్ని ఎంతకు దిగజార్చాం? మనకి శాస్త్రీయ దృష్టి ఉండాలని (రాజ్యాంగంలోని) ఆర్టికల్ 51 చెబుతుంది. మతం పేరుతో జరుగుతున్న దేమిటి? ఇది విషాదం...."- సుప్రీంకోర్టు

అక్టోబరు 20, 2022 న సుప్రీంకోర్టులో దాఖలైన ఒక పిటీషన్‌పై విచారణ సందర్భంగా కె.ఎమ్.జోసెఫ్, హృషీకేష్ రాయిలతో కూడిన ధర్మాసనం పైవిధంగా వ్యాఖ్యానించింది. స్వేచ్ఛా, సౌభ్రాతృత్వం ఉన్న దేశంలో ద్వేషం, విద్వేషాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ద్వేష పూరిత ప్రసంగాలు ఎవరు చేసినా సుమోటొగా కేసు ఫైల్ చేయాలని ఢిల్లీ, ఉత్తరాఖండ్, యు.పి పోలీసులకు ఆదేశాలిచ్చింది. కోర్టు వాఖ్యలు నేటి దేశ కాలమాన పరిస్థితులను తెలుపుతున్నాయి. ఈ పరిస్థితికి కారణం మతతత్వ భావజాలంతో ప్రజల మధ్య విద్వేషాన్ని పెంచిన సంస్థలు, రాజకీయ పార్టీలే. ముఖ్యంగా ఆర్.ఎస్.ఎస్, దాని పరివారం గత 97 ఏళ్లగా చేస్తున్న విష ప్రచారమే కారణం.

అర్.ఎన్.ఎన్ పై చాలా పుస్తకాలు వచ్చాయి కాని ఇటీవల కర్నాటకలోని దళిత రచయిత, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత అయిన దేవనూరు మహాదేవ రాసిన "ఆర్.ఎస్.ఎస్ ఆల మత్తు అగల" (ఆర్.ఎస్.ఎస్ లోతు పాతులు) పుస్తకం సంచలనం రేపింది. ఆయన రాసిన 64 పేజీల పుస్తకం ఆర్.ఎస్.ఎస్ ని ఉలిక్కిపడేట్లు చేసింది. రచయిత వివరించిన అంశాలకు అనివార్యంగా స్పందించాలిన అవసరం ఏర్పడింది. కన్నడ భాషలో వెలువడిన నెల రోజుల్లోనే లక్షా 2 వేల కాపీలు అమ్ముడుపోయాయి. పుస్తకంపై పాక్షికంగా హక్కులు ఇవ్వడంతో కర్నాటకలోని 30 సంస్థలు దాన్ని అచ్చువేసాయి. తెలుగు. తమిళం, మళయాలం, హిందీ, ఇంగ్లీషు భాషలలోకి అనువదించబడింది. తెలుగులో 7 ప్రచురణ సంస్థలు కలిపి ఆర్.ఎస్.ఎస్ లోతు పాతులు పేరుతో ముద్రించాయి. ఇతర సంస్థలు కూడా ముద్రించి పంపిణి చేస్తున్నాయి. ప్రజాతంత్ర వాదులకు, సామరస్యం కోరుకొనేవారికి ఈ పుస్తకం కరదీపికగా మారిపోయింది.

**ఇంతటి ఆదరణకు కారణాలేంటి?**

కర్నాటక అసెంబ్లీకి వచ్చే ఏడాది ఎన్నికలు జరగబోతున్నాయి. ఆ నేపధ్యంలోనే బి.జె.పి, ఆర్.ఎస్.ఎస్ లు తమ హిందుత్వ రాజకీయ ఎజెండాతో మరోమారు అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూస్తున్నాయి. అందుకే హిజాబ్, ఆజాన్, హలాల్ వంటి విషయాలను వివాదాలుగా మార్చి దేశమంతటా చర్చనీయాంశం చేసి లబ్ది పొందాలని చూస్తున్నాయి. ఈ క్రమంలోనే మైసూరుకి చెందిన 74 ఏళ్ల దేవనూరు మహాదేవ తనదైన సరళమైన చక్కని శైలిలో, అద్భుతమైన ఉపమానాలతో సరళమైన కథలతో ఆర్.ఎస్.ఎస్ నాడి పట్టుకుని దాని ఉద్దేశ్యాలు, ఎజెండాను ఈ పుస్తకంలో వివరించారు. ఆర్.ఎస్.ఎస్ దీని పై దాడిని తీవ్రం చేసింది. దాని అనుబంధ పత్రికల్లో నిశితంగా విమర్శిస్తూ పతాక శీర్షికన కథనాలు రాసింది. పోటీ కథనాలు నడుపుతూ పెద్ద ఎత్తున్న కౌంటర్ ప్రచారానికి దిగింది.




ఆర్.ఎస్.ఎస్ రెచ్చగొట్టే చర్యలు, దాని అనుబంధ సంస్థలు చేసిన వికృత చేష్టలు, బి.జె.పి ప్రభుత్వం సృష్టించిన ఇబ్బందులు ఈ పుస్తకం రాయడానికి నన్ను పురికొల్పాయని రచయితప్రకటించారు. ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు, కర్నాటక ప్రొటెక్షన్ ఆఫ్ రైట్ టు ఫ్రీడమ్ ఆఫ్ రెలిజియన్ (ఆర్డినెన్స్-2022) పాఠ్యపుస్తకాలు మార్చటం, ముఖ్యంగా పాఠ్యపుస్తకాల్లో హెడ్గెవార్ గురించి చేర్చటాన్ని వ్యతిరేకించారు. కన్నడ సంస్కృతికి వ్యతిరేకంగా బసవన్న ఆలోచనలను చంపేసి, హెడ్గెవార్ గురించి చెబుతారా అంటూ దేవనూరు మహాదేవ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ సందర్భంగానే ఆర్.ఎస్.ఎస్ ప్రాణం ఎక్కడుందో తెలుసుకునే ప్రయత్నంలో దాని కంపుకొట్టే బావిలోకి తొంగి చూసానని చెప్పారు,

రచయిత విశ్లేషణ ప్రకారం ఆర్.ఎస్.ఎస్ 3 మూల స్తంభాలపై ఆధారపడింది. అవి

1. చాతుర్వర్ణ వ్యవస్థను, మనుస్మృతిని రుద్దడం.
2. ఆర్యుల ఆధిపత్యం.
3. ఫెడరలిజాన్ని దెబ్బతీయడం.

చాతుర్వర్ణ వ్యవస్థను దేశంలో పునరుద్దరించడం ద్వారా మనుస్మృతిని సులభంగా అమలు చేయవచ్చని ఆర్.ఎస్.ఎస్ భావిస్తుంది. ఈ చాతుర్వర్ణ వ్యవస్థలోని అసమానతలను, బానిసత్వాలను ధర్మబద్ధం చేయడానికి, దాన్ని ఆధునీకరించి ఆకర్షణీయంగా మలచడానికి ఎన్ని కట్టుకథలు చెప్పటానికైనా వెనకాడట్లేదు.

**భగవద్గీతను మహాభారతంలో**

### చేర్చిందెవరు?

అర్.ఎస్.ఎస్ కట్టుకథలకి ఉదాహరణగా 'దేమ' భగవద్గీతను తీసుకున్నారు. దేశంలో పుడుతున్న ప్రతి బిడ్డనూ చాతుర్వర్ణ తాళ్లతో బిగుతుగా కట్టేసే కుట్రగా భగవద్గీతను వర్ణించారు. ఇది ఏ స్థాయికి వెళ్లిందంటే స్వయంగా భగవంతుడే చెప్పాడని ప్రజల్ని నమ్మించేంతగా. భగవద్గీతకు సంబందించి అసలు భగవద్గీత ఏ కాలం నాటిది? భగవద్గీత మూల గ్రంథంలో కృష్ణుడు చాతుర్వర్ణం గురించి చెప్పినట్లు ఉందా? అని ప్రశ్నించాడు. వివేకానందుడు భగవద్గీత విశ్వసనీయత గురించి మాట్లాడుతూ ఇలా అన్నాడు. "శంకరాచార్యులే భగవద్గీత కర్త, దానిని ఆయనే మహాభారతంలో చేర్చారు".

ఇతర మతాలకు సంబంధించి జైన, బౌద్ధ, సిక్కు, లింగాయుత మొదలయిన మతాలు చాతుర్వర్ణ్యాన్ని నిరాకరిస్తాయి. పరివార్ శక్తులు వాటిని తమలో ఇముడ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. కానీ ఇస్లాం, క్రైస్తవ మతాలు అలాకాదు. అవి చాతుర్వర్ణ వ్యవస్థకు లొంగడం లేదు. అందుకే అర్.ఎస్.ఎస్ కి వాటిపై తీరని ద్వేషం. గోల్వాల్కర్ ప్రతిపాదించిన విధంగా "విదేశీయులకు ఉండేవి రెండే మార్గాలు. ఒకటి ప్రజాబాహుళ్యంలో తమను తాము ఐక్యం చేసుకోవడం, రెండు ప్రజాబాహుళ్యపు కృపాకటాక్షాలు లభించినంతకాలం ఇక్కడ ఉండి, వారు అభ్యంతరం వ్యక్తం చేయగానే తిరిగి తమ పుణ్యభూమి స్థానాలకు వెళ్లిపోవడం". ఈ విషయాన్ని దేవనూరు మహాదేవ జాత్యాహంకారపు దృష్టికోణం నుండి స్పష్టంగా విశ్లేషించారు.


### "సింధు నాగరికత" కాదు "సరస్వతి నాగరికత"

> **❝ రచయిత ప్రస్తావించిన మరో కీలకమైన ఆంశం ఆర్య జాతి ఔన్నత్యం. ఆదివాసులకి సంబంధించి వారిని మూల నివాసులుగా అంగీకరించట్లేదు. వారి పేరును సైతం వన వాసీలుగా మార్చేసింది. ఆదివాసుల్ని వనవాసీలుగా పేర్కొంటూ ఆదివాసీ అస్తిత్వాన్నే దెబ్బతీయాలని చూస్తోంది. ఆర్యులు బయటి నుండి వచ్చారనే చారిత్రక వాస్తవాన్ని మరుగు పర్చడానికి అష్టకష్టాలు పడుతోంది. ❞**

రచయిత ప్రస్తావించిన మరో కీలకమైన ఆంశం ఆర్యజాతి ఔన్నత్యం. ఆదివాసులకి సంబంధించి వారిని మూల నివాసులుగా అంగీకరించట్లేదు. వారి పేరును సైతం వన వాసీలుగా మార్చేసింది. ఆదివాసుల్ని వనవాసీలుగా పేర్కొంటూ ఆదివాసీ అస్తిత్వాన్నే దెబ్బతీయాలని చూస్తోంది. ఆర్యులు బయటి నుండి వచ్చారనే చారిత్రక వాస్తవాన్ని మరుగుపర్చడానికి అష్టకష్టాలు పడుతోంది. అందుకే సింధు నాగరికత కాదు సరస్వతి నాగరికత అని చరిత్రకు వక్రబాష్యాలు చెబుతోంది.

### ఏది భారతీయత?

"భారతదేశం సర్వ ధర్మ, మత ఆధ్యాత్మిక ప్రయోగాల నేల, ఇదే భారతీయ సంస్కృతి, ఇదే భారతీయ వారసత్వం, దీనినే భారతీయత అంటారు" అని దేవనూరు వివరిస్తూ ద్వేషం, అసహనం, మతోన్మాద బురదలో భారతీయతను మంటగల్పుతున్నారని చెప్పారు. మత స్వేచ్ఛ రక్షణ చట్టం పేరుతో మత మార్పిడిని నిరోధించి, రాజ్యాంగం ఇచ్చిన వ్యక్తి స్వాతంత్ర్యాన్ని కాలరాస్తున్నారనీ, ఇది రాజ్యాంగానికి తూట్లు పొడవటమే అవుతుందని పేర్కొన్నారు. రచయిత మాటల్లో చెప్పాలంటే ఇది "రాజ్యాంగ సంహారం" "మనుధర్మ శాస్త్ర ప్రతిష్ఠాపన".



దేవనూరు మహాదేవ

''ద్వేషం, అసహనం, మౌఢ్యం – ఇలాంటివాటిని సృష్టించి చిచ్చు పెట్టేస్తే మొదట అది తనను సృష్టించినవారి ఇష్టానుసారంగా కాలుతూ పోయినా చివరికి అది కాల్చి బూడిద చేసేది మాత్రం తన సృష్టికి కారణమైన వారినే"....


"అర్.ఎస్.ఎస్ లోతు పాతులు" పుస్తక రచయిత దేవనూరు మహదేవ పైన చెప్పిన విషయాన్ని బట్టి అర్.ఎస్.ఎస్ ను ఎంత లోతుగా అర్థం చేసుకున్నారో స్పష్టమౌతుంది. పుస్తకం సరళంగా, సూటిగా ఉన్నప్పటికీ కొన్ని పదాలు, కొటేషన్లు పదే పదే పునరావృతం కావడం పాఠకుడికి అసౌకర్యంగా అనిపించినా సాగిపోయింది. అర్.ఎస్.ఎస్ ని ఒక మాయల ఫకీర్‌తో పోల్చారు. మాయల ఫకీరు ప్రాణం సప్త సముద్రాల ఆవల చిలకలో ఉన్నట్లుగా, అర్.ఎస్.ఎస్ ప్రాణం కులంలో ఉందని రచయిత అభిప్రాయంగా అర్థమవుతుంది. కానీ ఊడల మర్రిలా అన్ని శాఖల్లోకి, అన్ని ప్రాంతాలకు విస్తరిస్తూ పోయిన సంఘ్ పరివార్ శక్తి ఒక్క కుల పోరాటంతోనే అంతమవ్వదు.

నిజానికి ఆర్ఎస్ఎస్ అసలు ప్రాణం నయా–ఉదారవాద విధానాల అమలులో ఉంది. కాంగ్రెస్ కన్నా మిన్నగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు సేవలో ఆర్ఎస్ఎస్ దాని రాజకీయ విభాగమైన బిజెపి, దాని అధినేత నరేంద్ర మోడీ తరించి పోతుండడం వల్లనే ఈ దేశంలో దాని మతోన్మాద విధానాల ప్రచారానికి కార్పొరేట్ శక్తులనుండీ, దాని మీడియా నుండి పెద్ద ఎత్తున సహాయం లభిస్తోంది. నరేంద్ర మోడీ పాలన అటు మతోన్మాదం, ఇటు నయా–ఉదారవాద కాక్‌టైల్ విధానాల పరిపాలన. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలతో దేశ వనరులను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా దోచి పెడుతోంది. మరోవైపు ఈ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజల నుండి ప్రతిఘటన రాకుండా వారిని విభజించేందుకు దేశంలోని అన్ని ప్రాంతాల్లో మతవిద్వేషాలు రెచ్చగొట్టడానికి మతోన్మాద విధానాలు అమలు చేస్తోంది. ప్రతిగా కార్పొరేట్లనుండి దానికి అన్ని విధాలా సహాయం లభిస్తోంది. అందువల్ల మతోన్మాదానికి వ్యతిరేకంగా జరిపే పోరాటాన్ని నయా–ఉదారవాద విధానాలతో విడదీసి చూడలేము.

భారతీయ సమాజంలో లోతైన పొరల వరకూ చొచ్చుకుపోయిన దాన్ని వేర్ల నుండి కుళ్ళగించి పెరికేయాలి. ఏక కాలంలో సామాజిక, రాజకీయ, సాంస్కృతిక పోరాటాల మేళవింపుతో చేస్తేకాని ఇది సాధ్యపడదు. ❋

మతతత్వం

# బిజెపి, సంఘ్ పరివార్ పెరుగుదలకు కారణాలు



రచయిత సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

**బి.వి.రాఘవులు**

(గత సంచిక తరువాయి)

మతోన్మాదం అనేది ఆధునిక కాలానికి సంబంధించిన అంశం. భారతదేశంలో మతోన్మాదం 19వ శతాబ్దం మధ్య నుండి ఉనికిలో ఉందని చెప్పవచ్చు. అది 20వ శతాబ్దంలో మరింత శక్తివంతమయింది, మరింతగా విస్తరించింది. మతోన్మాదం అప్పటి నుండి ఉన్నప్పటికీ 20వ శతాబ్దం 60వ దశకం నుండి మాత్రమే ప్రజల మద్దతు పొందగలిగింది.

నయా ఉదారవాద కాలం అధికార నడవల్లోకి దానికి దారులు తెరిచింది.

వలసవాద కాలానికి ముందు మతభావనలు, మత వైషమ్యాలు స్థానికంగానే ఉండేవి. భాష, జాతి, కులం, ప్రాంతానికి సంబంధించిన బంధాలు మత బంధం కన్నా ముఖ్యమైనవిగా ఉండేవి. గత రెండు శతాబ్దాల రాజకీయాలు, వలసవాదం మూలంగా సమాజంలో వచ్చిన మార్పుల వల్ల ఒకే ఏకీకృత హిందూ మత సమూహంగా ఉండటం అవసరం అన్న భావనఏర్పడింది. వలసవాద కాలంలో మతోన్మాదం పెరగనారంభించింది.

### స్వాతంత్ర్యానికి పూర్వ కాలం

భారతదేశం యావత్తు స్వాతంత్ర్యం కోసం పోరాటం చేస్తూ ఉంటే ఆరెస్సెస్, దాని అనుబంధ సంస్థలు మతం పేరుతో ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి పనిచేశాయి. స్వాతంత్ర్యోద్యమానికి అది దూరంగా ఉంది. మత ఘర్షణల సమయంలో మాత్రం అన్ని కార్యకలాపాలలో ఎంతో చురుగ్గా పనిచేసింది.

బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేయడం అభివృద్ధి నిరోధకమైనదని, నిజమైన స్వాతంత్ర్య పోరాటం ముస్లిములను వదిలించుకోవడానికి చేయాలని గోల్వాల్కర్ చెప్పాడు.

ఆరెస్సెస్ 1925లో స్థాపించబడినప్పటికీ స్వాతంత్ర్యోద్యమ వీరులు దానిలో ఎవరూ లేరు. ఎందువల్లనంటే ఆరెస్సెస్ బ్రిటిష్ వలసవాదులపై పోరాటంలో ఏ విధంగాను భాగస్వామి కాలేదు. వారి ఆదర్శమూర్తుల్లో ఒకరు విడి సావర్కార్. ఆయనను సంఘపరివార్ గొప్ప స్వాతంత్ర్యపోరాట యోధునిగా, దేశభక్తునిగా చూపిస్తుంది. 2002లో ఎన్‌డిఏ ప్రభుత్వం అండమాన్ విమానాశ్రయానికి ఆయన పేరు సైతం పెట్టింది. కాని బ్రిటిష్ వారిని క్షమాభిక్ష కోరడానికి నిరాకరించి ప్రాణత్యాగానికి సిద్ధపడిన భగత్ సింగ్, సుఖదేవ్, అష్ఫఖుల్లా లాంటి జాతీయోద్యమ వీరులకు భిన్నంగా, బిజెపి భావజాల పితగా కీర్తించబడుతున్న ఈ సావర్కార్ అండమాన్ జైలులో నిర్బంధించబడినప్పుడు బ్రిటిష్ వలస పాలకులను దయ చూపమని వేడుకున్నాడు. భారత స్వతంత్ర పోరాటంలో ఆరెస్సెస్ పాత్ర అంత సిగ్గుమాలినది. 1930లు, 40ల నాటి బ్రిటిష్ వ్యతిరేక ప్రజాపోరాటాలు – 1930–31 శాసనోల్లంఘనోద్యమం, 1942 క్విట్ ఇండియా ఉద్యమం, ఆజాద్ హింద్ ఫౌజ్, 1945 ఐఎన్ఏ విచారణకు వ్యతిరేకంగా పోరాటాలు, బొంబాయిలో ఆర్ఐఎన్ తిరుగుబాటు– వీటన్నింటి నుండి ఆరెస్సెస్ దూరంగా ఉంది.

హిందూమహాసభ సింధ్ రాష్ట్రంలో ముస్లిం లీగుతో కలిసి సంకీర్ణ ప్రభుత్వంలో పాల్గొంది. ఆ ప్రభుత్వ హయాంలో సింధ్ అసెంబ్లీ పాకిస్తాన్ ఏర్పాటు డిమాండ్‌ను అంగీకరిస్తూ తీర్మానం చేసింది. శ్యాం ప్రసాద్ ముఖర్జీ, ఇతర హిందూమహాసభ నాయకులు ఆ ప్రభుత్వం నుండి వైదొలగరాదని భావించారు. ఎల్‌కె అద్వానీ గురువు, అప్పటి హిందూమహాసభ అధ్యక్షుడు సావర్కార్ ఆ ప్రభుత్వ పదవుల్లో కొనసాగాలని, ప్రభుత్వ రోజువారీ కార్యకలాపాలలో పాల్గొనాలని, ప్రభుత్వం నుండి రాజీనామా చేయరాదని ఆదేశాన్ని జారీ చేశాడు. హిందూమహాసభ సభ్యులు ఉద్యోగాలలోనే కొనసాగాలని, క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించాలని1942 అగస్టు 31న హిందూమహాసభ తీర్మానం చేసింది కూడ.

స్వాతంత్ర్యానంతరం కూడ త్రివర్ణ జాతీయ పతాకాన్ని ఆరెస్సెస్ వ్యతిరేకించింది.

బ్రిటిష్ వలసవాద ప్రభుత్వం కూడ తన సామాజిక, రాజకీయ, పాలనా నిర్ణయాలకు రిఫరెన్స్‌గా మతాన్ని గుర్తించడం ద్వారా మత సమూహాలు ఏర్పడటానికి దోహదపడింది. 1857 తర్వాత హిందూ ముస్లిం సమూహాలు వేరువేరుగా పరస్పర ద్వేషభావంతో ఉండేట్లు చేయవలసిన అవసరం బ్రిటిష్ వలస ప్రభుత్వ విధానంలో ముఖ్యమైన అంశాలలో ఒకటి. వలస పాలకులు ముస్లిం మతతత్వవాదులను ప్రోత్సహించి వినియోగించుకున్నారు.

19వ శతాబ్దంలో బ్రిటిష్ వారి జనాభా లెక్కల సేకరణ కసరత్తు కూడ ఒకే మతం అన్న భావన బలపడటానికి దోహదపడింది. మన మతం వారిమి ఎంత సంఖ్యలో ఉన్నాం అన్న స్పృహ మొదలయింది. 1892లో ప్రభుత్వ కౌన్సిళ్ళలో మతప్రాతిపదికన ప్రాతినిధ్య వ్యవస్థను బ్రిటిష్ వారు ప్రవేశపెట్టారు. ఈ విధానం మత అస్తిత్వాలను రాజకీయం చేసింది. ఈ కాలంలోనే హిందూ మతోన్మాదం కూడ రూపుదాల్చింది. వలసవాద కాలంలో సామాజిక, సాంస్కృతిక పరిణామాలు కూడ మత సామూహిక పరమయిన సంఘీభావాలు ఏర్పడటానికి దోహదం చేశాయి. ఆర్య సమాజం, హిందూమహాసభల కార్యకలాపాలు, శుద్ధి, సంఘటన లాంటి వాటి కార్యక్రమాలు, వాటికి సమాంతరంగా ముస్లిముల పాన్ ఇస్లామిక్ సంస్థలు (ప్రపంచ

వ్యాపితంగా ముస్లింలను కలిపి ఉంచే), అవి చేపట్టిన తబ్లీజ్, తంజీమ్ లాంటి కార్యక్రమాలు ఈ రెండు మతాలను ఆచరించే వారి మధ్య మతపరమయిన అస్తిత్వాలను బలోపేతం చేశాయి. స్వాతంత్ర్యోద్యమం కూడ బలంగా ఉన్న ఉత్తర భారత దేశంలో కాంగ్రెస్ నాయకత్వంలోని పెద్ద సెక్షను అన్ని ఉమ్మడి ఉద్యమాలు, పోరాటాలలో పాల్గొంటూనే, ప్రత్యేకించి 1920ల తర్వాత హిందూ మతాన్ని కాపాడుకోవాలి, బలోపేతం చేయాలి అనే భావజాలంతోను, కార్యకలాపాలతోను ప్రగాఢంగా ప్రభావితులయ్యారు. జాతీయ సమైక్యతను నెలకొల్పడానికి స్వాతంత్ర్యోద్యమం మతపరమైన చిహ్నాలను స్వీకరించింది. అయితే దీనిలో విభజన ధోరణి కూడ ఉంది. జాతీయ ఔన్నత్య భావనను కల్గించడానికి గణేశ ఉత్సవాలు, శివాజీ జయంతులను ఉపయోగించుకోవడం మతపరమైన భావనలను బలంగా పాదుకొల్పాయి. కాంగ్రెస్ నాయకత్వంలోని జాతీయోద్యమం ప్రజానంబంధాలలో అనునరించిన లౌకికతత్వానికి మతపరమైన చాయ లేకపోలేదు.

> వలస పాలన కాలంలో బ్రిటిష్ అధికారులు, చరిత్రకారులు భారతదేశ చరిత్రను మత ప్రాతిపదికన వివిధ దశలుగా విభజించడం ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రోత్సహించింది. దీనిలో హిందువులు, ముస్లిములు పరస్పరం శత్రుభావం కలిగిన రెండు మతాలకు చెందిన వారు అన్న భావన ఉంటుంది. హిందూయిజం అనేది ప్రాచీన భారతం నుండి వారసత్వంగా సంక్రమించిన మతం అన్న భావన ఏర్పడటా నికి 19వ శతాబ్దిలో ఓరియంటలిస్టులు ముఖ్యపాత్ర నిర్వహించారు.

వలస పాలన కాలంలో బ్రిటిష్ అధికారులు, చరిత్రకారులు భారతదేశ చరిత్రను మత ప్రాతిపదికన వివిధ దశలుగా విభజించడం ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రోత్సహించింది. దీనిలో హిందువులు, ముస్లిములు పరస్పరం శత్రుభావం కలిగిన రెండు మతాలకు చెందిన వారు అన్న భావన ఉంటుంది. హిందూయిజం అనేది ప్రాచీన భారతం నుండి వారసత్వంగా సంక్రమించిన, ఒక్కటిగా బలంగా పెనవేసుకున్న పొందికైన మతం అన్న భావన ఏర్పడటానికి 19వ శతాబ్దంలో ఓరియంటలిస్టులు ముఖ్యమైన పాత్ర నిర్వహించారు.

### స్వాతంత్ర్యానంతర కాలం

60వ దశకం ఆరంభం వరకు మతోన్మాదం స్థూలంగా లోలోపలే ఉండింది. కాని ఆరెస్సెస్, జమాయితె ఇస్లామి, ముస్లింలీగ్, అకాలీదళ్ లాంటి మతతత్వ సంస్థలు, ఇంకా క్రిస్టియన్ మతతత్వ గ్రూపులు తమ కార్యకలాపాలను కొనసాగించాయి. ఆరెస్సెస్ రాజకీయ విభాగంగా 1951లో భారతీయ జనసంఘ్ స్థాపించబడింది. ఈ కాలంలో సృష్టించబడిన ఉపాధి, ఇంకా ఇతర అవకాశాలు మధ్యతరగతి అవసరాలను కొంత తీర్చాయి. స్వాతంత్ర్యం లభించిందన్న ఉత్సాహం, స్వాతంత్ర్యోద్యమంలో పెంపొందిన జాతీయ భావన ఈ కాలంలో లౌకిక వాతావరణాన్ని కాపాడాయి.

60ల తర్వాతి పరిణామాలు సృష్టించిన వాతావరణం మతోన్మాద శక్తుల ఆవిర్భావానికి అనుకూలంగా ఉంది. ఆర్థికాభివృద్ధి తన తొలి పూవును కోల్పోయింది. నిరుద్యోగం విస్తరించడానికి, ప్రజల్లో అసంతృప్తికి అది దారితీసింది. మతతత్వ శక్తులతో సహా అస్తిత్వ రాజకీయాలు ఆవిర్భవించడానికి సానుకూల ప్రాతిపదికను సృష్టించింది. 1961లో జబల్పూర్‌లో జరిగిన మత అల్లర్లు పెరుగుతున్న మతోన్మాద ప్రమాదాన్ని దేశం ముందు నిలబెట్టాయి.

మతోన్మాద భావనలను రెచ్చగొట్టడానికి ఆరెస్సెస్ గోరక్షణ అంశాన్ని ఒక ప్రధాన రాజకీయ సాధనంగా వినియోగించుకుంది. గోల్వాల్కర్ నాయకత్వంలో 1960లలో గోరక్షణ ఉద్యమాన్ని నిర్వహించింది. 1966 డిసెంబరు 16న దాదాపు లక్షమంది జనం ఈ అంశంపై పార్లమెంటు భవనాన్ని ముట్టడించడానికి బయలుదేరారు. దేశవ్యాపితంగా గోవధ నిషేధాన్ని విధించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనసంఘ్ మద్దతుతో నాగసాధువులు బల్లేలు, త్రిశూలాలు తిప్పుకుంటూ ఈ ప్రదర్శన జరిపారు.

ఈ ఉద్యమం ద్వారా తలెత్తిన మత భావోద్వేగాన్ని 1967 ఎన్నికల్లో ఓట్లు రాబట్టేందుకు జనసంఘ్ వినియోగించుకుంది. 'జనసంఘ్‌కు వేసే ఓటు గోరక్షణకు వేసే ఓటే' అనే నినాదంతో అది ఎన్నికల్లో ప్రచారం చేసింది. దీని ద్వారా జనసంఘ్ బలం లోక్ సభలో 1962లో 14 ఉంటే, 1967 కు అది 35 కు పెరిగింది. 1967లో ఆ పార్టీ ఉత్తర భారతదేశంలో కొన్ని రాష్ట్రాల్లో సంకీర్ణ ప్రభుత్వాలలో కూడ భాగస్వామి అయింది.

సంఘపరివార్, జనసంఘ్‌లు గుజరాత్, బీహార్‌లలో విద్యార్థి ఉద్యమాలలోను, అలాగే సంపూర్ణ విప్లవ ఉద్యమంలోను చురుగ్గా పాల్గొన్నాయి. అవినీతి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో ఈ ఉద్యమాలు జరిగాయి. వీటన్నింటి ద్వారా జనసంఘ్ బూర్జువా రాజకీయ పార్టీల ప్రధాన స్రవంతిలో ప్రవేశించింది. ఎమర్జెన్సీ తర్వాత జనసంఘ్ కొత్తగా ఏర్పడిన జనతా పార్టీలో విలీనమయింది. జనతా పార్టీ ఉమ్మడి ప్రతిపక్షంగా సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి, స్వాతంత్ర్యం తర్వాత మొట్టమొదటి కాంగ్రెసేతర కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. జనతా పార్టీ భాగస్వామిగా సంఘపరివార్ విభాగాలు కేంద్ర ప్రభుత్వ యంత్రాంగంలో భాగస్వాములయ్యాయి.

ద్వంద్వ సభ్యత్వ సంక్షోభం ఫలితంగా జనతా ప్రభుత్వం కుప్పకూలిపోగా, సంఘపరివార్ తన రాజకీయ విభాగాన్ని 1980 ఏప్రిల్‌లో భారతీయ జనతా పార్టీ (బిజెపి)గా పునరుద్ధరించింది. ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదగడానికి తన కృషిని ప్రారంభించింది. తన మతోన్మాద రాజకీయ పునాది అయిన అగ్రవర్ణాలు, పైకి ఎదుగుతున్న మధ్యతరగతి వర్గాలలో తన స్థానాన్ని పటిష్ట పరుచుకునేందుకు 1980లలో సాగిన రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాలను సంఘపరివార్ వినియోగించుకుంది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా అగ్రవర్ణాలు చేపట్టిన ఈ ఉద్యమంలో ఆరెస్సెస్ అగ్రభాగాన ఉంది.

తొలిదశలో ఒక రాజకీయ పార్టీగా బిజెపి తన మతతత్వ ముఖానికి ముసుగు వేయడానికి ప్రయత్నించింది. అయినా సంఘపరివార్ మాత్రం దేశవ్యాపితంగా మతపరమయిన విభజనను పెంచడానికి ఉపయోగపడే సమస్యలను చేపట్టడానికి అత్యంత చురుగ్గా పనిచేయసాగింది. 1983 నవంబరులో విహెచ్‌పి ఏకాత్మతా యజ్ఞాన్ని నిర్వహించింది. దీనిలో భాగంగా 'హిందూయిజం ప్రమాదంలో ఉంది' అనే

> **" మతపరమయిన భావోద్వేగాలను వినియోగించుకుంటూ మతతత్వ జ్వాలలను మండించగలిగిన అంశాన్ని రామజన్మభూమి సమస్యలో ఆరెస్సెస్, బిజెపిలు కనుగొన్నాయి. 1983లో రామజన్మభూమి 'విముక్తి'ని డిమాండ్ చేస్తూ విహెచ్‌పి ఒక సుడిగాలి ప్రచారాన్ని నిర్వహించింది. అప్పటి నుండి సంఘపరివార్ ఈ అంశంపై నిర్విరామంగా పనిచేసింది. చివరికి 1992 డిసెంబరు 6న బాబ్రీ మసీదును నేలమట్టం చేసేవరకు కొనసాగింది. "**

నినాదంతో గంగా జలాన్ని దేశమంతటా తిప్పింది. 1985లో బాబ్రీమసీదు భూయాజమాన్యంపై సుప్రీం కోర్టు తీర్పు, షాబాను కేసులో సుప్రీం తీర్పును వమ్ము చేయడానికి ముస్లిం మహిళల హక్కుల బిల్లు తీసుకురావడం, 1985 కోర్టు తీర్పులో బాబ్రీ మసీదు గేట్లను హిందూ భక్తులు ప్రార్థన చేసుకోవడానికి తెరవడం– ఇవన్నీ దేశంలో హిందూ మత భావోద్వేగాలు రెచ్చగొట్టడానికి పుష్కలమయిన అవకాశాలు కల్పించాయి. బిజెపి, సంఘపరివార్‌లు వీటిని సంపూర్ణంగా వినియోగించుకున్నాయి. 1989 నవంబరు 9న విశ్వహిందూ పరిషత్ రామమందిర శిలాన్యాస్ కార్యక్రమాన్ని నిర్వహించింది. 1990 అగస్టులో రామభక్తి, లోక్ శక్తి పేరుతో ఎల్‌కె అద్వానీ దేశవ్యాపిత రథయాత్రను నిర్వహించాడు. ఈ రథయాత్ర వెనుక ప్రధాన ఉద్దేశం విపి సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తానని చేసిన ప్రకటన ప్రభావాన్ని నీరుగార్చడం, తన అగ్రవర్ణ పునాదిని పటిష్ట పరుచుకోవడం. 1990 అక్టోబరు 30న యుపిలో ములాయం సింగ్ ప్రభుత్వం రథయాత్రను నిలిపివేసినప్పుడు జరిగిన పోలీసు కాల్పుల్లో చనిపోయిన వారి అస్తికలను మతఉద్రేకాలను రెచ్చగొట్టడానికి అమరవీరులకు నివాళి పేరుతో దేశంలోని వివిధ ప్రాంతాలలో ప్రదర్శించారు. తన రాజకీయ లక్ష్యాలను మరింత ముందుకు తీసుకుపోయేందుకు సంఘపరివార్, బిజెపి నాయకులతో సహా తన ఉన్మాద అనుయాయులను పెద్ద సంఖ్యలో సమీకరించి అర్ధసైనిక బలగాలు మౌనప్రేక్షకుల మాదిరి చూస్తున్న సమయంలో బాబ్రీమసీదును నేలమట్టం చేసింది.

మతపరమయిన భావోద్వేగాలను వినియోగించుకుంటూ మతతత్వ జ్వాలలను మండించగలిగిన అంశాన్ని రామజన్మభూమి సమస్యలో ఆరెస్సెస్, బిజెపిలు కనుగొన్నాయి. 1983లో రామజన్మభూమి 'విముక్తి'ని డిమాండ్ చేస్తూ విహెచ్‌పి ఒక సుడిగాలి ప్రచారాన్ని నిర్వహించింది. అప్పటి నుండి సంఘపరివార్ ఈ అంశంపై నిర్విరామంగా పనిచేసింది. అది చిట్టచివరికి 1992 డిసెంబరు 6న బాబ్రీ మసీదును నేలమట్టం చేసేవరకు కొనసాగింది. ఈ హిందూత్వ మతోన్మాదీకరణ ఫలితం ఏమంటే, 1996 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి బలం ఒక్కసారిగా 161 సీట్లకు ఎగబాకింది. అప్పటినుండి రామజన్మభూమి – బాబ్రీ మసీదు సమస్యను ప్రతి ఎన్నికల్లోను వినియోగించుకోవడం జరుగుతూ వచ్చింది.

సోవియట్ యూనియన్ కుప్పకూలడం, దేశంలో నయా ఉదారవాద విధానాలు ఆరంభం కావడం కూడ బిజెపి తన బలాన్ని అంతకంతకూ పెంచుకోవడానికి అనుకూల వాతావరణాన్ని సృష్టించాయి. 1998–1999 లో అది మిత్రుల సహకారంతో అటల్ బిహారీ వాజ్‌పాయ్ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. ఆ తర్వాత దశాబ్దం వరకు బిజెపి అధికారంలోకి రాలేకపోయింది. అయినప్పటికీ ఆ కాలంలో తనను తాను పటిష్టపరుకోవడం మాత్రం కొనసాగించింది. 2014 లోను, 2019 లోను అత్యధిక స్థానాలు సంపాదించుకొని, 2002 గుజరాత్ నరమేధ నిర్మాతలైన నరేంద్ర మోడీ, అమిత్ షాల నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్నది.

హిందూత్వ మతోన్మాద సమీకరణ బిజెపికి గణనీయమైన ఎన్నికల ఫలితాలను తెచ్చిపెట్టింది. 1984 పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి 2 స్థానాలు, 7.3 శాతం ఓట్లు లభించాయి. 1989 ఎన్నికల్లో 85 సీట్లు, 11.5 శాతం ఓట్లు లభించాయి. 1991 ఎన్నికల్లో 120 స్థానాలు, 20.1 శాతం ఓట్లు సంపాదించింది. 1996 సార్వత్రిక ఎన్నికల్లో 161 స్థానాలు, 21.34 శాతం ఓట్లు లభించాయి. 1998 ఎన్నికల్లో బిజెపి స్వంతంగా 180 స్థానాలు, 26 శాతం ఓట్లు సంపాదించింది. ఆ ఎన్నికల్లో మిత్రులతో కలిసి బిజెపి కూటమికి 249 సీట్లు, 37.4 శాతం ఓట్లు లభించాయి. 2004 సార్వత్రిక ఎన్నికల తర్వాత ఆ పార్టీ దశాబ్దం పాటు అధికారంలోకి రాలేకపోయినప్పటికీ, 2014 లోను, 2019 లోను అధిక స్థానాలతోను, అధిక శాతం ఓట్ల తోను అధికారంలో కొనసాగుతున్నది. 2014 ఎన్నికల్లో బిజెపికి 282 స్థానాలు, 31 శాతం ఓట్లు లభించాయి. మొత్తం మిత్రులతో కలిపి ఎన్‌డిఏ కూటమికి 336 స్థానాలు లభించాయి. 2019 ఎన్నికల్లో బిజెపికి 303 స్థానాలు, 37.36 శాతం ఓట్లు లభించాయి. మొత్తం ఎన్‌డిఏ కూటమికి 353 స్థానాలు లభించాయి.

ఎన్నికల ఎత్తుగడల రీత్యా హిందూత్వ మతోన్మాద నినాదాల ప్రాధాన్యతలో హెచ్చు తగ్గులున్నప్పటికీ, వివిధ అంశాలను చేపట్టడంలో సంఘపరివార్ విభాగాల మధ్య పనివిభజన కొనసాగింది. బిజెపి రాజకీయ కార్యకలాపాలలో హిందూత్వను నొక్కిచెప్పడం కీలకమైన అంశంగా కొనసాగింది. గోవధపై పూర్తి నిషేధం, ఉమ్మడి పౌరస్మృతిని తీసుకురావడం, ముస్లిముల చొరబాటు మూలంగాను, వారి అదుపులేని సంతానోత్పత్తి రేటు మూలంగాను స్వంత దేశంలోనే హిందువులు మైనారిటీలుగా మారే ప్రమాదం, మసీదులను నిర్మించేందుకు ధ్వంసం చేయబడిన దేవాలయాలను ప్రత్యేకించి అయోధ్య, కాశీ, మధురలలో పునరుద్ధరించడం, భారతదేశ చరిత్రను తిరగ రాయడం, రాజ్యాంగ మూల స్వరూపాన్ని మార్చివేయడం, మైనారిటీలను బుజ్జగించడం, విదేశీయుల చొరబాట్లు, మైనారిటీ కమిషన్లను రద్దు చేయడం, జమ్ము కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగం 370 అధికరణాన్ని తొలగించడం – వీటన్నింటిని కూడ ఎన్నికల ప్రచారాస్త్రాలుగా ఓట్లు సంపాదించుకోవడానికి వినియోగించుకుంటున్నది.

సంప్రదాయంగా తనకు బలం లేని ప్రాంతాలకు బిజెపి తన ప్రజా పునాదిని విస్తరింపచేసుకోవాలంటే, ఎన్ని పార్టీలతో వీలుంటే అన్ని పార్టీలతో రాజకీయ, ఎన్నికల పొత్తులు పెట్టుకోవాలి. కేంద్రంలో అధికారం సంపాదించడానికి పూర్తిగా హిందూత్వమతోన్మాదంపై ఆధారపడే వ్యూహాన్ని

❝ స్వాతంత్ర్యానంతర భారతదేశంలో పెద్ద సంఖ్యలో నూతన రాజకీయ శక్తులు వివిధ స్థాయిలలో ఆవిర్భవించాయి. వీటిలో అనేకం లౌకికవాదులమని చెప్పుకుంటూనే అవకాశం దొరికినపుడు, అధికారం యావతో బిజెపికి మద్దతు ఇవ్వడానికి వెనకాడటం లేదు. ఈ మద్దతు మూలంగా గతంలో తాము సంపాదించుకోలేక పోయిన ఒక రకమైన అంగీకారాన్ని లేదా చట్టబద్ధతను మతోన్మాద సంస్థలు పొందుతున్నాయి.❞

అనుసరించడం సరిపోదని బిజెపి గుర్తించి అనేక ప్రాంతీయ పార్టీలతో పొత్తుల కోసం ప్రయత్నించింది. కొన్ని ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవడంలో విజయవంతమయింది. ప్రాంతీయ పార్టీల సహకారంతో అడుగు పెట్టిన బిజెపి, దాన్ని వినియోగించుకొని అనేక రాష్ట్రాలలో తన స్వంత బలాన్ని విస్తరించుకుంది.

బిజెపి ఎన్నికల్లో విజయం సాధించాలంటే కేవలం అగ్రవర్ణాల ఓట్లపై ఆధారపడితేనే సరిపోదు. క్రింది కులాల వారి ఓట్లను కూడ అది ఆకర్షించగలగాలి. అది ఒక పద్ధతి ప్రకారం సామాజిక ఇంజనీరింగ్ వ్యూహాలను అనుసరించింది. నూతన సామాజిక గ్రూపుల నుండి ఎన్నికల మద్దతు సంపాదించుకోవడానికి, వివిధ కులాల్లోని సంపన్నులకు, ఉప కులాలకు, గిరిజన సమూహాలకు మధ్య ఉన్న రాజకీయ, ఆర్థిక శత్రుత్వాలను వినియోగించుకుంది.

మతోన్మాద శక్తుల పెరుగుదల, విస్తరణ, నయా ఉదారవాద విధానాల ఆరంభం, సోషలిస్టు శిబిరం పతనం – ఒకే సమయంలో జరిగాయి. అంతర్జాతీయ ఫైనాన్స్ సంస్థల ఆధ్వర్యంలో అమలు చేయబడిన నయా ఉదారవాద విధానాల ఫలితంగా నిరుద్యోగం పెరగడం, ప్రజల ఆర్థిక స్థితిగతులు మరింత క్షీణించడం మతోన్మాద శక్తులు తమ పునాదిని పెంచుకోవడానికి అనుకూల వాతావరణాన్ని కలుగ చేశాయి.

నయా ఉదారవాద సమయంలో తమ ప్రయోజనాలను మరింతగా కాపాడతాయన్న ఉద్దేశంతో భారత కార్పొరేట్లు, అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిదారులు దేశంలో అత్యంత నియంతృత్వ స్వభావం కలిగిన సంఘపరివార్‌ను, దాని రాజకీయ విభాగమైన బిజెపిని ప్రోత్సహిస్తున్నారు. సమగ్రతా ధోరణులు ఒకవైపున, విచ్ఛిన్నకర శక్తులు మరోవైపున ఉండి, అస్థిరతకు గురైన రాజకీయాలతోను, సమాజంతోను వ్యవహరించడానికి రాజకీయ హిందూయిజమే మెరుగైనదని బడా బూర్జువా వర్గం కూడ భావిస్తున్నది.

ఆర్థిక సంస్కరణల ప్రధాన లబ్ధిదారులైన పట్టణ ప్రాంత మధ్యతరగతి వర్గం తమ ప్రయోజనాలను మరింత ముందుకు తీసుకుపోవడానికి అవరోధంగా ఉండే అస్తవ్యస్త రాజకీయ పరిస్థితి నుండి రక్షణను కోరుకుంటున్నారు. వారి విశేష ప్రయోజనాలను రక్షించుకోవడానికి రాజకీయ హిందూయిజమే ముఖ్యమైన సాధనమని వారు భావిస్తున్నారు. ప్రయోజనకరమైన, భద్రత లక్ష్యంగా కలిగిన శాంతి భద్రతల ప్రభుత్వ వాగ్దానం మధ్యతరగతి ఆకాంక్షలైన అధికారం, క్రమబద్ధత, పటిష్టతలకు అనుగుణంగా ఉంటుంది.

స్వాతంత్ర్యానంతర భారతదేశంలో పెద్ద సంఖ్యలో నూతన రాజకీయ శక్తులు వివిధ స్థాయిలలో ఆవిర్భవించాయి. వీటిలో అనేకం లౌకికవాదులమని చెప్పుకుంటూనే అవకాశం దొరికినపుడు, అధికారం యావతో బిజెపికి మద్దతు ఇవ్వడానికి వెనకాడటం లేదు. ఈ మద్దతు మూలంగా గతంలో తాము సంపాదించుకోలేక పోయిన ఒక రకమైన అంగీకారాన్ని లేదా చట్టబద్ధతను మతోన్మాద సంస్థలు పొందుతున్నాయి.

హిందూత్వ మతోన్మాద భావజాలాన్ని వ్యాపింపచేయడంలో మీడియా కూడ పాత్ర వహించింది.

1992 తర్వాత అనేక కేసుల్లో సుప్రీం కోర్టు వెలువరించిన వ్యాఖ్యానాలు తరచు అస్పష్టంగాను, కప్పదాటు వైఖరితోను ఉంటున్నాయి. అవి ఛాందస భావజాలం అభివృద్ధి చెందటానికే దోహదపడుతున్నాయి.

మతోన్మాదాన్ని ఎదుర్కొనడంలో రాజ్య యంత్రాంగం మెతకదనం వహించడం, కొన్ని సందర్భాలలో కుమ్మక్కవడం కూడ దానికి దోహదపడుతున్నది.

### గొప్ప వ్యక్తుల పేర్ల దుర్వినియోగం

హిందూ జాతీయవాదానికి దోహదపడేలా సంఘపరివార్ గాంధీ, పటేల్, అంబేద్కర్, బోస్, భగత్‌సింగ్ మొదలైనవారిని వినియోగిచుకుంటున్నది. అది నెహ్రూను వేరుచేస్తుంది. హిందూ జాతి ఎదుర్కొంటున్న అన్ని రుగ్మతలకు ఆయనే కారణమని నెహ్రూను పెద్ద విలన్‌గా చిత్రించడానికి ప్రయత్నిస్తుంది. గాంధీని హత్య చేసిన గాడ్సేను గొప్ప జాతీయవాదిగాను, దేశభక్తునిగాను కీర్తిస్తుంది. గాంధీని జాతిపితగా అది అంగీకరించదు. ఎందువల్లనంటే భారతదేశం ఒక జాతిగా అనాది కాలం నుండి వున్నదని అది విశ్వసిస్తుంది.

ఒక పెద్ద అబద్ధాన్ని పదే పదే చెబితే అదే నిజం అన్నట్లు కన్పిస్తుందన్న గోబెల్స్ ప్రచార సూత్రాన్ని ఆరెస్సెస్ మరింత పకడ్బందీగా అమలు చేస్తుంది. ఆరెస్సెస్, బిజెపి నాయకులు రెండు నాల్కల ధోరణితో మాట్లాడతారు. ప్రతి అంశం మీద వారికి రెండు రకాలైన వైఖరులుంటాయి. ఒక రకం, తీవ్ర హిందూత్వ మతోన్మాద వైఖరి, రెండవ రకం, తక్షణం ప్రజల్లోకి తీసుకు పోవడానికి, ప్రజల కళ్ళు కప్పడానికి ఉద్దేశించిన శుద్ధి చేయబడిన వైఖరి.

ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికి, మతోన్మాద భావనలను ముందుకు తీసుకు వెళ్ళడానికి సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలను ఆరెస్సెస్ పెద్ద ఎత్తున చేపడుతుంది.

ఆరెస్సెస్ భావాలేవీ అసలైనవి కావు, అన్నీ పాశ్చాత్య సిద్ధాంత వేత్తల నుండి అరువు తెచ్చుకున్నవే. ఒక భావజాలంగా ఫాసిజాన్ని వారు ఇటలీ, జర్మనీల నుండి తెచ్చుకున్నారు. అమెరికాలోని వర్ణదురహంకార మితవాద క్రైస్తవం నుండి సృష్టిత్వవాదాన్ని తెచ్చుకున్నారు. జర్మనీ నిర్వహించిన వర్ణ జన్యు ప్రయోగాల నుండి గర్భ శాస్త్రాన్ని తెచ్చుకున్నారు.

### మతోన్మాద వ్యతిరేక పోరాటం

**1.** మెజారిటీ మతోన్మాదం, మైనారిటీ మతోన్మాదం రెండూ ప్రమాదకరమైనవే. ఇవి రెండూ కూడ మతోన్మాదాన్ని లోతుగా వ్యాపింపచేస్తాయి. దేశ సమైక్యత, సమగ్రతలకు చేటు కల్గిస్తాయి. వారు ఎవరికైతే ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకుంటారో, వారిలో మెజారిటీ ప్రజానీకపు ప్రయోజనాలకు అవి

> **"పాఠశాల పూర్వదశలోను, పాఠశాల దశలోను సంఘ పరివార్ ప్రచారాన్ని ఎదుర్కొనేందుకు టీచర్లు, సామాజిక, సైన్సు ఉద్యమాల సహాయంతో చొరవ తీసుకోవాలి. అన్ని పట్టణాల లోను బాలోత్సవాలను నిర్వహించాలి. ఈ విషయంలో ఆంధ్ర అనుభవం ఉప యోగకరంగా ఉంది. పాఠశాల దశ లోనే లేత మనస్సు లను చేరుకోవడానికి ఇది చక్కటి మార్గం."**

విరుద్ధం. అవి రెండూ పరస్పరం ఒకదాని కొకటి బలం చేకూర్చుకుంటాయి. అందుచేత రెండింటికి వ్యతిరేకంగా పోరాటం చేయడం అనేది ముఖ్యమైనది. కాని మెజారిటీ మతోన్మాదంగా ఉన్న హిందుత్వ మతోన్మాదం రాజ్యాధికారాన్ని చేజిక్కించుకొని, రాజ్యాన్ని తన ఎజెండాకు అనుకూలంగా వినియోగించు కోవడానికి ప్రయత్నిస్తున్నది. అందుచేత మెజారిటీ మతోన్మాదాన్ని ఎదుర్కొనడానికి మరింత కృషి అవసరం.

**2.** హిందుత్వ మతోన్మాదానికి వ్యతిరేకంగాను, ఇతర మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగాను బహుముఖ పోరాటం జరపాలి. ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక, సాంస్కృతిక, సామాజిక – ఇలా అన్ని రంగాలలోను ఈ పోరాటం జరగాలి. ఈ పోరాటం మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా మాత్రమే కాదు, ప్రజల్లోని విస్తారమైన సెక్షన్లలో నెలకొన్న మతోన్మాద భావాలకు వ్యతిరేకంగా కూడ జరగాలి. ఈ శక్తులను బలహీనం చేయాలంటే తీవ్రమైన, దీర్ఘకాలిక పోరాటం చేయాల్సి ఉంటుంది.

**3.** నయా ఉదారవాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగాను జరిపే పోరాటాలు పరస్పర సంబంధం కలిగినవి. ప్రజల జీవన భృతి సమస్యలపై జరిపే పోరాటాలను, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగాను, హిందుత్వ మతోన్మాద భావజాలానికి వ్యతిరేకంగాను జరిపే పోరాటాలను ఒక సమగ్ర దృక్పథంతో చేపట్టాల్సి ఉంది. ఈ పోరాటాలను సమన్వయం చేయడం ద్వారా మాత్రమే మనం మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా జనాన్ని సమీకరించగలం.

### సామాజిక గ్రూపులు

**4.** హిందుత్వ మతోన్మాద భావజాలం కులంలోను, పురుషాధిక్యంలోను ఇమిడి ఉండటంతో, కులానికి వ్యతిరేకంగా జరిపే పోరాటం, మహిళల అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటం హిందుత్వ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా జరిపే పోరాటంలో ఒక ముఖ్యమైన రంగంగా ఉంటుంది. సంఘపరివార్ ప్రబోధిస్తున్న మనుధర్మానికి ప్రధాన బాధితులైన దళితులను, మహిళలను, గిరిజనులను, మైనారిటీలను సామాజిక, ఆర్థిక న్యాయం ప్రాతిపదికన పెద్దఎత్తున సమీకరించాలి. ఆరెస్సెస్ సంస్థల బహుముఖ కార్యకలాపాలను ఎదుర్కోవాలంటే ఆదివాసీ ప్రాంతాలలోను, దళితులలోను మన నిర్మాణ కృషిని ముమ్మరం చేయాలి. బలహీన వర్గాలను తన పలుకుబడి క్రిందకు తెచ్చుకోవడానికి సంఘపరివార్ అనుసరించే తెలివైన సోషల్ ఇంజనీరింగ్ వ్యూహాన్ని దీని ద్వారా మాత్రమే మనం ప్రతిఘటించగలం. కుల వ్యతిరేక ఉద్యమాలను నిర్వహిస్తున్న వ్యక్తులను, సంస్థలను ప్రోత్సహించడం, కులాంతర వివాహాలను ప్రోత్సహించడం చేయాలి.

**5. ముస్లింలలో పనిచేయడం :** ముస్లింలలో మనం చేస్తున్న లౌకికవాద కార్యకలాపాలు మతపెద్దలకు, ఛాందసవాద శక్తులకు రుచించవు. కొన్ని సమస్యల సందర్భంగా, ఉదాహరణకు ఎన్ఆర్సి లాంటి వాటి విషయంలో మాదిరి వారు మన పట్ల స్నేహపూర్వకంగా ఉన్నప్పటికీ, సాధారణ ముస్లింలను మననుండి దూరంగా ఉంచడానికే వారు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తుంటారు. ముస్లిం జనబాహుళ్యంతో మనం సంబంధాలు పెంచుకోవాలంటే, రాజకీయ జోక్యంతో పాటు, విస్తారమైన సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలి, ముస్లిం మతంలో సామాజిక సంస్కరణల కోసం పనిచేస్తున్న వ్యక్తులకు, సంస్థలకు సహాయపడాలి.

### సైద్ధాంతిక పోరాటం

**6.** మీడియా నిర్వహించే కపటమైన, విస్తారమైన ప్రచారాన్ని, సంఘపరివార్ పాల్పడే నోటి మాటల ప్రచారాన్ని ఎదుర్కొనేందుకు తీవ్రమైన సైద్ధాంతిక పోరాటం చేయాల్సిన అవసరం ఉంది.

**ఎ.** హిందుత్వ, ఇంకా ఇతర రకాలయిన మతోన్మాద శక్తుల అభివృద్ధి నిరోధక, విచ్ఛిన్నకర స్వభావాన్ని ఎండగట్టేందుకు జరిపే ప్రచారోద్యమంలో వినియోగించుకునేందుకు తేలికైన, సులభంగా ప్రజల్లోకి వెళ్ళగలిగిన సైద్ధాంతిక, రాజకీయ సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలి. చర్చాగోష్టులు, బహిరంగ సభలు, కరపత్రాలు, ఇంకా ఇతర రకాలయిన ఆందోళనా కార్యకలాపాలను క్రమబద్ధంగాను, విస్తారంగాను చేపట్టాలి. మతోన్మాద శక్తుల హిందుత్వ ప్రచారాన్ని తిప్పికొట్టడానికి సోషల్ మీడియాలో జోక్యం ఒక ప్రధాన అంశంగా ఉంది.

**బి.** మతోన్మాద శక్తులపై సైద్ధాంతిక పోరాటంలో మేధోపరమైన, సాంస్కృతిక పరమైన వనరులను పెంచుకునేందుకు, ఉమ్మడి వేదికలను నిర్మిచేందుకు పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పనిచేస్తున్న పరిశోధనా కేంద్రాలను, ట్రస్టులను రంగంలోకి దించాలి. మేధావులను, చరిత్రకారులను, శాస్త్రవేత్తలను, సాంస్కృతికరంగ ప్రముఖులను, సంస్థలను సమీకరించాలి.

**సి.** పాఠశాల పూర్వదశలోను, పాఠశాల దశలోను సంఘపరివార్ ప్రచారాన్ని ఎదుర్కొనేందుకు టీచర్లు, సామాజిక, సైన్సు ఉద్యమాల సహాయంతో చొరవ తీసుకోవాలి. అన్ని పట్టణాలలోను బాలోత్సవాలను నిర్వహించాలి. ఈ విషయంలో ఆంధ్ర అనుభవం ఉపయోగకరంగా ఉంది. పాఠశాల దశలోనే లేత మనస్సులను చేరుకోవడానికి ఇది చక్కటి మార్గం.

**డి.** ఆరెస్సెస్, దాని అనేక అనుబంధ సంస్థలు పాఠశాల పూర్వదశ నుండి, ఉన్నత పాఠశాల దశ వరకు వేలాది పాఠశాలలను నిర్వహిస్తున్నాయి. ఈ సంస్థలను ఎదుర్కొనడానికి ట్రస్టులు, రిజిస్టర్డ్ సొసైటీల ద్వారాను, సహకారసంస్థల ద్వారాను నిర్వహించబడే పాఠశాలలను స్థాపించేందుకు చొరవ తీసుకోవాలి.

**ఇ.** భారతదేశ చరిత్ర హేతుబద్ధ అధ్యయనాన్ని ప్రోత్సహించడం హిందుత్వ మతోన్మాద శక్తులపై పోరాటంలో ఒక ముఖ్యమైన భాగం. ఆలిండియా స్థాయిలోను, రాష్ట్రాల స్థాయిలోను చరిత్ర కాంగ్రెస్‌లలో మనం చురుగ్గా పాల్గొనాలి. మతతత్వ రాజకీయాలను ముందుకు తీసుకుపోయేందుకు

సంఘపరివార్ శక్తులు స్థానిక చరిత్రలను వక్రీకరించడాన్ని ప్రతిఘటించేందుకు ప్రతి రాష్ట్రంలోను ఔత్సాహిక చరిత్రకారులను ప్రోత్సహించాలి.

**సైన్సు, హేతువాద కార్యకలాపాలు**

**7.** మతోన్మాద శక్తులు ప్రచారం చేసే ప్రమాదకరమైన, ఛాందసవాద విలువలను ప్రతిఘటించడానికి పాపులర్ సైన్సు ఉద్యమం కార్యక్రమాలు చేపట్టాలి. శాస్త్రవేత్తలు, పరిశోధకులు, హేతువాదులు, మెజీషియన్లు, వారి సంస్థలను ఈ పని కోసం సమీకరించాలి. టీచర్లు, మెజీషియన్ల సహకారంతో సంచార మ్యాజిక్ ప్రదర్శనలను, మ్యాజిక్ స్కూళ్ళను నిర్వహించాలి.

సైన్సును, సైన్సు స్పృహను ప్రజల్లోను, ప్రత్యేకించి పిల్లల్లోను, యువతలోను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. నిర్దిష్ట కాలవ్యవధితో సైన్సు ఉత్సవాలను, ఔత్సాహిక మెజీషియన్ల ప్రదర్శనలను నిర్వహించాలి.

**సంస్కృతి**

**8.** మతోన్మాద సమీకణకు నేడు సంస్కృతి కేంద్ర అంశంగా ఉంటున్నది కాబట్టి ఆ రంగంలో పోరాటం కీలకమైనది.

**ఎ.** ప్రజలను మతతత్వ పూరితం చేయడానికి పండుగలు ఉపయోగించ బడుతున్నాయి. అలాంటి సందర్భాలను మనం మతోన్మాద శక్తులకు వదిలిపెట్టరాదు. ఈ ఉత్సవాలను మతతత్వ పూరితం చేయకుండా అడ్డుకునేలా మన జోక్యం ఉందాలి. ఈ సందర్భాన్ని లౌకికతత్వాన్ని విస్తరింపచేయడానికి ఉపయోగించుకోవాలి. మతాల్లోను, సిద్ధాంతాల్లోను, విశ్వాసాల్లోను మతోన్మాదాన్ని తొలగించేలా సాంస్కృతిక కార్యకలాపాలు చేపట్టడం మతోన్మాదశక్తులను ప్రతిఘటించ డంలో ఒక ముఖ్యమైన కర్తవ్యం. మతపరమైన అభివృద్ధిలో రెండు అంశాలుంటాయి, అవి ఒకటి, విశ్వాసము, రెండు, సంస్కృతి. విశ్వాసము మతపరమైనది, సంస్కృతి లౌకికతత్వంతో కూడినది. సాంస్కృతిక సంప్రదాయాన్ని మనం సొంతం చేసుకోవాలి.

**బి.** సాధారణ జనం అందరూ పాల్గొనేలా మనం ప్రత్యామ్నాయ లౌకిక పండుగలను రూపొందించాలి. అలాంటి ఉత్సవాలు కుటుంబాలు కలుసుకునే సామాజిక సమీకరణల మాదిరిగాను, సంపూర్ణమైన, ఆరోగ్యకరమైన వినోదాన్ని పంచుకునే విధంగాను ఉండాలి. ఉదాహరణకు మేడే, జనవరి 26, భగత్‌సింగ్ అమరత్వం లాంటి సందర్భాలను ఎంచుకోవచ్చు.

**❝ సాధారణ జనాన్ని సమీకరించేందుకు జానపద కళలు, సంగీతం, సాహిత్యం, పర్యావరణం లాంటి స్థానిక వికేంద్రీకృత, లౌకిక సాంస్కృతిక అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇది జరగాలంటే ప్రజాసంఘాలు తమ క్షేత్రస్థాయి కార్యకలాపాలలో సాంస్కృతిక కార్యక్రమాలను ఒక అవిభాజ్య అంశంగా చేసుకో వాలి. వీటి ద్వారా ఆ సంఘాలు ప్రాతినిధ్యం వహించే ప్రజానీకం లోకి అభ్యుదయ, లౌకిక, శాస్త్రీయ భావాలను వ్యాప్తి చేయాలి. ❞**

**సి.** సాధారణ జనాన్ని సమీకరించేందుకు జానపద కళలు, సంగీతం, సాహిత్యం, పర్యావరణం లాంటి స్థానిక వికేంద్రీకృత, లౌకిక సాంస్కృతిక అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇది జరగాలంటే ప్రజాసంఘాలు తమ క్షేత్రస్థాయి కార్యకలాపాలలో సాంస్కృతిక కార్యక్రమాలను ఒక అవిభాజ్య అంశంగా చేసుకోవాలి. వీటి ద్వారా ఆ సంఘాలు ప్రాతినిధ్యం వహించే ప్రజానీకంలోకి అభ్యుదయ, లౌకిక, శాస్త్రీయ భావాలను వ్యాప్తి చేయాలి.

**డి.** ట్రేడ్ యూనియన్లు, ఇంకా ప్రాంత ప్రాతిపదికన పనిచేసే ప్రజాసంఘాలు, బస్తీలు, సముదాయ ప్రాతిపదికన పనిచేసే సంఘాలు నివాస ప్రాంతాలలో సమన్వయం చేసుకొని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలి.

**ఇ.** అభ్యుదయ, లౌకిక విలువలను, సాంస్కృతిక ఉత్పత్తులను రక్షించడానికి విస్తృత ప్రాతిపదికపై పనిచేసే సాంస్కృతిక వేదికల ఏర్పాటును పార్టీ ప్రోత్సహించాలి.

**ఎఫ్.** క్రీడలు, దేహదారుఢ్యం, కళలు లాంటి యువతీ యువకుల కార్యక్రమాలను ప్రోత్సహించాలి. మానవతా, సేవా కార్యకలాపాలలో యువతను భాగస్వాములను చేయాలి. ఆరెస్సెస్ గూండాలను ఎదుర్కొనడానికి వలంటీర్లను సంఘటిత పరచాలి.

**జి.** మన విజ్ఞాన కేంద్రాలు అన్ని స్థాయిలలోను రెగ్యులర్‌గా యువజనోత్సవాలను నిర్వహించాలి. కవులు, స్వాతంత్ర్య సమరయోధులు, శాస్త్రవేత్తలు మొదలైన గొప్ప గొప్ప వ్యక్తుల జయంతులు, వర్ధంతులు లాంటి సందర్భాలలో ఆసక్తి కలిగిన అన్ని సంఘాలను భాగస్వాములను చేస్తూ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాలి.

**హెచ్.** సంఘపరివార్ సంస్థలు ఒక పద్ధతి ప్రకారం పాల్పడే దాడులను, హింసాకాండను, సంఘ వ్యతిరేకశక్తులను, మతోన్మద శక్తులను అడ్డుకోవడానికి శారీరకంగాను, రాజకీయంగాను శిక్షణ గరపబడిన యువ వలంటీర్లను తయారు చేసుకోవాలి. సామాజిక సేవా కార్యక్రమాలకు, వైపరీత్యాల సమయాలలో సహాయ కార్యక్రమాలకు ఈ వలంటీర్లను వినియోగించుకోవాలి.

**ఐ.** గ్రామీణ జానపద కళాకారులను సమీకరించి క్రమం తప్పకుండా జానపద కళా ఉత్సవాలను నిర్వహించాలి. గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే మన ప్రజాసంఘాలు ఈ విషయంలో చొరవ తీసుకోవాలి. ఈ కళాకారుల్లో అత్యధికులు అణగారిన వర్గాల నుండి వచ్చినవారే. లౌకిక సారాంశంతో జానపద కళారూపాలను మన ప్రచారోద్యమంలో వినియోగించుకోవచ్చు.

**జె.** షార్టు ఫిల్ములు, పెయింటింగ్, ఫోటోగ్రఫీ ఈవెంట్లను, ఎగ్జిబిషన్లను వాటికి సంబంధించిన యువతను, ఔత్సాహికులను సమీకరించి ఉత్సవాలుగా నిర్వహించవచ్చు. వీటికి మన విజ్ఞాన కేంద్రాలు నిర్వాహకులుగా వ్యవహరించవచ్చు.

**సామాజిక సేవ**

**9.** ప్రజల్లో మన రోజువారీ కార్యక్రమాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు ఒక భాగం కావాలి. ఆరోగ్య కేంద్రాలు, విద్యా, కోచింగ్ కేంద్రాలు, రీడింగ్ రూములు, సహాయ కార్యక్రమాలు మొదలైన సామాజిక సేవా కార్యక్రమాలను పార్టీ, ప్రజా సంఘాలు ప్రోత్సహించాలి. మనం నిర్వహించే ట్రస్టులు రెగ్యులర్ ప్రాతిపదికన ఇలాంటి కార్యక్రమాలను తీసుకోవాలి. ఆరోగ్యం, విద్యా రంగాలలో మనం ప్రజాఉద్యమాలను నిర్మించాలి. ఆరోగ్యం, విద్యలకు సంబంధించి వివిధ రకాలయిన సేవా కార్యక్రమాలను చేపట్టాలి.

**10.** మతోన్మాదానికి వ్యతిరేకంగా మనం జరిపే పోరాటాన్ని, లౌకికతత్వం కోసం పోరాటంలా పరివర్తన చెందించాలి.

చరిత్ర

# అశోకుని సామ్రాజ్యంలో లిపి, భాషలు, సాహిత్యం, శిల్పం


రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

ఎం.వి.ఎస్.శర్మ

మానవులు మాటల ద్వారా ఒకరి భావాలు మరొకరితో ఇచ్చిపుచ్చుకోవడం - దానినే సంభాషణ అంటాం- పాతరాతి యుగం లోనే మొదలైంది. కాని ఆ మాట్లాడే భాష అక్షర రూపం తీసుకోడానికి చాలా కాలం పట్టింది. భారత ఉప ఖండంలో మనకు తెలిసిన మొదటి లిపి సింధు నాగరికత విలసిల్లిన కాలం నాటిది. మట్టి పలకల మీద ముద్రించిన సంకేతాలు, అక్షరాలు హరప్పా తవ్వకాలలో లభించాయి. ఆ లిపిని అర్థం చేసుకుని, వివరించడానికి గత ఏడెనిమిది దశాబ్దాలుగా చరిత్ర పరిశోధకులు ప్రయత్నిస్తూనే వున్నారు. ఆ లిపి క్రీ.పూ. 2000 నాటిది. ఆ తర్వాత మళ్ళీ రాత పూర్వక భాషకు సంబంధించిన ఆధారాలు మనకు అశోకుడి శిలా శాసనాలే. ఇవి క్రీ.పూ. 250 నాటివి. అంటే ఈ మధ్యకాలంలో దాదావు 1700 సంవత్సరాలపాటు రాత పూర్వక భాషను మనదేశంలో వినియోగించలేదని మనం నిర్ధారించవచ్చు.

వేదాలలో గానీ, బ్రాహ్మణాలలో గానీ రాతపూర్వక భాషకు సంబంధించిన ప్రస్తావనలు ఏమీ లేవు. వేదాలను శృతములు అని అంటారు. అంటే నోటిమాట ద్వారా ఒకరినుంచి ఇంకొకరు తెలుసుకునేవి అని అర్థం. అలెగ్జాండర్ దండయాత్ర అనంతరం మన దేశంలో విస్తృతంగా పర్యటించిన మెగస్తనీస్ చంద్రగుప్త మౌర్యుని కాలంలో భారతదేశంలో పాలన అంతా నోటిమాట ద్వారానే జరిగేది అని, చట్టాలు, నియమాలు రాతపూర్వకంగా లేవని తన నివేదికలో పేర్కొన్నాడు.

భాషా శాస్త్రానికి, వ్యాకరణానికి ఆద్యుడుగా పాణిని ని గుర్తిస్తారు. అతడు క్రీ.పూ. 350 నాటివాడని విశ్వసిస్తారు. ఐతే, అతడి రచనలలో యవనుల ( గ్రీక్ ప్రజలను యవనులు అని అనేవారు) ప్రస్తావన ఉంది. దానిని బట్టి చూస్తే అతడు అలెగ్జాండర్ దండయాత్ర తర్వాత కాలానికి చెందినవాడని చెప్పాలి. గాంధార దేశంలో (కాందహార్ ప్రాంతం- ఇది ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్‌లో ఉంది) గ్రీక్, ఇరాన్ ప్రజలు ఉపయోగించిన 'అరేమయ' లిపి క్రీ.పూ. 350 నాటికి వాడుకలో ఉన్నట్టు ఆధారాలు ఉన్నాయి. పాలీ భాషలో రాయడం క్రీ.పూ. 1వ శతాబ్దంలో శ్రీలంకలో మొదలైనట్టు రుజువులు ఉన్నాయి.

భారత దేశంలో అత్యంత ప్రాచీనమైన లిపి బ్రాహ్మీ లిపి. అశోకుడి కాలం నాటికి వాడుకలో ఉన్న ప్రాకృతభాషను ఖరోష్ఠి లిపి లో రాశారు. బ్రాహ్మీ లిపికి, ఖరోష్ఠి లిపికి చాలా దగ్గర పోలికలు ఉన్నాయి. ఈ రెండూ అరేమయ లిపి మాదిరిగానే ఉచ్చారణలో కూడా దగ్గర పోలికలతో ఉన్నాయి. అరేమయ లిపి మాదిరిగానే వీటినీ కుడి నుండి ఎడమవైపుకు రాశారు. (మనం ఇప్పుడు ఎడమ నుండి కుడివైపుకు రాస్తాం)

మనకు దక్షిణాదిన తమిళ భాష తమిళ-బ్రాహ్మీ లిపిలో రాసిన ఆధారాలు క్రీ.పూ. మూడవ దశాబ్దానికి చెందినవి లభిస్తున్నాయి. ఆ భాషకు ప్రత్యేకమైన వ్యాకరణం, పదజాలం ఉన్నాయి.

ఐతే సంస్కృతానికి చెందిన రాతపూర్వక ఆధారాలు ఆ కాలం నాటికి దాదాపుగా ఏమీ లేవు. ఉన్నవాటిలో అత్యంత ప్రాచీనమైనది క్రీ.పూ.140 నాటికి చెందినది లభించింది. సంస్కృత భాషను పరిపాలనలో గానీ, వాడుకలో గానీ ఎక్కువగా ఉపయోగించలేదని, ఆ భాష కేవలం కొద్దిమంది పురోహిత వర్గానికి చెందిన వారికే పరిమితంగా ఉండేదని దీనిని బట్టి స్పష్టమౌతున్నది.

లభ్యమౌతున్న రాతపూర్వక ఆధారాలు ఎక్కువ భాగం ప్రాకృతంలో రాసినవే. ఇక్కడ ప్రాకృతం అంటే స్థానిక భాషగా భావించాలి. అశోకుడి కాలంలో అధికారికంగానూ, వ్యాపార లావాదేవీలలోనూ ఎక్కువగా ఉపయోగించిన భాషను ప్రత్యేకించి అశోక ప్రాకృతం అని చరిత్రకారులు పేర్కొన్నారు. ఆ తర్వాత కాలంలోని భాషలనుండి వేరు చేసి అధ్యయనం చేయడానికి ఆ విధంగా చేశారు. అశోక ప్రాకృతం అశోకుడి విశాల సామ్రాజ్యంలో ఒకే విధంగా లేదు. అది నాలుగు ప్రధాన మాండలికాల్లో

ఉంది.(ఆ వివరాలు మ్యాప్ 3.2 లో చూడవచ్చు) సింధునదికి తూర్పువైపు నుండి పాటలీపుత్రం దాటి గంగా పరీవాహక ప్రాంతం వరకూ ఉపయోగించిన మాండలికాన్ని డైలెక్ట్ 'ఎ' అన్నారు. ఆ ప్రాంతానికి దక్షిణాన మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, దక్కన్ ప్రాంతంలో ఉపయోగించిన మాండలికాన్ని డైలెక్ట్ 'బి' అన్నారు. గుజరాత్, రాజస్తాన్, పంజాబ్ ప్రాంతంలో ఉపయోగించినది డైలెక్ట్ 'సి'. ఇక వాయవ్య ప్రాంతంలో సింధునదికి పశ్చిమాన గాంధార దేశంలోను, తక్షశిల ప్రాంతంలోను ఉపయోగించినది డైలెక్ట్ 'డి'. ఈ నాలుగూ కాకుండా దక్షిణాదిలో తమిళ బ్రాహ్మీ లిపిని ఉపయోగించారు.

పై వివరాలను బట్టి ఆరెస్సెస్ చేసే ప్రచారంలో వాస్తవాలు లేవని రుజువౌతోంది. భారతీయ భాషలన్నింటికీ మూలం సంస్కృత భాష అని, దానినుండే తక్కిన అన్ని భాషలూ పుట్టాయని, ఓంకారం లోంచి జ్ఞానం మొదలైందని- ఇలా రకరకాల అవాస్తవాలను ప్రచారంలో పెట్టి తమ మనువాద సిద్ధాంతాన్ని సమర్థించుకోడానికి నానా పాట్లూ పడుతున్నారు. కేవలం కొద్దిమంది పురోహిత వర్గానికి చెందినవారు ఉపయోగించిన భాషను దేశంలో ప్రజలందరిమీదా రుద్దడానికి ప్రయత్నిస్తున్నారు.

బ్రాహ్మీ లిపిలో అశోక ప్రాకృతాన్ని రాయడం మొదలైన తర్వాత ఆ భాష వేగంగా అన్ని ప్రాంతాలకూ వ్యాపించింది. శిలా శాసనాలను రూపొందించేవారు ప్రత్యేకంగా గుర్తింపు, ఆదరణ పొందారు. ఆ లిపికారుల ద్వారా ప్రభుత్వ శాసనాలు జారీ అయేవి. వారికి ఆయా ప్రాంతాలలో ప్రత్యేకించి వాడుకలో ఉండే పదాల అర్థాలు బాగా తెలిసివుండేవి. బౌద్ధ ఆరామాల్లో కూడా రాతపూర్వకంగా బుద్ధుడి బోధనలను, ధర్మాలను శిలాఫలకాలపై రూపొందించి వివిధ ప్రాంతాలకు పంపేవారు. ఇక వ్యాపార లావాదేవీలకు, లెక్కలు వేయడానికి, రుణాలు ఇచ్చి పుచ్చుకోడానికి లిపి వాడకం ఎంతో దోహదం చేసింది. అంతవరకూ కేవలం జ్ఞాపకశక్తి మీద ఆధారపడి నడిచిన పరిపాలన ఇప్పుడు రాతపూర్వక ఆదేశాల ప్రాతిపదికన నడవడంతో పాలనలో జవాబుదారీతనం మరింత పెరిగింది. దక్షిణాదిన తమిళబ్రాహ్మీ లిపిని వ్యాపింపజేయడంలో జైన సన్యాసులు ముఖ్యపాత్ర పోషించారు. ఆనాటి సమాజంలో అక్షరాస్యత పాలకవర్గాలకే పరిమితం కాలేదు. ఇతర తరగతుల వారికీ వ్యాపించింది. సూతానుక అనే దేవదాసికి దేవాదీన అనే లిపికారుడు తన ప్రేమను తెలియజేస్తూ రామ్‌ఘర్ కొండల్లోని జోగిమార గుహలో చెక్కిన లేఖ ఆనాటి లిపి వాడకం ఎంత విస్తృతంగా ప్రజల్లో ఉండేదో సూచిస్తుంది. బహుశా చారిత్రికంగా లభిస్తున్న మొదటి ప్రేమలేఖ ఇదేనేమో !

(చూ. ఫిగర్ 3.7) ఈ లేఖను అశోక ప్రాకృత భాషలో బ్రాహ్మీలిపిలో రాశారు.

"సూతానుక
దేవదాసీ
సూతానుక దేవదాసీ
దేవాదీన వారణాసికి చెందిన కళాకారుడు
ఆమెను ప్రేమిస్తున్నాడు"

(ఆ బ్రాహ్మీ లిపిలో రాసినదాని అర్థం ఇది.)

" రాజకీయాలకు సంబంధించి 'అర్ధశాస్త్ర' గ్రంథం క్రీపూ. 300 నాటికి తుదిరూపం తీసుకుంది. అర్ధశాస్త్రం గ్రంథం రచించినది కౌటిల్యుడు. ఆ గ్రంథం కొన్ని సూత్రాల రూపంలో ఉంటుంది. దానిని కౌటిల్యుడు చంద్రగుప్త మౌర్యుడు నంద వంశాన్ని నాశనం చేసి మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించిన తర్వాత (క్రీపూ.327) రచించాడా లేక అంతకు ముందే రచించాడా అన్నది చెప్పలేం. అంతేకాక, ఆ గ్రంథంలో ఆ తర్వాత కాలానికి చెందిన ప్రస్తావనలు కూడా చోటు చేసుకున్నాయి. "





FIG. 3.7 **Inscription, Jogimara cave, Ramgarh hill.** (After A. Cunningham.) "Sutanuka, the *devadāsī*! Sutanuka, the *devadāsī*! – I, Devadina, artist, from Varanasi, love her." India's first romantic inscription?

లిపి వాడకంతో బాటు భాషను క్రమబద్ధీకరించడం, వ్యాకరణ, భాషా సూత్రాలను రూపొందించడం మనకి కనిపిస్తుంది. పాణిని(క్రీ.పూ.350) అష్టాధ్యాయి అనే 8 భాగాల వ్యాకరణ గ్రంధాన్ని దాదాపు 4000 సూత్రాలతో రూపొందించాడు. బహుశా ప్రపంచంలోని తొలి వ్యాకరణ గ్రంథం ఇదేనేమో. పదాలు ఏ విధంగా రూపొందుతాయో, వాక్యాల నిర్మాణం ఏ విధంగా ఉండాలో, ఉచ్చారణ ఏ విధంగా ఉండాలో సూచించే సూత్రాలు అవి. వేదాలలో ఉపయోగించిన భాషను సైతం ఒక క్రమపద్ధతిలో తీసుకురావడానికి పాణిని ప్రయత్నించాడు. ఆ తర్వాత కాలంలో కాత్యాయనుడు (క్రీ.పూ.250 ) పాణిని సూత్రాలలోని లోపాలను సరిదిద్ది సవరించాడు. ఆ తర్వాత క్రీ.పూ. 150 కాలానికి చెందిన పతంజలి మహాభాష్యం అనే గ్రంథంలో పాణిని, కాత్యాయనుడు చేసిన కృషిని సమన్వయపరిచే పని చేపట్టాడు. దానితోబాటు సంస్కృత భాష వాడుకలో వచ్చిన మార్పులను కూడా పరిగణన లోకి తీసుకుని ఆధునీకరించాడు.

రాజకీయాలకు సంబంధించి 'అర్ధశాస్త్ర' గ్రంథం క్రీ.పూ. 300 నాటికి తుదిరూపం తీసుకుంది. అర్ధశాస్త్రం గ్రంథం రచించినది కౌటిల్యుడు. ఆ గ్రంథం కొన్ని సూత్రాల రూపంలో ఉంటుంది. దానిని కౌటిల్యుడు చంద్రగుప్త మౌర్యుడు నంద వంశాన్ని నాశనం చేసి మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించిన తర్వాత (క్రీ.పూ.327) రచించాడా లేక అంతకు ముందే రచించాడా అన్నది చెప్పలేం. అంతే కాక, ఆ గ్రంథంలో ఆ తర్వాత కాలానికి చెందిన ప్రస్తావనలు కూడా చోటు చేసుకున్నాయి. కనుక కౌటిల్యుడి పేర ఉన్న ఆ గ్రంథం ఆ తర్వాత కాలంలో రకరకాల మార్పులకు లోనైందని చెప్పవచ్చు. తాము చేసిన మార్పులను కౌటిల్యుడి ట్రేడ్‌మార్కు వాడితే తేలికగా ఆమోదిస్తారన్న అభిప్రాయంతో మార్పులు చేసినవారు కౌటిల్యుడిపేరునే ఉపయోగించివుండాలి.

అర్ధశాస్త్రం ప్రధానంగా పాలకులకోసం ఉద్దేశించి రాసినది. అర్థం అంటే అధికారం, సంపద. ధర్మం అంటే మత విషయిక విధులు. కామం అంటే అన్ని రకాల భోగాలను అనుభవించడం. ఈ మూడింటిలోకీ కౌటిల్యుడు అర్థం అన్న అంశానికే అధిక ప్రాధాన్యత నిచ్చాడు. అధికారాన్ని, సంపదను కాపాడుకో డానికి ధర్మాన్ని ఉల్లంఘించినా అది తప్పు కాదని స్పష్టం చేశాడు. మోసం చేసో, కుట్రలు పన్నో, అసత్యాలు చెప్పో, హత్యలు చేసో, దోపిడీలకు పాల్పడో, ఇలా ఏ విధంగానైనా సరే అర్థాన్ని చేజిక్కించుకోవడం కీలకం అన్నాడు. అదే సమయంలో ఒకసారి అధికారాన్ని చేజిక్కించుకున్నాక దానిని నిబెట్టుకోడానికి ప్రజలను ఏ విధంగా విధేయులుగా

> **❝ ఈ కాలం నాటికి వైద్యం ఒక ప్రత్యేక శాస్త్రంగా పరిగణించబడడం మనకు కనిపిస్తుంది. మనుషులలకే గాక, పశువులకు సైతం ఉపయోగించే వివిధ రకాల చికిత్సా విధానాల గురించి, వాటికి ఉపయోగించే ఓషధుల గురించి అశోకుడి శిలా శాసనాలలో పేర్కొన్నారు. ❞**




చేసుకోవాలో ఆ పద్ధతులను కూడా తెలిపాడు. సుస్థిరమైన రాచరికపాలన ఏవిధంగా కొనసాగించాలో వివరించే గ్రంథం అర్థశాస్త్రం.

ఈ కాలం నాటికి వైద్యం ఒక ప్రత్యేక శాస్త్రంగా పరిగణించబడడం మనకు కనిపిస్తుంది. మనుషులలకే గాక, పశువులకు సైతం ఉపయోగించే వివిధ రకాల చికిత్సా విధానాల గురించి, వాటికి ఉపయోగించే ఓషధుల గురించి అశోకుడి శిలా శాసనాలలో పేర్కొన్నారు.

గణితంలలో, ముఖ్యంగా రేఖాగణితంలో ఈ కాలంలో కొంత పురోగతి కనిపిస్తుంది. గుణకారం, భాగహారం, భిన్నాలు వంటివి ఉపయోగించి నిర్మాణాలు చేపట్టినట్టు ఆధారాలు ఉన్నాయి. పైథాగరస్ సూత్రాన్ని బౌద్ధయాన శులబ సూత్రాలలో ప్రతిపాదించారు. దాదాపు ఇదే కాలంనాటి చైనాకు చెందిన జౌ బి అనే వ్యక్తి కూడా ఇదే సూత్రాన్ని ప్రతిపాదించాడు. అంటే అటు గ్రీస్ లో, ఇటు భారతదేశంలో,


FIG. 3.9 Lomas Rishi cave, Barabar hill. (Courtesy: Archaeological Survey)

చైనాలో ఏక కాలంలో రేఖా గణితం అభివృద్ధి చెందిందని మనం భావించాలి.

ఖగోళ శాస్త్రంలో కూడా పురోగతి కనిపిస్తుంది. సౌరమానం ప్రకారం ఒక ఏడాదికి 366 దినాలు ఉంటాయని, అదే చాంద్రమానం ప్రకారం 354 దినాలు ఉంటాయని , అందువలన ప్రతీ రెండున్నర సంవత్సరాలకు ఒకసారి చాంద్రమానంలో ఒక అధికమాసాన్ని చేర్చడం ద్వారా ఈ తేడాను సరి చేయాలని అశోకుడి శిలా శాసనాలలో ఉంది. నక్షత్రాలను 27 రాశులు గా విభజించారు. ప్రతీ ఏడాదికీ ఒక సంఖ్యను కేటాయించడం అశోకుడి కాలంలో మొదలైంది.

ఆనాటికి వాడుకలో ఉన్న సంస్కృత పదాల ప్రాచీనతను బట్టి అశోకుడి కాలం నాటికి మహాభారతం గానీ రామాయణం గానీ ఇంకా రాయడం జరగలేదు. ఐతే మహాభారతంలో ఉపయోగించిన కొన్ని ప్రాచీన సంస్కృత పదాలను బట్టి మహాభారతాన్ని రాయడానికి ఉపయోగించిన కొన్ని మూల గాథలను మౌర్యుల కాలం నుండి స్వీకరించివుండవచ్చునని చెప్పవచ్చు. ఈ పురాణాలను పక్కన పెడితే ఆ కాలంలో కవిత్వం అభివృద్ధి చెందినట్టు పతంజలి మహాభాష్యం నుండి తెలుసుకోవచ్చు. కొత్త కొత్త రకాల ఛందస్సుతో కవిత్వం రూపొందిందని, ఆ ప్రయోగాలను పతంజలి క్రమబద్ధం చేయడానికి ప్రయత్నించాడని తెలుస్తుంది.

ప్రాకృతంలో రచనలు చాలా ఎక్కువగా ఈ కాలంలో జరిగాయి. బుద్ధుడి బోధనలను, ధర్మాన్ని ప్రచారం చేయడానికి మాత్రమే గాక, బౌద్ధ సన్యాసులు గానం చేసే 'తేర గాథ', 'తేరీ గాథ' వంటివి రూపొందాయి. దాదాపు 500 వరకూ జాతక కథలు రచించబడ్డాయి.

అశోకుడి కాలంలో నిర్మాణ కళ (ఆర్కిటెక్చర్) గణనీయంగా అభివృద్ధి చెందింది. నేటికీ చెక్కుచెదరకుండా నిలిచివున్న అశోక

స్థూపాలు ఇందుకు నిదర్శనం. ఒకే శిల నుండి చెక్కిన ఈ స్థూపాలను పరిశీలిస్తే వాటి వెనుక ఉన్న నిర్మాణ సామర్థ్యం, అందుకు అవసరమైన మానవ శ్రమ విదితమౌతాయి. గంగా తీరం వెంబడి ఈ స్థూపాలు ఎక్కువగా కనిపిస్తాయి. అలహాబాద్ దగ్గర ఉన్న స్థూపం 10.7 మీటర్ల ఎత్తు, దిగువన 88.8 సెం.మీ. వ్యాసం, పైన 66సెం.మీ. వ్యాసం కలిగివుంది. అద్భుతంగా దీనిని నునుపు చేశారు. ఆ స్థూపానికి పైన ఒక జంతువు విగ్రహం గానీ, పువ్వుల , లతల

❝ స్థూపాలే కాకుండా కొండలను తొలిచి ఆ గుహల్లో స్తంభాలతో ఉన్న విశాలమైన సమావేశప్రాంగణాన్ని నిర్మించడం అశోకుడి కాలంనాటి నిర్మాణ కళ సాధించిన ఒక ముఖ్యమైన విజయం. పాటలీపుత్రంలోని కుమారహార అటువంటి నిర్మాణమే. ఇందులో స్తంభాలు 9.3 మీటర్ల ఎత్తు ఉన్నాయి. బరాబర్ కొండను తొలిచి నిర్మించిన లోమశ ఋషి గుహ ఆ నాటి శిల్పుల కౌశలాన్ని తెలియజేస్తుంది. ❞




FIG. 3.8 Ashokan pillar, Lauriya Nandangarh. (Photograph: Shamim Akhtar)

విగ్రహాలు గానీ ఉంటాయి. ఎక్కువగా ఒకటి లేదా ఎక్కువ సింహాల విగ్రహాలు ఉంటాయి. బీహార్‌లో కొల్హువా వద్ద 12.65 మీటర్ల ఎత్తైన స్థూపం అన్నింటిలోకీ పెద్దది. తన రాజ్యం అంతటా ఇటువంటి స్థూపాలను నిలబెట్టి వాటిపైన తన ధర్మ సూత్రాలను, శాసనాలను చెక్కించి ప్రచారంలో పెట్టాడు అశోకుడు. వారణాసి సమీపంలో ఉన్న ఎర్రరాతి క్వారీలనుండి ఈ భారీ స్థూపాలను తీసి సుదూర ప్రాంతాలకు రవాణా చేసేవారు. దాదాపు 12 మీటర్ల పొడవు, 5 టన్నుల వరకు బరువు ఉన్న రాయిని రవాణా చేయడం అంటే నేటి ఇంజనీర్లకు సైతం ఒక సవాలుగానే ఉంటుంది. అటువంటిది ఆ కాలంలో చేశారంటే ఎంత కష్టానికి ఓర్చారో, ఎందరు కష్టపడ్డారో ఊహించుకోవడమే అసాధ్యంగా ఉంటుంది. ప్రధానంగా నదిమీద కొయ్యదుంగలపై ఆ రాతిని చేర్చి దూరప్రాంతాలకు చేరవేసేవారు.

(చూ. ఫిగర్ 3.8 అశోకస్తంభం)

స్థూపాలే కాకుండా కొండలను తొలిచి ఆ గుహల్లో స్తంభాలతో ఉన్న విశాలమైన సమావేశప్రాంగణాన్ని నిర్మించడం అశోకుడి కాలంనాటి నిర్మాణ కళ సాధించిన ఒక ముఖ్యమైన విజయం. పాటలీపుత్రంలోని కుమారహార అటువంటి నిర్మాణమే. ఇందులో స్తంభాలు 9.3 మీటర్ల ఎత్తు ఉన్నాయి. బరాబర్ కొండను తొలిచి నిర్మించిన లోమశ ఋషి గుహ ఆ నాటి శిల్పుల కౌశలాన్ని తెలియజేస్తుంది. రాళ్ళమీద చెక్కిన శిల్పాలు కూడా ఆనాటి నైపుణ్యాన్ని సూచిస్తాయి. ఏనుగు ఎంత సైజులో ఉంటుందో అంతే సైజులో చెక్కిన శిల్పం ధౌళిలో ఉంది. సారనాథ్‌లో మూడు సింహాలు, అశోక చక్రంతో ఉన్న శిల్పం ఆనాటి శిల్పకళలో చోటు చేసుకున్న వాస్తవికతను తెలియజేస్తున్నాయి. ఐతే ఆ నాటి శిల్పాలమీద ఆభరణాలు చెక్కక పోవడం, మానవ దేహాకృతుల అందచందాలను వ్యక్తం చేసే శిల్పాలు దాదాపు లేకపోవడం చూస్తే, బౌద్ధ తాత్విక ప్రభావం బలంగా



FIG. 3.11 Lion capital, Sarnath. (Courtesy: Archaeological Survey)

ఉండేదని చెప్పవచ్చు.

జానపదులలో కళాభినివేశం జేగురుమట్టితో చేసిన ఆకృతులలో కానవస్తుంది. ఆ కాలంలో బౌద్ధం తోబాటు జనపదాలలో స్థానిక దేవతల ఆరాధన కూడా కొనసాగిందని ఈ ఆకృతులు సూచిస్తాయి. దేవతామూర్తుల బొమ్మలు, పిల్లలు ఆడుకునే బొమ్మలు వంటివి చాలా ఎక్కువగా లభించాయి. కుమ్మరులే కాక, ఇళ్ళలో స్త్రీలు కూడా వట్టి చేతులతో ఆకృతులను తీర్చిదిద్దినట్టు కనిపిస్తుంది.

(చిత్రం 3.11 సారనాథ్ లోని మూడు సింహాలు, అశోకచక్రం ఉన్న స్తూపం) ❊

జాతీయ పరిణామాలు

# ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొడుతున్న వైసిపి ప్రభుత్వం

**ఎ.కోటిరెడ్డి**


రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహనరెడ్డి నాయకత్వంలో ఉన్న వైసిపి ప్రభుత్వం ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొడుతున్నది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అడుగుజాడల్లో సాగిపోతున్నది. బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని గురించి ప్రశ్నించకపోవటమే కాకుండా వాటిని కప్పిపెట్టటం, కేంద్రానికి దాసోహం అనటం మరింతగా పెరుగుతున్నది. వివిధరకాల సాకులు చూయిస్తూ ప్రజా ఉద్యమాలను, ప్రతిపక్షాల కార్యకలాపాలకు ఆటంకాలు కలిగించటం, నిర్బంధకాండను కొనసాగించటంలో బిజెపి ప్రభుత్వం కన్నా నాలుగాకులు ఎక్కువే చదివానని రుజువు చేసుకుంటున్నది. తాజాగా అమరావతి రైతులు చేస్తున్న పాదయాత్రను అడ్డుకోవటం కోసం వ్యవహరిస్తున్న తీరు ఈ ప్రభుత్వ నిరంకుశ ధోరణులకు అద్దం పడుతున్నది.

జగన్మోహనరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానులను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. శాసన రాజధానిగా అమరావతి, పాలనా రాజధానిగా విశాఖ, న్యాయ రాజధానిగా కర్నూలును చేస్తామని ప్రకటించారు. అందుకనుగుణంగా అమరావతి నుండి రాజధానిని విశాఖకు తరలించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంలో రాజధానిని ఇక్కడే కొనసాగించాలని అమరావతి రైతులు అనేక విధాలుగా ఆందోళనలు చేశారు. కోర్టుకు వెళ్ళారు. ఒకసారి రాష్ట్ర రాజధానిని నిర్ణయం చేసిన తర్వాత మార్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, ప్రభుత్వం అమరావతి రైతులకు హామి ఇచ్చిన విధంగా రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్దిష్ట చర్యలను ఆరుమాసాలలో కోర్టుకు నివేదించాలని విచారణ అనంతరం హైకోర్టు ఇచ్చిన తీర్పులో పేర్కొంది. కాని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును అమలుచేయకుండా తాత్సారం చేస్తూ, ఆచరణలో రాజధానిని విశాఖకు తరలించే కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగిస్తున్నది. ప్రభుత్వ తీరును నిరసిస్తూ, అమరావతిని ఏకైక రాజధానిగా కొనసాగించాలని, భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరుతూ రాజధాని రైతులు అమరావతి నుండి అరసవిల్లి వరకు కొనసాగిస్తున్న పాదయాత్రకు ఆటంకాలు కలిగించే కార్యక్రమాన్ని ప్రభుత్వమే చేయిస్తున్నది. పాలనా రాజధానిని విశాఖకు రావటం వలన ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని, పాదయాత్ర పేరుతో ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ప్రచారం చేస్తూ, రైతుల పాదయాత్ర జరుగుతున్న మార్గంలో పోటీ కార్యక్రమాలకు ప్రభుత్వం పూనుకున్నది. పాదయాత్ర జరుగుతున్న చోట్లకు కొందరిని సమీకరించటం, నల్ల జెండాలు, బెలూన్లు చూపించటం, రెచ్చగొట్టే నినాదాలు ఇవ్వటం చేస్తున్నారు. విశాఖపట్టణంలో పోటీగా సభను నిర్వహించారు. ఆ సభలో మంత్రులు పాల్గొని విశాఖలో పాలనా రాజధానిని సాధించి తీరుతామని చెప్పారు. మరోవైపున రాయలసీమ అభివృద్ధికోసం అంటూ సభలు జరుపుతున్నారు. ఈ విధంగా ప్రభుత్వమే రాష్ట్రంలో ప్రాంతీయ తత్వాన్ని, వేర్పాటువాదాన్ని రెచ్చగొడుతున్నది.

రాష్ట్రంలోని ప్రజలలో ఎక్కువమందికి వివిధ సంక్షేమ పథకాల పేరుతో కుటుంబానికి సంవత్సరానికి వేల రూపాయలు అందిస్తున్నామని, అందువలన రాజకీయంగా ఎటువంటి పరిణామాలు చోటుచేసుకున్నా రానున్న శాసనసభ ఎన్నికలలో మెజారిటీ ఓటర్లు తమకే ఓటు చేస్తారనే ధీమాను వైసిపి నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నట్లు వివిధ సందర్భాలలో చేస్తున్న ప్రకటనలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వమే ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొట్టటం చూస్తుంటే ప్రజలపై వారికి ఉన్న నమ్మకం సడలిపోతున్నదని, ప్రభుత్వంపై ప్రజలలో అసంతృప్తి పెరుగుతున్నదని వారికి అర్థం అవుతున్నదని స్పష్టమౌతున్నది. రాష్ట్రంలోని మెజారిటీ ప్రజలు తమవెంటే ఉన్నారని ప్రభుత్వం, పాలకపార్టి భావిస్తే ప్రాంతీయ తత్వాలను రెచ్చగొట్టాల్సిన అవసరం ఏముంది? అందువలన పైకి ఎంత మేకపోతు గాంభీర్యం ప్రదర్శించినప్పటికీ ప్రజలలో తమకున్న స్థానం క్షీణించిపోతున్నదని వైసిపి నాయకులకు అర్థం అవుతున్నది. కాబట్టి ప్రాంతీయతత్వాలను రెచ్చగొట్టటం ద్వారా దానిని భర్తీచేసుకోవచ్చునని ప్రయత్నిస్తున్నారు. తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రంలో వేర్పాటువాదానికి ఆనలు వేస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలను గురించి పట్టించుకోకుండా కేవలం తమ రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యవహరిస్తున్నారు.

విశాఖపట్టణంకు పాలనా రాజధానిని తీసుకువచ్చి, ఉత్తరాంధ్రను అభివృద్ధి చేస్తామని ప్రకటిస్తున్న పాలకపార్టి నిర్వహించిన విశాఖ గర్జన సభలో ఉత్తరాంధ్ర అభివృద్ధికి, ప్రత్యేకించి విశాఖపట్టణం అభివృద్ధికి ప్రధానమైన ఉక్కుఫ్యాక్టరీని ప్రైవేటీకరించి తీరుతామని కేంద్ర మంత్రులు సవాళ్ళు చేస్తుంటే వాటిని ఖండించటానికి, ఉక్కుఫ్యాక్టరీని ప్రభుత్వరంగం లోనే కొనసాగించాలని కోరటానికి కూడా సిద్ధం కాలేదు. విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని కాదుకదా, కనీసం ఉక్కుఫ్యాక్టరీ ప్రైవేటీకరణను ఆపాలని, విశాఖకు రైల్వే డివిజన్‌ను ఇవ్వాలని కోరటానికి కూడా వారికి నోరురాలేదు. విశాఖ ఉక్కుఫ్యాక్టరీని ఆధారం చేసుకొని విశాఖపట్టణం, ఉత్తరాంధ్రలో జరుగుతున్న పరిమితమైన అభివృద్ధిని కూడా దెబ్బతీయటానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుంటే కేంద్రాన్ని కనీసం ప్రశ్నించటానికి కూడా పూనుకోని వీరు ఉత్తరాంధ్ర అభివృద్ధిని గురించి సుద్దులు చెబుతున్నారు! ఆ పేరుతో ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొడుతున్నారు. అదే సమయంలో అక్కడ కార్యక్రమాలు నిర్వహించిన ప్రధాన ప్రతిపక్షపార్టీలు తెలుగుదేశం, జనసేనలు కూడా ఉక్కుఫ్యాక్టరి ప్రైవేటీకరణ, రైల్వే డివిజన్ ఏర్పాటు గురించి నోరెత్తలేదు. రాష్ట్రంలోని పాలక, ప్రతిపక్షపార్టీలు కేంద్రానికి ఊడిగం చేస్తూ, వారి దయతో అధికారంలో కొనసాగాలని పాలకపార్టి, వారి కటాక్షం పొందటం ద్వారా రానున్న శాసనసభ ఎన్నికలలో గెలిచి, అధికారంలోకి రావాలని ప్రతిపక్ష పార్టీలు భావిస్తున్నాయి. వీరికి అధికారం ఉంటేచాలు! వారికి అధికారం దక్కితే చాలు! ఆంధ్రరాష్ట్ర అభివృద్ధిని దిగజారుస్తున్నా తమకేమీ పట్టదని వారూ, వీరూ రుజువు

చేసుకుంటున్నా రని ఈ సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. ఈరోజు కాకపోతే రేపైనా ప్రజలు ఇటువంటి వారికి తగిన గుణపాఠం నేర్పుతారు.

**బెడిసికొట్టిన కొనుగోళ్ళ వ్యాపారం**

గోవా, మధ్యప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలలో మాదిరిగానే తెలంగాణలో కూడా శాసనసభ్యులను కొనటం ద్వారా టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చివేసి, బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలన్న ప్రయత్నాలు వమ్మైనాయి. కొనుగోళ్ళ కోసం వచ్చిన బిజెపి ప్రతినిధులు, స్వామిజీలు కన్నంలో దొంగల్లాగా దొరికిపోయి, ఊచలు లెక్క బెడుతున్నారు. చెట్టుపేరు చెప్పుకొని కాయలమ్ముకొంటున్న చందంగా మతంపేరుతో ప్రజలను మభ్యపెడుతున్న బిజెపికి, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్‌కు తాము చెబుతున్న మతంపై విశ్వాసం కాని, కనీస నీతి నియమాలు కానిలేవు. ఏ అక్రమాలకు పాల్పడి అయినా హిందుత్వ విధానాలను ముందుకు తీసుకువెళ్ళ టం, బ్రాహ్మణాధిక్యతతో కూడిన సామాజిక వ్యవస్థను తిరిగి పునరుద్ధరించటమే వారి లక్ష్యం. అందుకోసం దేశంలో వేళ్ళూనుకుంటున్న ప్రజాస్వామిక వ్యవస్థలను, రాజకీయ, సామాజిక అభివృద్ధిని విధ్వంసం చేయటమే వారి కార్యక్రమంలోని ప్రధానాంశాలుగా ఉ న్నాయి. అందులో భాగంగానే ప్రతిపక్ష రాజ కీయ పార్టీలను విచ్ఛిన్నం చేయటానికి పూనుకున్నారు. ప్రతిపక్షపార్టీల నాయకత్వంలో ఉన్న ప్రభుత్వాలను కూల్చివేస్తున్నారు. కార్పొరేట్లకు గులాంగిరి చేస్తూ, వేలకోట్ల రూపాయలు కుమ్మరించి, ప్రతిపక్ష పార్టీల శాసనసభ్యులను కొనుగోలు చేస్తున్నారు. ఎన్నికలలో ప్రజలిచ్చిన తీర్పును వమ్ముచేస్తూ తమపార్టీని ప్రజలు తిరస్కరించిన రాష్ట్రాలలో కూడా దొడ్డిదారిన ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో వివిధ రాష్ట్రాలలో ప్రదర్శించిన ఈ విద్యనే ఇపుడు తెలంగాణలో ప్రదర్శించి భంగపడ్డారు. దేశభక్తి, అభ్యుదయ దృక్పథం, ప్రజలపై విశ్వాసం లేని ఆర్ఎస్ఎస్, బిజెపిలు దేశాన్ని అన్ని విధాలుగా తిరోగమన మార్గంలోకి నడిపిస్తున్నాయి. అందులో భాగంగానే ప్రజ్వాస్వామిక రాజకీయ వ్యవస్థను ధ్వంసం చేస్తున్నాయి. దీనిని నిరోధించటంలో బూర్జువా రాజకీయ పార్టీలు విఫలమైనాయని స్పష్టమౌతున్నది. వామపక్షాల నాయకత్వంలో ప్రజలు సమీకృతం అయితేనే ఆర్ఎస్ఎస్, బిజెపిల తిరోగమన విధానాలను అడ్డుకోవటం సాధ్యమౌతుంది.

**ఎన్నికల వేళ ఉమ్మడి పౌరస్మృతి గోల**

వివిధ రకాలుగా ప్రజలపై భారాలు వేస్తూ, వారి జీవన ప్రమాణాలను దిగజారుస్తున్న బిజెపి ఎన్నికలు వచ్చేసరికి గెలుపు కోసం భావోద్వేగాలను రెచ్చగొట్టే అంశాలను ముందు కు తెస్తున్నది. దానిని ఇపుడు గుజరాత్‌లో ప్రదర్శించటానికి పూనుకున్నది. ఈ సంవత్సరాం తంలోగా గుజరాత్ శాసనసభకు ఎన్నికలు జరగవవలసిఉంది. ఎన్నికలలో గెలవటం కోసం ఎటువంటి వాగ్దానాలు చేయటానికైనా వెనుదీయని బిజెపి అక్కడ ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని ముందుకు తెస్తున్నది. రాష్ట్రంలో ఉ మ్మడి పౌరస్మృతిని అమలుజరపటంపై పరిశీలించి, నివేదికను సమర్పించటం కోసం కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆర్ఎస్ఎస్ మార్గదర్శకత్వంలో బిజెపి ప్రభుత్వం మైనారిటీల మతపరమైన అంశాలలో జోక్యం చేసుకోవటం, హిందువులు అనుసరించే వాటినే మిగతా మతాల వారు కూడా అనుసరించాలని వారిపై రుద్దటం పెరుగుతున్నది. కొన్ని సామాజిక అంశాలలో ఆయా మతాలకు చెందినవారు భిన్నంగా వ్యవహరించటం జరుగుతున్నది. అన్ని మతా లకు చెందినవారికి అటువంటి అవకాశాన్ని రాజ్యాంగం కల్పించింది. కాని బిజెపి ప్రభు త్వం ముస్లింలు మాత్రమే మతపరంగా ప్రత్యేక హక్కులు అనుభవిస్తున్నట్లు, చట్ట ప్రకారం వ్యవహరించాలని ఒత్తిడి చేయటం ద్వారా హిందువుల హక్కులను హరిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నది. అందరికీ సమన్యాయం జరగాలంటే ఉమ్మడి పౌరస్మృతిని తీసుకురావాలని ప్రచారం చేస్తున్నది. కాని పెళ్ళిళ్ళు, విడాకులు, మహిళల హక్కులు, ఆస్తుల పంపకాలు, ఇతర అనేక అంశాలలో హిందు మతానికి చెందిన వారికి కూడా కొన్ని ప్రత్యేకహక్కులు ఉన్నాయి. ఇతర మైనారిటీ మతాల వారికి కూడా మతపరమైన ప్రత్యేకతలు ఉన్నాయి. హిందుమతంలోని వారు అనుసరిస్తున్న వాటినే ఉమ్మడి పౌరస్మృతి పేరుతో మైనారిటీ మతాల వారిపై రుద్దటం కోసం చేస్తున్న ప్రయత్నాలను ఇపుడు వేగవంతం చేస్తున్నారు. ఈ విధంగా ఇతర మతాల వారిపై తమ భావాలను ఉరుద్దటానికి పూనుకున్న వారు తమ మతంలోని మహిళలకు, దళితులు, గిరిజనులకు ఎటువంటి హక్కులు ఉండరాదని చెబుతున్నారు. పుట్టినప్పటి నుండి చచ్చేవరకు పురుషుని అదుపులో, అగ్రవర్ణాల పెత్తనం కింద, బ్రాహ్మణాధిక్యత ఉండే సమాజంలో ఉండాలని, ఆంక్షలకు లోబడి బతకాలని వారిని ఒత్తిడి చేస్తున్నారు.

❝ వివిధ రకాలుగా ప్రజలపై భారాలు వేస్తూ, వారి జీవన ప్రమాణాలను దిగజారుస్తున్న బిజెపి ఎన్నికలు వచ్చేసరికి గెలుపు కోసం భావోద్వేగాలను రెచ్చగొట్టే అంశాలను ముందు కు తెస్తున్నది. దానిని ఇపుడు గుజరాత్‌లో ప్రదర్శించటానికి పూనుకున్నది. ఈ సంవత్సరాం తంలోగా గుజరాత్ శాసనసభకు ఎన్నికలు జరగవవలసిఉంది. ఎన్నికలలో గెలవటం కోసం ఎటువంటి వాగ్దానాలు చేయటానికైనా వెనుదీయని బిజెపి అక్కడ ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని ముందుకు తెస్తున్నది. ❞

ఒకవైపున భిన్న మతాలను అనుసరించే వారికి ఉమ్మడి పౌరస్మృతిని అమలుచేయాలని ప్రచారం చేస్తున్న ఆర్ఎస్ఎస్, బిజెపిలు మరో వైపున అందరికీ సమానంగా వర్తించవలసిన నేర నిరోధక చట్టాలను, న్యాయవ్యవస్థను వివక్షతో అమలు చేస్తున్నది. సాటి మనుషులను హత్యలు చేయమని బహిరంగంగా బెదిరిస్తున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. స్వామి జీల పేరుతో మైనారిటీలను మూకుమ్మడిగా హత్యలు చేయమని ప్రచారం చేస్తున్నారు. మసీదులు, చర్చిలను ధ్వంసం చేస్తున్నారు. కేవలం ఒక మతానికి చెందినవారనే కారణం తో ఏ నేరం చేయకపోయినా టెర్రరిస్టులనే ముద్రవేసి, జైళ్ళలో మగ్గబెడుతున్నారు. అదే హిందుత్వ తీవ్రవాదాన్ని ప్రోత్సహించేవారైతే ఎంత నేరపూరితంగా మాట్లాడినా, ఎదుటి మతం వారిని హత్యచేసినా వారికి ఎటువంటి శిక్షలు ఉండటం లేదు. దీనిని ఆర్ఎస్ఎస్, బిజెపిలు బలపరుస్తున్నాయి. తమ రాజకీయ ప్రయోజనాల కోసం మతపరమైన అంశాలు అమలు జరగాల్సిన చోట ఉమ్మడి పౌరస్మృతి కావాలని, అందరికీ ఒకేవిధంగా అమలుజరగా ల్సిన చట్టాలను మతం ప్రాతిపదికగా అమలు జరపటానికి ఆర్ఎస్ఎస్, బిజెపిలు ప్రయత్నం చేస్తున్నాయి. ఇదంతా హిందుత్వ విధానాల అమలులో భాగమే. దీనిని ప్రతిఘటిస్తేనే మత సామరస్యం, దేశసమైక్యత బలపడతాయి. హిందుత్వ విధానాలు కొనసాగితే దేశ ఐక్యత ప్రశ్నార్ధకం అవుతుంది. కాబట్టి ఈ మతోన్మాద విధానాలను ప్రతిఘటించటానికి లౌకికశక్తులు, అభ్యుదయవాదులు, దేశభక్తులు ముందుకు రావాలి. నిరుద్యోగులు, యువత, ఇతర తరగ తుల ప్రజలు చేస్తున్న పోరాటాలతో విద్యార్థులు కూడా కలిసి తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యపోరాటాలు చేయాలి ❈

ఈ మాసం ప్రత్యేకం

# భారత స్వాతంత్ర్యం, దేశ విభజనపై చారిత్రక చర్చలు

సుచేత మహాజన్



రచయిత ఢిల్లీ లోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్

స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలు గడుస్తున్నది. స్వాతంత్ర్యం సాధన, అనంతరం దేశ విభజనలపై సాగుతున్న చరిత్ర రచన దిశను ప్రశాంతంగా ఆలోచించి, అంచనా వేసేందుకు ఇది సరైన సమయము. ఆ చారిత్రక సంఘటనలపై 50వ వార్షికోత్సవం సందర్భంగా కూడా స్థూలమైన పరిశీలన జరిగింది. దేశ విభజనపై గొప్ప సృజనాత్మక నిపుణులైన చరిత్ర పరిశోధకులు దాదాపు మౌనముద్రను పాటించారెందుకని అషీష్ నందీ ఆనాడే అడిగివుంటే ఈ పాటికే పరిస్థితిలో మార్పు వచ్చివుండేది. ఇప్పటికీ పుస్తకాలు, వ్యాసాల శీర్షికల్లో స్వాతంత్ర్యం అంశం తర్వాతే దేశ విభజనకు చోటు లభిస్తున్నది. 75 సంవత్సరాల నాటికి కూడా దేశ విభజనకు సంబంధించిన అధ్యయనాల పరంపరను స్పష్టంగా చూడలేక పోతున్నాను. స్వాతంత్ర్య సాధనకు పలు మార్గాలు ఉపకరించాయి. వాటిలో దేశ విభజనకు దారితీసిన మార్గాన్ని గమనించాలన్న ఆశతో చరిత్ర అధ్యయనాలను పరికించేందుకు ప్రయత్నించాను.

ప్రస్తుతం దేశ విభజన గురించి తెల్సుకోవటంపై నిమగ్నమైనాము. ఫలితంగా దాని 'కవలబిడ్డ' స్వాతంత్ర్యం గురించి తరచూ మరచిపోతున్నాము. జాతీయోద్యమ క్రమంలో జయాపజయాలు రెండూ ప్రతిబింబించాయని నా రచన ' స్వాతంత్ర్యము మరియు విభజన'లో రుజువు చేసేందుకు ప్రయత్నించాను. బ్రిటీష్ వలసపాలన నుండి విముక్తిని సాధించటం కోసం ఒక జాతిని రూపొందించేందుకు సామాజిక తరగతులు, తెగలన్నీ ఏకమయ్యాయి. స్వాతంత్రోద్యమం వెనుక ముస్లిం మైనారిటీలు అతి స్వల్పంగా మాత్రమే సమీకృతమైనారు. అదే ఆ వుద్యమం బలహీనత. ఫలితంగా లభించింది స్వాతంత్ర్యం మాత్రమే కాదు. విభజన కూడా.

విభజనకు బాధ్యులెవరు? ఈ ప్రశ్నకు సమాధానంపై చరిత్రకారుల్లో ఏకాభిప్రాయం లేదు. సామ్రాజ్యవాద చరిత్రకారుల కథనం ఇలావుంది : " హిందు, ముస్లింల మధ్య కొన్ని శతాబ్దాలుగా విభజన కొనసాగుతున్నది. వారి మధ్య స్నేహ వారధిని నిర్మించేందుకు బ్రిటీష్‌వారు అహరహం అనేక ప్రయత్నాలు చేశారు. కానీ వారి యత్నాలు దేశ విభజనను నివారిచంలేక పోయాయి." కానీ అందుకు, జాతీయ చరిత్రకారులు సామ్రాజ్యవాదులను బాధ్యులను చేశారు. వారి అభిప్రాయం ఇలా వుంది : " బ్రిటీష్‌వారు, భారతీయులను విభజించి పాలించారు. ముందుగా తాము పెంచిపోషించిన మతోన్మాద శక్తులను రెచ్చగొట్టారు. దేశాన్ని విభజించి, బైటకు పోయారు." వామపక్ష రచయితల్లో కొందరి అభిప్రాయం ఇలా వుంది : '' సామ్రాజ్యవాదులకు, జాతీయ పాలకవర్గాలకు మధ్య రాజీ ఫలితమే దేశ స్వాతంత్ర్యం, దేశ విభజన మూల్యాన్ని ప్రజలు భరించారు."

దేశంలో నెలకొన్న జాతీయవాదాన్ని సవాలు చేసేందుకు వలసవాద ప్రభుత్వం విభజించి పాలించే విధానాన్ని అవలంబించిందని, అందుకు అనుగుణంగానే విభజన గురించి వారు చెప్పిందే చేసి వెళ్లారని నేను వేరొక రచనలో రుజువు చేశాను. బ్రిటీష్ ప్రభుత్వం అనేక సంవత్సరాలుగా జాతీయ కాంగ్రెస్‌కు ప్రతిశక్తిగా ముస్లింలీగ్‌ను అభివృద్ధిచేసింది. తమకొక ప్రత్యేక మాతృదేశం కావాలన్న ముస్లింలీగ్ డిమాండును వలసవాద శక్తులు ఆమోదించాయి. దేశం వదలి పోయే సమయంలో విభజనకు పాల్పడి ఆ డిమాండును అమలుపరిచాయి. బ్రిటీష్‌వారి ప్రాపకంగల పాకిస్థాన్‌తో తలపడే సమయానికి కాంగ్రెస్‌కు పరిమితమైన అవకాశాలే మిగిలాయి. మతోన్మాదానికి వ్యతిరేకంగా శక్తివంతమైన సైద్ధాంతిక పోరాటం జరపాల్సిన అవసరాన్ని జాతీయ కాంగ్రెస్ నాయకులు ముఖ్యంగా గాంధీ, నెహ్రూలు గుర్తించారు. కానీ అలాంటి పోరాటాన్ని సాగించలేదు.

దేశ విభజనను ఒక తాత్కాలిక చర్యగా ఆమోదించేందుకు 1947 వసంతకాలం నాటికి కాంగ్రెస్ నాయకులు అంగీకరించారు. తద్వారా దేశంలోని పలు ప్రాంతాల్లో చెలరేగిన అంతర్యుద్ధాన్ని అదుపు చేయవచ్చని వారు భావించారు. ఈ సందర్భంగా నెహ్రూ ఇలా చెప్పారు : " రానున్న రోజుల్లో –ఈ తుఫాను ముగిసిన అనంతర కాలంలో – ఒక బలమైన, సమైక్య భారతదేశం ఆవిర్భవిస్తుందని నేను విశ్వసిస్తున్నాను. పర్వతాల శిఖరాగ్రానికి సూర్య కాంతి చేరే ముందు, పలు లోయల నీడలను దాటాలి." ప్రజలు తమ హృదయాంతరాళంలో దేశ విభజనను అంగీకరించకుంటే, అంతిమంగా మనమందరం ఒకటౌతామని గాంధీ ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటించాడు. కానీ విభజన వాస్తవరూపం తీసుకుంది. ముస్లింలను బుజ్జగిస్తున్నారన్న నెపం మోపి హిందూ మతోన్మాదులు గాంధీజీని హత్యచేశారు. అదొక ద్వంద్వ వ్యూహం.

స్వాతంత్ర్యము, దేశ విభజనపై ప్రారంభ రచనలన్నీ వాటిలో పాల్గొన్నవారి అనుభవాల సమాహారాలుగానే ఉన్నాయి. బిఆర్ అంబేద్కర్, రాజేంద్రప్రసాద్ వంటి రాజకీయ నేతలు పాకిస్థాన్ డిమాండును సమీక్షించారు. 1959లో మౌలానా ఆజాద్ 'ఇండియా విన్స్ ఫ్రీడం' గ్రంథాన్ని రచించారు. అప్పటికే ఆయన నాటి పరిణామాల పట్ల విరక్తిచెంది, తన సహచరులను ఆక్షేపించసాగినట్లు కన్పిస్తున్నది. రామమనోహర్ లోహియా కాంగ్రెస్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ 1948లో ఆ సంస్థను వీడారు. ఆ తర్వాత ఆయన' గిల్టీ మెన్ ఆఫ్

ఇండియన్ పార్టీషన్' గ్రంథ రచనచేశారు. సీనియర్ ప్రభుత్వ అధికారులు - విపి మీనన్ (1957లో 'ద ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పవర్ ఇన్ ఇండియా'), మౌంట్‌బాటెన్‌కు సహాయాధికారిగా పనిచేసిన లార్డ్ ఇస్మే (1960లో 'మెమోయిర్స్'), పెండ్రెల్ మూర్ ( 1964లో ' డివైడ్ అండ్ క్విట్') గ్రంథాలను లండన్ నుండి రచించారు.

'ట్రాన్స్ఫర్ ఆఫ్ పవర్' శీర్షికతో 1942-47కాలపు అధికార డాక్యుమెంట్ల సంపుటాలను ప్రచురించారు. జిన్నా, పటేల్, నెహ్రూ, గాంధీ, రాజేంద్రప్రసాద్, జయప్రకాష్ నారాయణ వంటి కాంగ్రెస్, ముస్లింలీగుకు చెందిన ముఖ్య నాయకుల వ్యక్తిగత పత్రాల ప్రచురణ ప్రారంభమైంది.

> **"రెండవ ప్రపంచ యుద్ధం ముగిసేనాటికి భారత ప్రజల 'ఆధిపత్య ప్రతినిధి' స్థాయికి స్వాతంత్ర్యోద్యమం ఎదిగింది. దేశంలోని పలు ప్రాంతాలు, తరగతుల ప్రజానీకంలో గతంలో ఏనాడూ కనీవిని ఎరుగని రీతిలో జాతీయ భావోద్వేగాలు అత్యున్నత స్థాయికి చేరాయి. పౌర విభాగాలు, యుద్ధ కార్యకలాపాలు, జాతీయోద్యమ ప్రతిఘటనలను అదుపుచేసే పనిలోనే సాయుధ దళాలు అలసిపోయాయి."**

దేశానికి స్వాతంత్ర్యం ఎందుకు, ఎలా వచ్చిందన్న అంశాలవైపు 1980లలో మేధావుల దృష్టి మళ్లింది. రెండవ ప్రపంచయుద్ధం ముగింపు నాటికి 'వలస రాజ్యం' సంపదకు మారుగా బ్రిటీష్ ప్రభుత్వానికి భారంగా మారినట్లు ఆర్‌జె మోర్స్ రచన 'ఎస్కేప్ ఫ్రం ఎంపైర్' తెల్పుతున్నది. బ్రిటీష్‌వారు భారత్‌ను వదలాలని ఎందుకు నిర్ణయించారన్న కీలక ప్రశ్నకు నేనొక భిన్నమైన సమాధానాన్ని సూచించాను. ఆ ప్రశ్నకు 1947 సందర్భంలోనే సమాధానం లభించదు. వలస పాలనకు వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘకాల పోరాటాల్లోనే సరైన సమాధానం దాగివుందని నేను నమ్ముతున్నాను. 1945-46 కాలానికే అధికారం ఎవరికి, ఎలా బదిలీచేయాలన్న ఏకైక అంశం మాత్రమే బ్రిటీష్‌వారికి మిగిలింది.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసేనాటికి భారత ప్రజల 'ఆధిపత్య ప్రతినిధి' స్థాయికి స్వాతంత్ర్యోద్యమం ఎదిగింది. దేశంలోని పలు ప్రాంతాలు, తరగతుల ప్రజానీకంలో గతంలో ఏనాడూ కనీవిని ఎరుగని రీతిలో జాతీయ భావోద్వేగాలు అత్యున్నత స్థాయికి చేరాయి. పౌర విభాగాలు, యుద్ధ కార్యకలాపాలు, జాతీయోద్యమ ప్రతిఘటనలను అదుపుచేసే పనిలోనే సాయుధ దళాలు అలసిపోయాయి. వలసవాద అధికార శక్తి కోలుకోలేని విధంగా అవసాన దశకు చేరినట్లు వలసవాద అధికారులు, ప్రజలు గమనించగల్గారు.

వలసవాద అధికార పునాదిని అణిచేందుకు ప్రధాన జాతీయపార్టీ(భారత జాతీయ కాంగ్రెస్-ఇకపై కాంగ్రెస్‌గా ప్రస్తావిద్దాము) వ్యూహాన్ని రూపొందించింది. సతీష్ చంద్ర ఆ వ్యూహానికి 'పోరాటము - స్వల్ప విరామం -పోరాటం'గా నామకరణం చేశాడు. అంటే ఆ ప్రతిఘటనోద్యమ పోరాట దశలు స్వల్పకాలిక పోరాట విరమణలతో కూడి వుంటాయి. తదుపరి దశ పోరాటాన్ని మరింత వుధృతంగా చేపట్టే మార్గాన్ని ఆ విరమణ సుగమం చేస్తుంది. అహింసాయుతమైన పోరాటంపై దమనకాండను ప్రయోగించటమే వలస పాలకుల బలహీనతను బట్టబయలు చేస్తున్నది. వేరొక వైపున ప్రభుత్వమే తరచూ యుద్ధ విరమణ చేసినపుడు అది చాలా బలహీనంగా వున్నట్లు స్పష్టమౌతున్నది. అలాంటి సందర్భాల్లో వలసవాదపు విధేయులు ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని కోల్పోతున్నారు. వివిధ ప్రభుత్వ విభాగాలు సందిగ్ధంలో పడుతున్నాయి. జాతీయోద్యమంపై దాడిచేయటం, రాజీపడటం వంటి ద్విముఖ వ్యూహాన్ని అమలు చేయటంతో అధికార యంత్రాంగం తీవ్ర నిస్తేజానికి, నిరుత్సాహానికి గురయ్యింది.

1946 మధ్య కాలానికి, ప్రభుత్వానికి ఒక నూతన పరిస్థితి ఎదురైంది. దేశంలో శాంతి నెలకొల్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ అందుకు దానికున్న శక్తి పరిమితం. దేశంలోని వివిధ ప్రావిన్స్‌ల్లో తమ అధీనంలోని ప్రభుత్వాల అండతో కాంగ్రెస్ తిరుగుబాట్లను నడుపుతున్నది. ఆ తిరుగుబాట్లకున్న అవకాశాలపై నాటి వైస్రాయి అభిప్రాయం ఇలా వుంది : " ఆ ప్రతిఘటనలను అణచివేయగల అవకాశం ఇప్పటికీ మాకుంది. కానీ దాని స్థానంలో మరొక పాలనా పద్ధతిని నెలకొల్పగల అవకాశం లేదు. కాకుంటే సంపూర్ణంగా అధికారుల పాలనవైపు మేము నెట్టబడవచ్చు. కానీ అందుకు అవసరమైన సంఖ్యలో సమర్ధవంతమైన అధికారులు అందుబాటులో లేరు." పాత పద్ధతుల్లో వలస పాలనను దీర్ఘకాలం నిలబెట్టేందుకు అవకాశం లేదు. ఈ నేపధ్యంలో భారతదేశం నుండి తప్పుకోవటమనే ఏకైక మార్గమే వారి ముందుంది.

1920-1932 కాలపు పరిణామాలను ఆర్‌జె మోర్ స్వాతంత్ర్య సాధన దిశగా పరిశీలించాడు. డేవిడ్ పేజ్ దేశ విభజనకు అంకురార్పణ జరిగిన దిశలో విశ్లేషించాడు. అనితా ఇందర్ సింగ్ 1987లో ' ద ఆరిజన్స్ ఆఫ్ ద పార్టిషన్ ఆఫ్ ఇండియా' గ్రంధాన్ని రచించారు. అది వలసవాద పాలనకు చివరి దశాబ్దం. మతోన్మాదం ప్రజా స్వభావాన్ని సంతరించుకున్నదశలో, విభజనపై పలు కల్పిత గాధలు ప్రచారంలో వుండేవి. వాటిలో ముఖ్యంగా, ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ ముస్లింలీగ్‌తో కలసి మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి వుంటే దేశ విభజన నివారించబడి వుండేదన్న అంశం బహుముఖ ప్రచారంలో వుంది. అలాంటి వూహాజనిత గాధలతో ఆ రచయిత విభేదించాడు. పాకిస్థాన్ ఒక సర్వసత్తాక దేశంగా ఏర్పడటంపై ముస్లింలీగ్ లాహోర్ తీర్మానం స్పష్టంగా లేదని ఆయేషా జలాల్ తదితరులు వ్యాఖ్యానించారు. అంతేకాదు, కేవలం బేరసారాల విన్యాసం కోసమే పాకిస్థాన్ డిమాండు ఉద్దేశించబడినందున ఆ డిమాండు అస్పష్టంగా వుందని కూడా ఆ రచయిత ధృవీకరించారు. ఆ ధృవీకరణలను రచయిత అనితా ఇందర్ సింగ్ తన గ్రంథంలో తిరస్కరించారు. అనంతరం, సలీల్ మిశ్రా ' ఎ నరేటివ్ ఆఫ్ కమ్యూనల్ పాలిటిక్స్ : ఉత్తరప్రదేశ్ ' గ్రంధాన్ని 2001లో వెలువరించాడు. ప్రజల్లో మతోన్మాదం ఆవహిస్తున్న దశలోని యుపి వంటి కీలక ప్రావిన్స్‌లో నెలకొన్న రాజకీయాలపై ఈ గ్రంథం విలువైన సమాచారాన్ని సమకూర్చింది. యుపిలో మిశ్రమ ప్రభుత్వ ఏర్పాటు'ప్రతిపాదన దశలోనే ఆగిపోయిందని, అందుకు జిన్నా ఆమోదించకపోవటంతో పాటు కాంగ్రెస్, లీగ్‌ల భిన్నమైన రాజకీయ, వర్గ ప్రయోజనాలు కూడా దోహదపడ్డాయని మిశ్రా స్పష్టం చేశాడు.

జిన్నా విభజనను కోరలేదని, కాంగ్రెస్ మాత్రమే ఆపని చేసిందని రెచ్చగొట్టే ఆయేషా

> **" దేశ విభజన జరిగితే తమ ప్రావిన్స్‌లను అందుకు అనుగుణంగా విభజించాలన్న అక్కడి మైనారిటీల డిమాండును కాంగ్రెస్ అయిష్టంగానే బలపరిచింది. దేశ విభజనకు ఆమె కాంగ్రెస్‌ను బాధ్యురాలిని చేస్తున్నది. తద్వారా ఆ నేరం నుండి బ్రిటీష్ పాలకులను విముక్తి చేస్తున్నది. "**

జలాల్ ప్రకటన సాంప్రదాయంగా ఆమోదించబడిన నమ్మకాన్ని దెబ్బతీసింది. కేంద్రంలో అధికారంలో వాటా కోసమే జిన్నా పాకిస్థాన్ డిమాండ్‌ను ఒక బేరసారాల విన్యాసంగానే చేశారన్న అభిప్రాయాన్ని జలాల్ నమ్మివుండవచ్చు. కాంగ్రెస్, హిందు మహాసభలు అధికారాన్ని పంచుకునేందుకు తిరస్కరించాయని, పంజాబ్, బెంగాల్ వంటి ముస్లిం మెజారిటీ ప్రావిన్స్‌లను భారత్ నుండి విడగొట్టేందుకే ప్రాధాన్యతనిచ్చాయని జలాల్ అభిప్రాయపడ్డారు. పంజాబ్, బెంగాల్ ప్రావిన్స్‌ల విభజనను కాంగ్రెస్ ఆమోదించటాన్ని ఆ పార్టీ దేశ విభజనకు అనుకూలించినట్లు అన్వయించి జలాల్ వాదించారు. తద్వారా ఆ రెండు ప్రావిన్స్‌లను అంతర్గతంగా విభజించటాన్ని జలాల్ దేశం విభజనతో సరిసమానంగా చూపుతున్నారు. మౌంట్‌బాటెన్‌తో నెహ్రూ జరిపిన సంభాషణను ఆమె ఇలా వుటంకించారు :" జిన్నా దేశ విభజనను గట్టిగా వ్యతిరేకించాడు. కాంగ్రెస్ విభజనను కోరింది..." కానీ పంజాబ్ విభజన గురించి చర్చించిన విషయాన్ని ప్రస్తావించటాన్ని ఆమె మరచిపోయారు. చర్చించింది, దేశ విభజన గురించి కాదు. కేవలం ప్రావిన్స్‌ల విభజనల గురించి మాత్రమే. కాంగ్రెస్ దేశ సమైక్యతకు కట్టుబడి వుందన్న వాస్తవాన్ని ఆమె విస్మరించారు.

దేశ విభజన జరిగితే తమ ప్రావిన్స్‌లను అందుకు అనుగుణంగా విభజించాలన్న అక్కడి మైనారిటీల డిమాండును కాంగ్రెస్ అయిష్టంగానే బలపరిచింది. దేశ విభజనకు ఆమె కాంగ్రెస్‌ను బాధ్యురాలిని చేస్తున్నది. తద్వారా ఆ నేరం నుండి బ్రిటీష్ పాలకులను విముక్తి చేస్తున్నది.

జలాల్ సిద్ధాంతాన్ని జోయా చటర్జీ ప్రావిన్స్‌లకు వర్తింపజేస్తూ ఇలా వాదించాడు : బెంగాలీ హిందువులు ముఖ్యంగా 'భద్రలోక్(అంటే, పెద్దమనుషులు, సంస్కారవంతులు అని అర్ధం. బ్రిటీష్ కాలపు బెంగాల్ హిందువుల్లోని విద్యావంతులు, సంపన్నులు, జమిందారులు. బెంగాల్‌లో హిందూ మత వ్యాప్తికి కృషిచేశారు.) దేశ విభజన వైపు మొగ్గారు. బెంగాల్ విభజన, అనంతర పరిణామాలపైన ఆమె రాసిన పుస్తకం ' బెంగాల్ డివైడెడ్ : హిందూ కమ్యూనలిజం అండ్ పార్టీషన్'లో భద్రలోక్‌లు 'అక్కడి హిందువుల్లో సమాంతర వేర్పాటువాదాన్ని ప్రోత్సహించినట్లు ఆరోపించారు. భద్రలోక్ రాజకీయాలపై చటర్జీ దృక్కోణం అనీల్ సీల్ అవగాహనలను పోలివుంది. అధికారం కోసం సాగిన ఉన్నతవర్గాల పోరాటానికి జాతీయవాదం ఒక తెరలా ఉపయోగపడిందని సీల్ అభిప్రాయపడ్డారు. అందుకు భద్రలోక్ మొత్తం ఒక కార్యాచరణ విభాగంగా పనిచేసిందన్న సీల్ నిర్ధారణలతో చటర్జీ కూడా ఏకీభవించారు. చటర్జీ బెంగాల్ నాయకులను ' హిందూ స్థానిక పాలకులు'గా అభివర్ణించారు. జుదీత్ బ్రౌన్ తన గ్రంథం 'గాంధీస్ రైజ్ టు పవర్, ఇండియన్ పాలిటిక్స్'లో వారికి 'సబ్‌కాంట్రాక్టర్లు' అని నాయకరణం చేశాడు. సీల్ ఆ జంటను 'దసరా ద్వయం' అని, చటర్జీ బెంగాల్ రాజకీయ పార్టీల మధ్య వైరుధ్యాన్ని, ముఠాల పరమైన ' కుక్కల పోరు'గా అభివర్ణించారు.

రెండు వైపుల నుండి దేశ విభజన జరిగిన తీరును చటర్జీ ఇలా వ్యక్తం చేశారు : ప్రావిన్స్‌ల స్థాయిలో బెంగాలీ హిందువుల స్పందనలకు అనుగుణంగా కేంద్రంలోని కాంగ్రెస్ చొరవ తీసుకుంది. మధ్యంతర ప్రభుత్వంలో ముస్లింలీగ్‌తో తన అనుభవాలను ఆధారం చేసుకుని, బ్రిటీష్‌వారి నిష్క్రమణ అనివార్యమైన పరిస్థితుల్లో పరిమితమైన విభజననే కాంగ్రెస్ కోరింది. అంటే దేశ విభజన అనివార్యమైనపుడు పంజాబ్, బెంగాల్ ప్రావిన్స్‌ల విభజనకే కాంగ్రెస్ చొరవ పరిమితం.'' ఈ అవగాహన లోపభూయిష్టమైనది. అందుకు భిన్నంగా నెహ్రూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటి అభిప్రాయాన్ని గాంధీతో ఇలా వ్యక్తపరిచాడు : " మనం వాస్తవ పరిస్థితిని ప్రజల ముందుంచాలి. అందుకే తక్షణం ప్రావిన్స్‌ల విభజనకై మనం వత్తిడి చేయాలి. జిన్నా పాకిస్థాన్ డిమాండుకు ఇవ్వగల ఏకైక సమాధానమిదే. విభజన తర్కాన్ని ప్రావిన్స్‌లకు వర్తింపచేసిన అనంతరం, కొసలు కత్తిరించబడిన పాకిస్తాన్ విలువ తగ్గిందని తెలిశాక జిన్నాకు జ్ఞానోదయమౌతుంది."

1947లో పరిమిత విభజనకు కాంగ్రెస్ ఎందుకు వత్తిడి చేసింది ? అందుకు చటర్జీ మరొక వివరణ ఇలా వుంది : " ప్రధానంగా శక్తివంతమైన కేంద్ర అధికారాలుగల ఏకీకృత రాజ్యాన్ని సాధించేందుకు ఆ వత్తిడి వుద్దేశించబడింది. బ్రిటీష్ రాజ్యం నుండి వారు కోరుతున్న వారసత్వ హోదా అదే. విభజనకు, నిరాశకు గురైన జాతిని ఐక్యంగా కలిపి వుంచేందుకు అవసరమైన చాలినన్ని అధికారాలుగల, ఒక శక్తివంతమైన కేంద్రం కావాలని వారు కోరుతున్నారు. వలసవాద వారసత్వంగా బలమైన కేంద్రం సంక్రమించింది. భారత్‌కు గతం నుండి అనైక్యత కూడా వారసత్వంగా లభించింది. ఆధారాలు చూపలేని ఊహాజనితమైన పై రెండు అంశాలను సామ్రాజ్యవాద ప్రేరిత మేధావుల నుండి పంచుకున్నాము. వాటిని గురించి తర్వాత పరిశీలిద్దాము.

బెంగాలీ భద్రలోక్ హిందువులు బెంగాల్‌ను డిమాండ్ చేయటమేకాదు, దాన్ని కోతకోసేందుకే ప్రాధాన్యత నిచ్చారన్న ఆసక్తికరమైన అంశాన్ని చటర్జీ రూపకల్పనచేశారు. దేశ విభజన ద్వారా బ్రిటీష్ సామ్రాజ్యానికి వలస_రాజ్యం రాజీనామా సమర్పించింది. బ్రిటీష్ సామ్రాజ్య పాలనా వ్యవస్థ వివాదాలమయమైంది. విభజించబడిన రాష్ట్రాల వారసత్వాన్ని వదిలేసి వెనక్కు మళ్లింది. విభజన వెనుకనున్నవారు, అందుకు బాధ్యులైనవారి జాబితాను చటర్జీ తన రచనల్లో పొందుపరచలేదు. సామ్రాజ్యవాద అనుకూల చరిత్రకారులు కనీసం విభజన సందర్భంగా అనుసరించిన గజిబిజి పద్ధతులకు మౌంట్‌బాటెన్, రాడ్‌క్లిఫ్, రీస్ తదితరులను బాధ్యులుగా చూపారు. ఆ దిశలో చటర్జీ వెనుకంజవేశారు.

జలాల్ విద్యార్థి నీతీనాయర్ తన గ్రంథం 'ఛేంజింగ్ హోం ల్యాండ్'లో ఇలా

ప్రస్తావించారు : "పంజాబ్ హిందువులు కాంగ్రెస్ అగ్రనాయకత్వంతో చర్చించి తమ ప్రావిన్స్‌ను విభజించాలని డిమాండుచేశారు. ...1924 కోహత్ దాడుల అనంతరం ' హిందూ, ముస్లిం ఇండియాగా విభజించాలని లజపతిరాయ్ ప్రబోధించారు. ఆయన కాంగ్రెస్‌తో సంబంధాలను తెగదెంపులు చేసుకుని 'హిందు మహాసభ' అధ్యక్షుడి బాధ్యతులు చేపట్టారు...." ఇతర సందర్భాల్లో లజపతిరాయ్ హిందు, ముస్లిం ఐక్యతకై నిలిచినట్లు ఆమె అంగీకరించారు.

మరొక పద్ధతిలో జాతీయవాదం పునాది బలహీనపరచబడింది. సమస్య దృష్టి అంతా అఖిల భారత స్థాయి నుండి ప్రాంతీయ స్థాయికి మార్చటంతో ఆ పరిణామం జరిగింది. దీన్నే ' స్థానికత – ప్రావిన్స్ – దేశం' అజండాగా సీల్ అభివర్ణించాడు. చటర్జీ బెంగాల్‌కు, నాయర్ పంజాబ్‌కు నమూనాలను రూపొందించారు. ఆ రెండు ప్రావిన్స్‌లు పాకిస్థాన్ రాజ్యాంగ విధానాన్ని నిర్ణయంచే ప్రధాన ప్రాంతాలుగా మారాయి. ' ఏకైక ప్రతినిధి' సిద్ధాంతాన్ని, అఖిల భారత స్థాయిలో ఆ ప్రతినిధి బేరసారాల విన్యాసాన్ని జలాల్ ప్రతిపాదించాడు. ఆయేషా జలాల్ తన గ్రంథం ' సెక్యులరిస్ట్స్, సబాల్టరన్స్ అండ్ ది స్టిగ్మా ఆఫ్ కమ్యూనలిజం : పార్టీషన్ హిస్టీరియోగ్రఫీ రివైజ్డ్ 'లో దేశంలో ముస్లిం రాజకీయాలు అఖిల భారత స్వభావాన్ని వదిలేసి ప్రాంతీయ భిన్నత్వాన్ని గుర్తించాలని కోరినట్లు పేర్కొన్నాడు. జాతీయ స్థాయి చరిత్రలు, కథనాలకంటే స్థానిక , ప్రాంతీయ కథనాలు చాల సంక్లిష్టంగా వుంటాయని యాసింఖాన్ తన గ్రంథం ' ద గ్రేట్ పార్టీషన్' లో ప్రస్తావించారు. పై విధంగా 'అఖిల భారత ' దృక్పథాన్ని వదిలేసిన వారికి, తమ దృష్టినంతా ప్రాంతాలు వాటి చరిత్రలపై పెట్టేవారికి మధ్య తేడాను అందరూ గమనించాలి. ప్రాంతీయ సుసంపన్నతను తవ్వితీసే చరిత్రకారులు దేశానికి వ్యతిరేకంగా నిలవాల్సిన అవసరం లేదు.

ఉన్నత వర్గాల చరిత్ర నుండి దిగువ వర్గాల చరిత్ర( పై నుండి కిందికి మారుగా చరిత్ర దిగువ నుండి ఎగువకు)గా మారటం చరిత్ర రచనలో మరొక ముఖ్యమైన మార్పు. సామ్రాజ్యవాదము, జాతీయవాదము, మతతత్వము వంటి గొప్ప కథనాల నుండి తమ ప్రాధాన్యతలను మార్చుకున్నట్లు చెప్పుకున్న చరిత్రకారుల్లో ముషిరుల్ హసన్ ఒకరు. 1947 కాలపు రచనలు స్వాతంత్ర్యం కోసం భారతీయుల పోరాటాన్ని ఎత్తిచూపుతున్నాయి. అదే సమయంలో దేశ విభజనను అప్రధానమైన అంశంగా పరిగణిస్తున్నట్లు గ్యానేంద్ర పాండే తన రచన 'రిమెంబరింగ్ పార్టిషన్ : వయోలెన్స్, నేషనలిజం అండ్ హిస్టరీ ఆఫ్ ఇండియా'లో పేర్కొన్నారు. దేశము, వర్గంపై పూర్తిగా నిమగ్నమైతే సంఘాన్ని విస్మరించే అవకాశం వుంది. ఆటంకాలు ఎదురైనపుడు ఏకత్వాన్ని కనపరచేందుకు కట్టుబడి వుండాలనుకునే చరిత్రకారులకు పై అంశం వర్తిస్తుందని పాండే అభిప్రాయ పడ్డాడు.

> **"దేశ విభజనను ఒక రాజ్యాంగపరమైన ఏర్పాటుగా మాత్రమే చూడాలి. జరిగిన హింసాకాండను విభజనకు తోడైన అంశంగానే భావించాలి. కానీ 'చరిత్రకారుల చరిత్ర ' గ్రంథంలో హింసాకాండతో వుత్పన్నమైన పరిస్థితుల మూలంగానే విభజన చేయవలసివచ్చిందని పాండే నిర్ధారించాడు."**

స్వాతంత్ర్యానికి ముందు, అనంతరం కాంగ్రెస్ నాయకుల జాతీయవాదాన్ని మతతత్వంగా పొరపాటుగా చిత్రిస్తూ, వారి వైఖరులు, చర్యలను వక్రీకరిస్తూ పాండే తన గ్రంథం 'రిమెంబరింగ్ పార్టిషన్ 'లో వ్యాఖ్యానించాడు. ఉత్తరప్రదేశ్ గర్‌ముకుటేశ్వర్ లో దాడులకుగురై ఇక్కట్లపాలైన ముస్లింలపట్ల నెహ్రూ సున్నితత్వం లేకుండా వ్యవహరించాడని ఆరోపించాడు. ముస్లింల హక్కుల పరిరక్షణకు జగమెరిగిన నెహ్రూ కృషి మూలంగానే అతని ప్రాణానికి నిరంతరం ముప్పును ఎదుర్కొన్నాడు. అందుకు గాంధీ తన ప్రాణ త్యాగంతో మూల్యం చెల్లించాడు. పాండే దృష్టిలో –"వల్లభాయ్‌పటేల్ ముస్లింలు రాజ్యానికి లోబడి ఉండాలని డిమాండు చేశాడు. కానీ అతడు హిందువులను ఆ విధంగా కోరలేదు. ఆ విధంగా పటేల్ పాక్షిక వైఖరిని అవలంబించాడు." అందుకు భిన్నంగా, సీనియర్ ప్రభుత్వోద్యోగి హెచ్‌యం పటేల్ తన జ్ఞాపకాల స్వీయ రచన ' రైట్స్ ఆఫ్ పాసేజ్, ఎ సివిల్ సర్వెంట్ రిమెంబర్స్'లో ఇలా పొందుపరిచారు : "అది 1947 సెప్టెంబర్. హిందు, సిక్కు మతస్తుల సంఘటిత ముఠాల మధ్య వైషమ్యాలు చెలరేగి యావత్ రాజ్యానికే ప్రమాదం పొంచివున్న సందర్భం. ఆ సంక్లిష్ట పరిస్థితిలో, దేశ రాజధాని ఢిల్లీలో శాంతిని నెలకొల్పేందుకు నెహ్రూ, పటేల్‌వంటి జాతీయ నాయకులు, ప్రభుత్వోద్యోగులు కలసి పనిచేశారు."

సాధారణంగా పాండే చరిత్ర కంటే జ్ఞాపకానికే విశేష ప్రాధాన్యతనిస్తాడు. 'క్రమశిక్షణాయుత చరిత్ర 'కంటే మిగిలిన జ్ఞాపకాలను చూసి నిజమైన అర్థాన్ని పట్టుకున్నట్లు భ్రమిస్తున్నారు. రాజ్యం ఎజండాలో క్రమశిక్షణాయుత చరిత్రను బీటలువారిన, అవినీతిమయమైన అంశంగా అతడు చూస్తున్నాడు. 1947పై చరిత్రకారుల ఊహాకల్పనకు క్రమశిక్షణాయుత చరిత్రకూ మధ్య పెద్ద అగాధం .....చరిత్రకు జ్ఞాపకానికి మధ్య పెద్ద అగాధం వుంది.

దేశ విభజనను ఒక రాజ్యాంగపరమైన ఏర్పాటుగా మాత్రమే చూడాలి. జరిగిన హింసాకాండను విభజనకు తోడైన అంశంగానే భావించాలి. కానీ 'చరిత్రకారుల చరిత్ర ' గ్రంథంలో హింసాకాండతో వుత్పన్నమైన పరిస్థితుల మూలంగానే విభజన చేయవలసివచ్చిందని పాండే నిర్ధారించాడు. దేశ విభజన కాలపు దారుణాలపై అధ్యయనాల్లో గమనించిన నాటి గాయాలను ఇతర సందర్భాల్లో పాతుకుపోయిన హింసాకాండతో యధాతథంగా పోల్చరాదని చరిత్రకారులు వీణాదాస్ అభిప్రాయాన్ని పాండే గమనించివుండవలసింది.

భారత స్వాతంత్రోద్యమ చరిత్రను మాత్రమే వాస్తవమైన అంశంగానూ, దేశ విభజనను అశాశ్వితమైనదిగాను ; లేదా మతతత్వము, జాతీయవాదాలను ప్రత్యేక చరిత్రగాను; స్వాతంత్రోద్యమమే విభజనకు దారితీసినట్లు పరిగణించిన నిష్పాక్షికమైన విద్యాసంబంధ రచన ఏదీలేదు. ఉదాహరణకు ' స్వాతంత్ర్యము, విభజన' శీర్షికగల నా పుస్తకంలో ఆ చారిత్రక ఘటనలను ఒక జతగానే చూశాను. భారత స్వాతంత్రోద్యమం ప్రజా ఉద్యమాల ద్వారా తన లక్ష్యమైన

> **“ జాతీయ కాంగ్రెస్ యొక్క జాతీయవాదాన్ని, నిరూపిత మైన ఆ సంస్థ సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావాన్ని అప్రదిష్ట పాలుచేసేలా వ్యాఖ్యానించిన పండితుల జాబితాలో పెర్రీ ఆండర్సన్ ఒకరు. 2013లో ‘ ఇండియన్ ఐడియాలజీ’ శీర్షికతో భారత్‌పై అతని తొలి వ్యాసం వెలువడింది. నెహ్రూ కు వ్యతిరేకంగా తీవ్ర స్థాయిలో వ్యక్తిగతమైన విమర్శలకు పూనుకున్నాడు. ”**

వలసవాదుల పాలన నుండి స్వేచ్ఛను సాధించింది. కానీ ప్రజల మధ్య సంపూర్ణ ఐక్యతను సాధించలేక పోయింది. అ బలహీనత విభజన సందర్భంలో ప్రతిబింబించింది.

జాతీయ కాంగ్రెస్ యొక్క జాతీయవాదాన్ని, నిరూపితమైన ఆ సంస్థ సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావాన్ని అప్రదిష్టపాలుచేసేలా వ్యాఖ్యానించిన పండితుల జాబితాలో పెర్రీ ఆండర్సన్ ఒకరు. 2013లో ‘ ఇండియన్ ఐడియాలజీ’ శీర్షికతో భారత్‌పై అతని తొలి వ్యాసం వెలువడింది. నెహ్రూకు వ్యతిరేకంగా తీవ్ర స్థాయిలో వ్యక్తిగతమైన విమర్శలకు పూనుకున్నాడు. అతని వాదనలను సోషల్ మీడియా అందుకుని, నెహ్రూను వ్యక్తిగతంగా దూషించేందుకు వినియోగించుకుంది. దేశ విభజనతో పాటు ప్రధాన నాయకత్వంపై అతని అభిప్రాయాలు కొన్ని ప్రశ్నార్థకమైనాయి. దేశ విభజనకు జాతీయ కాంగ్రెస్‌ను అదేపనిగా నిందించిన సామ్రాజ్యవాద అనుకూల‘ కేంబ్రిడ్జ్ స్కూల్ ’ అభిప్రాయాలనే ఆండర్సన్ ధృవీకరించాడు. కాంగ్రెస్ అవలంబించిన జాతీయవాదాన్ని హిందూ మత అవలంబన స్వభావంగలదిగా నిర్ధారించాడు. ఒక ‘హిందు’పార్టీగా కాంగ్రెస్‌ను వర్గీకరించాడు. జాతీయ కాంగ్రెకున్న నమ్మదగిన అర్హతలకు, దేశ విభజనకు పొంతనలేని విధంగా ముడిపెట్టేందుకు పూనుకునే సామ్రాజ్యవాద అనుకూలుర, ఛాందసవాద వామపక్ష చరిత్రకారుల సరసకు ఆండర్సన్ చేరాడు.

1937-1947 మధ్య కాలంలో జిన్నా మరియు ముస్లింలీగ్ చేపట్టిన వైఖరులను సమర్థించే వైఖరిని భారత జాతీయ కాంగ్రెస్ అనుసరించినట్లు కేంబ్రిడ్జి పండితుల ప్రచారాన్నే జలాల్ నెత్తికెత్తుకున్నాడు. 1937 నుండి ఇతరులకు మించి ముస్లింలకు ప్రాతినిధ్యం వహించే సంస్థగా ముస్లింలీగ్‌ను గుర్తించేందుకు కాంగ్రెస్ మొండిగా తిరస్కరించటాన్ని కూడా పై ప్రచారానికి వాడుకున్నారు. నాటి క్యాబినెట్ మిషన్ ప్రతిపాదించిన బలమైన కేంద్రం –బలహీనమైన సమాఖ్య విధానానికే కాంగ్రెస్ ప్రాధాన్యత నిచ్చిందన్నది మరో ఆరోపణ. సమస్యాత్మక ముస్లిం సమాజాన్ని దేశం నుండి వదిలించుకునేందుకే ఆ సంస్థ విభజనను కోరినట్లు వారి ఆరోపణ. అంతేగాక అధికారాన్ని అందుకునేందుకు అర్రులుచాస్తూ, ఆతృతపడిన కాంగ్రెస్ నాయకులే విభజన కాలంలో జరిగిన హత్యాకాండకు బాధ్యులైనట్లు తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఆ విధంగా విభజనకాలపు ఘోరకలికి బాధ్యత నుండి బ్రిటీష్‌వారిని తప్పించారు.

కాంగ్రెస్‌ను మతతత్వ సంస్థగాను, లీగ్‌ను లౌకికవాద సంస్థగా ముద్ర వేయటం మరొక ముఖ్యమైన నిర్ధారణకు దారితీస్తున్నది. వలసవాద వ్యతిరేక పోరాటంలో లౌకిక జాతీయోద్యమానికున్న ఉన్నతమైన స్థానాన్ని ఈ వాదన తిరస్కరిస్తున్నది. బ్రిటీష్‌వారు భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని ప్రసాదించారని, హిందూ, ముస్లింల మధ్య అనాదిగా కొనసాగుతున్న వైరమే దేశ విభజనను అనివార్యం చేసిందంటున్న సామ్రాజ్యవాదుల దుష్ప్రచారాలకు ఊతమిస్తున్నది. బలమైన జాతీయవాద భావనలను బలహీనపరిచేందుకు, మన ప్రజల మధ్య చీలికలు సృష్టించిన విద్రోహపూరితమైన బ్రిటీష్ విధానాన్ని కప్పిపుచ్చేందుకు ఇది వుద్దేశించబడింది. ముస్లింలీగ్‌కు క్షమాపణలు చెప్పేవారు సామ్రాజ్యవాదులకు విశ్వసనీయమైన తోడుదొంగలుగా పనిచేశారు. స్వాతంత్రానికి పూర్వం వలస పాలకులు, ముస్లింలీగ్ మధ్య నెలకొన్న స్నేహ సంబంధాలు, అవి కొనసాగిన తీరును వెనుదిరిగి గుర్తించవచ్చు.

భారత జాతీయవాదము, కాంగ్రెస్‌లు ఇటువంటి మేధావుల దాడికి లక్ష్యంగా మారాయి. భారత జాతీయోద్యమ చరిత్ర అంటే ప్రధానంగా ఉన్నతవర్గాల చరిత్రగా వారు చిత్రీకరిస్తున్నారు. ఆ బృందం తలరాతను నిర్ణయించేది రాజకీయ ప్రముఖులేనని వారు అభిప్రాయపడుతుంటారు. దిగువ తరగతులు, పునాది వర్గాలు, అట్టడుగు కులాలు, మైనారిటీల ప్రయోజనాలను కాపాడటంలోని వైఫల్యాలకు భారత జాతీయ కాంగ్రెస్‌ను పూర్తి బాధ్యురాలుగా చేసి విమర్శిస్తుంటారు. కాంగ్రెస్‌ను కేవలం హిందూ మతస్తుల ప్రయోజనాలకు కట్టుబడిన ప్రతినిధిగానే నమ్ముతున్నారు. గత ఎనిమిది శతాబ్దాలుగా హిందువులు, ముస్లింల మధ్య కొనసాగుతున్న వేరుభావనలే విభజనకు దారితీశాయని లోహియా మాట్లాడటం ఆసక్తికరం. లోహియా అభిప్రాయంతో అంబేద్కర్ ఏకీభవించారు. ‘పాకిస్థాన్ ఆర్ ది పార్టిషన్ ఆఫ్ ఇండియా’ గ్రంథంలో అంబేద్కర్ అభిప్రాయాలు ఇలా వున్నాయి : “ హిందువులు, ముస్లింల మధ్య అనేక ఉమ్మడి అంశాలున్నప్పటికీ రాజకీయ, మతపరమైన భిన్నాభిప్రాయాలు వారిని కలిపివుంచగల బంధం కంటే విడిపోయేందుకే బలంగా దోహదం చేశాయి. పాకిస్థాన్ ఒక ప్రత్యేక ప్రాంతంగా దేశం నుండి విడిపోయేందుకు హిందువులు ఎలా అభ్యంతరం చెబుతారు? పాకిస్థాన్ అనేది మిగిలిన భారతదేశం నుండి రాజకీయంగా విభజించదగినది, సామాజికంగా భిన్నమైనది, ఆధ్యాత్మికంగా విరుద్ధమైనది.”

బ్రిటీష్‌వారి రాకకు పూర్వం భారత్ రాజకీయంగా, సాంస్కృతికంగా ఏకీకృత అస్తిత్వంగల ప్రాంతంగా లేదు. ఈనాడు మనకు తెలిసిన భారత ఉపఖండం, ఆధునిక కాలానికి పూర్వం ఒకే రాజకీయ విభాగంగా లేదు. ‘ఇండియా’ అన్న ఆలోచన స్థానికంగా కనుగొన్నది కాదు. అది యూరప్‌వాసుల నూతన కల్పన. ఆ పేరులోనే పై అంశం స్పష్టమౌతున్నది. అలాంటి పదంగాని, లేక దానితో సమానమైన పదంగానీ స్వదేశీ భాషల్లో మనుగడలో లేదు. చెదురుమదురుగా వున్న ఉపఖండాన్ని చరిత్రలో మొదటి సారి ఒకే ‘రాజకీయ రాజ్యం’గా మార్చిన ప్రతిష్ట బ్రిటీష్‌వారిదని ఆండర్సన్ అభిప్రాయపడ్డారు. అతడు తన వాదనను ఇలా కొనసాగించాడు: బ్రిటీష్ వారు భారతదేశ విభజనను ఏనాడూ కోరలేదు. కారణం, అలా చేస్తే తాము సాధించిన అపూర్వ విజయానికి విఘాతం కల్గుతుందని భావించారు.”

మన దేశపు భిన్నత్వాన్ని కీర్తించేవారిని ఆండర్సన్ తప్పుబట్టాడు.

భిన్నత్వమనేది మన నాగరికతతకు, భూమికకుగల విలక్షణమైన స్వభావం 'ఆధ్యాత్మకవాదం'గా ఒకనాడు పిలువబడినట్లు అర్థంచేసుకోవాలని అతడు కోరాడు.

భారతదేశంలో తమ మనుగడను సమర్ధించుకునేందుకు అనుగణంగా, ఆధ్యాత్మిక వాదంలోని భిన్నత్వపు నీతిని కుదించేందుకు, సమాజంలోని వివిధ మతాల మధ్య సమన్వయ స్వభావాన్ని మంటగల్పేందుకు, భారత ఉపఖండం ఏకీకరణలో వలసవాద రాజ్యపు పాత్రను గొప్పగా చెప్పుకునేందుకు ప్రయత్నించారు. ఇర్ఫాన్ హబీబ్ ఆలీఘర్ ముస్లిం యూనివర్శిటీలో ' బిల్డింగ్ ద ఐడియా ఆఫ్ ఇండియా ' అంశంపై చేసిన తన ఉపన్యాసంలో ఇలా చెప్పారు : " ఒక రాజకీయ, సాంస్కృతిక అస్తిత్వంగా 'హింద్' భావన బ్రిటీష్‌రాకకు కొన్ని శతాబ్దాల ముందుగానే నెలకొని ఉంది. ఈ పదాన్ని ముందుగా పర్షియన్లు వినియోగించారు. ( అరబ్బులు, మక్రాన్ తీరం నుండి ఇండోనీషియాలోని ఆర్చిపిలాగో వరకు గల భూ భాగాన్ని అరబిక్ భాషలో 'హింద్' అని పిలిచారు.) 13వశతాబ్దపు ప్రఖ్యాత కవి అమీర్ ఖుస్రో 'హింద్' ప్రాంతంపై తన సుప్రసిద్ద రచన 'మస్నవి' లో విలాసవంతమైన పొగడ్తలను అపారంగా కురిపించాడు.

భారత జాతీయ కాంగ్రెస్‌ను హిందూ మతతత్వం వైపు మళ్లించాడని ప్రధానంగా గాంధీపై ఆండర్‌సన్ వ్యక్తిగత విమర్శలకు పూనుకున్నాడు. కానీ గా:ంధీ కాంగ్రెస్‌ను ఒక ఉన్నత వర్గం స్థాయి నుండి ప్రజల సంస్థగా మార్చాడు. అందుకు హిందు మత భావనలతో కాంగ్రెస్‌ను నింపేశాడని ఆరోపణ. ఆ విధంగా మొదలైన రాజకీయ ప్రక్రియ మూలాలు దేశ విభజనకు దారితీశాయి. వాస్తవంగా జరిగిందేమిటి ? 1997లో ఐజాజ్ అహమ్మద్ తీసుకున్న వైఖరిని ఆండర్‌సన్ పున:స్థాపన చేశాడు. ఐజాజ్ అహమ్మద్ అవగాహన ఇలా వుంది : " గాంధీ పరివర్తనా తరహా రాజకీయాల్లో లోతుగా భాగస్వామి అయ్యాడు. ఉన్నత వర్గాల మధ్య బేరసారాలు సాగించాడు. తాను స్వయంగా రూపొందించుకున్న సనాతనత్వానికి స్వల్పంగా మెరుగైన లౌకికతత్వ భావనను జోడించి ప్రజల ముందుంచాడు.దాని ఫలితంగా ఒక విభజనేకాదు.మరో విభజనకు దారితీసింది."

'రామరాజ్యం'వంటి 'హిందు' పదబంధాలను ముస్లింలు అసౌకర్యంగా భావించారనీ ముందుతరం మార్క్సిస్టు

❝ వలసవాద వ్యవస్థ చివరి దశాబ్దంలో స్వాతంత్రోద్యమ ప్రక్రియను పున:నిర్మించే క్రమంలో సమాఖ్య తత్వపు ఐక్యతా సాధనకు 'క్రిప్స్ మిషన్' నుండి 'క్యాబినెట్ మిషన్' వరకు పలు సందర్భాల్లో కాంగ్రెస్ పెద్ద ఆటంకం (సమాఖ్య తత్వపు ఐక్యత కు ముస్లింలీగ్ విధానం వ్యతిరేకంగా వుంది)గా తయారైనట్లు ఆండర్‌సన్ గమనించాడు. కాంగ్రెస్ వైఖరి అలా లేకుంటే దేశ విభజన నివారించబడేదనిఆండర్సన్ అభిప్రాయపడు తున్నాడు. ❞

మేధావులు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఐజాజ్, ఆండర్‌సన్ కూడా గాంధీ సిద్ధాంతాన్ని ప్రశ్నించారు.అలాంటి 'హిందు గాంధీ'ని హిందు మహాసభవంటి హిందూ మతోన్మాద సంస్థలు తమ లక్ష్యంగా ఎందుకు ఎంపిక చేసుకున్నాయో అర్ధంకాని అంశం. ఆ సంస్థలు ఆర్‌యస్‌యస్ రాజకీయ ముసుగులు. గాంధీని హత్యచేసిన నాథూరాం గాడ్సే, హిందువుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా గాంధీ వున్నట్లు ఎలా నమ్మగల్గాడు?

గాంధీ –హిందూ మతతత్వం సమస్యపై ఆండర్ సన్‌తో ఇర్ఫాన్ హబీబ్ అభిప్రాయాలు భిన్నంగా వున్నాయి. ' గాంధీ అండ్ నేషనల్ మూవెంట్ ' గ్రంథంలో హబీబ్ తన అభిప్రాయాలను ఇలా వ్యక్తీకరించాడు: " హిందూ మతం పట్ల గాంధీ అభిప్రాయాలు, ఆచరణ పలు ప్రత్యేకతలతో కూడి వున్నాయి. తానొక సనాతన హిందువునని ఆయన నిరంతరం చెప్పేవాడు. కానీ అయన దేవాలయాలలో ప్రార్థనలు చేయలేదు. ... గాంధీ దేవుడు రాముడు.

అతడు ప్రభోధించే 'రామ రాజ్యం' లేశమాత్రమైనా ఒంటెత్తువాద పోకడలకు సంబంధించినది కాదు. అతని మత విశ్వాసాలు మానవత్వ విలువలతో కూడి వున్నాయి. ఆ విశ్వాసాల అనువర్తింపు బహుశా, ప్రస్తుతం మనుగడలోవున్న అన్ని మతాల ఆచరణల కంటే పురాతనమైనది."

వలసవాద వ్యవస్థ చివరి దశాబ్ధంలో స్వాతంత్రోద్యమ ప్రక్రియను పున:నిర్మించే క్రమంలో సమాఖ్య తత్వపు ఐక్యతా సాధనకు 'క్రిప్స్ మిషన్' నుండి 'క్యాబినెట్ మిషన్' వరకు పలు సందర్భాల్లో కాంగ్రెస్ పెద్ద ఆటంకం (సమాఖ్య తత్వపు ఐక్యతకు ముస్లింలీగ్ విధానం వ్యతిరేకంగా వుంది)గా తయారైనట్లు ఆండర్‌సన్ గమనించాడు. కాంగ్రెస్ వైఖరి అలా లేకుంటే దేశ విభజన నివారించబడేదనిఆండర్సన్ అభిప్రాయపడుతున్నాడు. నెహ్రూను ఒక విలన్‌గా చిత్రించాడు. 'క్యాబినెట్ మిషన్' ప్లాన్‌ను అడ్డుకుని దేశ విభజనకు మార్గాన్ని సుగమంచేశాడని ఆరోపించాడు. ఇక్కడ కూడా ఆండర్‌సన్ ఇతర అనేక సందర్భాల్లోవలే సామ్రాజ్యవాద భావాలకు దూరంగా లేడు. నెహ్రూ వైఖరులు తీవ్ర వక్రీకరణలకు గురయ్యాయని నేను భావిస్తున్నాను. 1946 జూలై 7న నెహ్రూ చేసిన ఒక ప్రకటన : "మనం ఒకే ఒక అంశానికి కట్టుబడి వుండలేము. రాజ్యాంగ పరిషత్ (కానిష్టిట్యుయంట్ అసెంబ్లీ)లో మనం పాల్గొంటున్నాము...." ఈ నిర్ణయంలో కొంత ఎత్తుగడల లోపం కన్పిస్తున్నది. కానీ 1946 మే 25న హరిజన్ పత్రికకు గాంధీ రాసిన సంపాదకీయానికి ప్రతిధ్వనిగానే నెహ్రూ ప్రకటన వుంది. ఆ సంపాదకీయ భాగం " రాజ్యాంగ పరిషత్ తన ప్రక్రియను తానే రూపొందించుకుంటుంది. క్యాబినెట్ మిషన్ ప్లాన్‌కు అది కట్టుబడి వుండనవసరం లేదు.'' రాజ్యాంగాన్ని రూపొందించవలసిన సంస్థ(రాజ్యాంగ పరిషత్ )వాస్తవంగా ఒక సార్వభౌమత్వ సంస్థ అనేది సరైన వర్తింపే.

రెండవది. ముస్లింలీగ్ కూడా ఇలాంటి నిర్ణయమే తీసుకుంది. ఆ సంస్థ కూడా రాజ్యాంగ పరిషత్ సమావేశంలో పాల్గొంటుంది. కానీ అది పరస్పర విరుద్ధమైన వైఖరిని చేపట్టింది. ఆరు ముస్లిం ప్రావిన్స్‌లను ఒక సమూహంగా కలిపి పాకిస్థాన్‌ను ఏర్పరచాలన్న షరతుతో లీగ్ ఈ సమావేశానికి హాజరౌతున్నది. పాకిస్థాన్ ఏర్పాటుకు అవసరమైన ప్రాతిపదిక, పునాది క్యాబినెట్ మిషన్ ప్లాన్‌లో అంతర్గతంగా పొందుపరచబడ్డాయి. ప్లాన్ విఫలమయేందుకు నెహ్రూను బాధ్యుడిగా చేశారు. తమకు తోచిన పద్ధతుల్లో ప్లాన్‌ను వర్తింపజేసుకునేందుకు బ్రిటీష్ పాలకులు ఇరు సంస్థలకు హామీ ఇచ్చారు. ఆరు ముస్లిం ప్రావిన్స్‌లను ఒక సమూహంగా కలిపేందుకు లీగ్‌కు గట్టి హామీ లభించింది. అంటే తర్వాత తేదీన పాకిస్థాన్ ఏర్పాటు జరుగనున్నట్లు వారికి సూచనప్రాయంగా

**❝అయోధ్య మశీదులో హిందూ విగ్రహాల సంస్థాపనకు చట్టబద్ధత కల్పనపై ఆరోపణ గురించి : 1949 డిసెంబరులో కొందరు హిందువులు అయోధ్య మశీదులో సీతా,రాముల విగ్రహాలను ప్రతిష్టించినపుడు, ఆ ఘటనపట్ల అక్కడి జిల్లా మేజిస్ట్రేటు పొరపాటుగా వ్యవహరించాడు. పటేల్, నెహ్రూ ఇరువురూ మేజిస్ట్రేట్ చర్యను ఖండించారు. నవభారత రాజ్యపు లౌకిక నిర్మాణానికి హిందూ మతోన్మాదం తీవ్రమైన సవాలుగా మారుతుందని నెహ్రూ నమ్మాడు.❞**

తెల్పబడింది. ఏకకాలంలో, పై తెల్పిన గ్రూపింగ్ తప్పనిసరి అంశంకాదని, భారతదేశ ఐక్యతను అవకాశాలను దృష్టిలో వుంచుకోబడుతుందని కాంగ్రెస్‌కు హామీ ఇవ్వబడింది. ఈ విధమైన బ్రిటీష్‌వారి ద్వంద్వ నీతిపై రాత పూర్వకంగా ఆండర్‌సన్‌వంటి వారి రచనల్లో అరుదుగా స్థానం లభిస్తున్నది. కానీ దేశ విభజన సమస్యకు కాంగ్రెస్‌ను నిందించే వైపు రచనలు మొగ్గుచూపుతున్నాయి.

కొందరు గాంధేయవాదులు, మరి కొందరు మార్క్సిస్టుల వాదనలనే ఆండర్సన్ వల్లెవేస్తుంటాడు. కానీ, ప్రజల్లో పరిచయమైన కల్పిత కథనాలను తరచూ ముందుకుతెస్తుంటాడు. ఉదాహరణకు : 1946–47 చర్చల కాలంలో కాంగ్రెస్‌నేతలు గాంధీని ఒంటరిచేశారు. ఆయన మాటలు అరణ్యరోదనగా మారాయన్నది ఆండర్సన్ పరిశీలన. గాంధీకి కాంగ్రెస్‌కు ఆయన అనుచరులకు మధ్య కొన్నిసార్లు నెలకొన్న తేడాలు కేవలం ఆ కాలపు రాజకీయాలకు సంబంధించిన అంశాలపై మాత్రమేనని నేను గతంలో ఒకసారి ప్రస్తావించాను.ఆయనను పనికట్టుకుని ఎవరూ ఒంటరిని చేయలేదు. వారి మధ్య విభజనలు అపరిమితమైనవి కాదు. ముఖ్యమైన రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు గాంధీ ఎక్కడ ఉంటే అక్కడికి సుదూర ప్రాంతాలకు కూడా వెళ్లిరావటం కాంగ్రెస్ నాయకులకు ఒక అలవాటుగా మారిందని మహాజన్ తన గ్రంథం 'ఇండిపెండెన్స్ అండ్ పార్టీషన్ 'లో ప్రస్తావించాడు.

గాంధీ కాంగ్రెస్‌ను, జాతీయోద్యమాన్ని హిందూ మతతత్వంలో ముంచాడని ఆరోపించిన ఆండర్సన్‌కు అదే గాంధీ అకస్మాత్తుగా మహాపురుషుడయ్యాడు. ఆండర్‌సన్ అభిప్రాయం ఇలావుంది :" కాంగ్రెస్‌ను ప్రజాశక్తిగా మార్చిన గాంధీ, స్వాతంత్ర్య కాలంలో అదే కాంగ్రెస్‌ను రద్దుచేయాలని పిలుపునిచ్చాడు. ఆయన చెప్పింది సరైనదే."

1948 జనవరి 27న ఆయన హత్యకు మూడు రోజులు ముందు గాంధీ ఒక నోట్ లో ఇలా రాసుకున్నాడు :" ప్రస్తుత రూపంలో భారత జాతీయ కాంగ్రెస్ తన కారణ జన్మ కాలాన్ని పూర్తిచేసుకుంది. ఇక దాన్ని రద్దుచేయాలి. అది నూతనంగా 'లోక్ సేవక్ సంఘ్' రూపంలో అవతరించాలి. ఈ అంశం హరిజన్ పత్రికలో ' హిజ్ లాస్ట్ విల్ అండ్ టెస్టామెంట్' శీర్షికతో ఒక వ్యాసంగా ప్రచురించబడింది. ఈ పదబంధాన్ని గాంధీ అనుచరులు కలిపారు. అయన ఆ నోట్‌ని ఒక ముసాయిదా సంవిధాన పత్రంగా రాసారు. అంతేగాని అది ఆయన అంతిమ వీలునామా కాదు. నిబంధన కాదు. ఆయన మరణానంతరం ఈ శీర్షికతో ప్రచురించబడిన గాంధీ నోట్ ఆయన వుద్దేశించినదానికన్నా గొప్ప ప్రాధాన్యతను సంతరించుకుంది. గాంధీ వ్యాఖ్యల కొనసాగింపుగానే కాంగ్రెస్‌ను పునర్నిర్మించాలన్న అంతర్గత చర్చలు ఆ పార్టీలో సాగుతున్నాయి. 2014 ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సమావేశంలో ప్రవేశపెట్టిన ఒక అప్రచురిత పత్రంలో పై అంశం ప్రస్తావించబడింది. గాంధీ 'అంతిమ వీలునామా మరియు నిబంధన'తో పాటు అదే రోజు హరిజన్ పత్రికలో ప్రచురించబడిన మరొక ప్రకటనను కూడా తప్పక చదవాలి. ఆ ప్రకటన : "భారత జాతీయ కాంగ్రెస్ అతి పురాతన రాజకీయ సంస్థ. దేశ స్వాతంత్ర్యం కోసం అహింసాయుత మార్గంలో అనేక పోరాటాలను నిర్వహించిన అనంతరం దాన్ని చావనివ్వరాదు. దేశంతోపాటు మాత్రమే అది మరణించాలి."

ఆండర్‌సన్ ఇలా అభిప్రాయపడ్డాడు : "స్వాతంత్ర్య సాధన సందర్భాన్ని హిందూ ధర్మాలకు అనుగుణంగా వర్తించవచ్చు. ఆగంభీరమైన ఆ సందర్భంలో రెచ్చగొట్టేందుకు నెహ్రూ, అతని అనుయాయులు ఢిల్లీలో పవిత్రమైన అగ్ని హోత్రం ముందు కాళ్లుముడుచుకుని కూర్చున్నారు. ఆ క్రతువులో పాల్గొనేందుకు తంజావూరు నుండి హిందూ పూజారులు విచ్చేసి మంత్రాలు వల్లించారు. అక్కడివారిపై పవిత్రజలాలను చిలకరించారు. మహిళలు, నాయకుల నుదుట సింధూర తిలకం దిద్దారు. 'స్వాతంత్ర్య సాధన సందర్భాన్ని' రాజేంద్ర ప్రసాద్ నివాస గృహంలో హిందూ ప్రవృత్తితో ఒక ప్రైవేట్ క్రతువుగా నిర్వహించారు. ఇలాంటి ప్రభుత్వ ఉత్సవాలను రాజ్యాంగ పరిషత్, ఎర్రకోట, న్యూ ఢిల్లీ పచ్చిక బయళ్ల వంటి మతేతర స్థలాల్లో ఎందుకు జరుపలేదు ? అలా జరిపివుంటే భారతీయులు పలు సమూహాలుగా పాల్గొని సంతోషంతో ఉప్పొంగిపోయేవారు." నాటి ప్రధాని నెహ్రూ 1951 మే 2న రాష్ట్ర ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో ఇలా స్పష్టం చేశారు : " ఈ ఉత్సవం ప్రభుత్వం నిర్వహించినది కాదు. కేంద్ర ప్రభుత్వానికి దీనితో ఎలాంటి సంబంధం లేదని అర్థంచేసుకోవాలి .... మనది లౌకిక రాజ్యం. ఆ లక్ష్యానికి ఆటంకం కల్గించే ఏ కార్యక్రమాన్ని చేపట్టరాదని మనం గుర్తుంచుకోవాలి. ఇది మన రాజ్యాంగపు ఆదేశిక సూత్రము."

ఆండర్‌సర్ మరో ఆరోపణ : " కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం దురాక్రమణదారులచే కూలగొట్టిబడి, ఆడంబరంగా ప్రచారమైన ప్రఖ్యాత సోమనాధ్ దేవాలయాన్ని కొద్ది సంవత్సరాల కాలంలోనే పునర్నిర్మించింది. అయోధ్యలోని ప్రఖ్యాత మశీదులో హిందూ విగ్రహాల సంస్థాపనను చట్టబద్ధంచేసింది."

అయోధ్య మశీదులో హిందూ విగ్రహాల సంస్థాపనకు చట్టబద్ధత కల్పనపై ఆరోపణ గురించి : 1949 డిసెంబరులో కొందరు హిందువులు అయోధ్య మశీదులో సీతా,రాముల విగ్రహాలను ప్రతిష్టించినపుడు, ఆ ఘటనపట్ల అక్కడి జిల్లా మేజిస్ట్రేటు పొరపాటుగా వ్యవహరించాడు. పటేల్, నెహ్రూ ఇరువురూ మేజిస్ట్రేట్ చర్యను ఖండించారు. నవభారత రాజ్యపు లౌకిక నిర్మాణానికి హిందూ మతోన్మాదం తీవ్రమైన సవాలుగా మారుతుందని నెహ్రూ నమ్మాడు. అందుకే గాంధీ హత్యానంతరం ఆర్‌యస్‌యస్, హిందు మహాసభలపై తీవ్రమైనవిమర్శలతో విరుచుకుపడ్డాడు.

కరకు మనిషిగా కాంగ్రెస్ వ్యతిరేకులచే గుర్తించబడిన సర్దార్ పటేల్‌ని కూడా ఆండర్‌సన్ వదల్లేదు. స్వాతంత్రోద్యమ అగ్రనేతల్లో ఒకరైన పటేల్‌ను కబ్జాచేసి, నెత్తికెత్తుకుంటున్న బిజెపిని అతడు ప్రశ్నించటం మానేశాడు. కానీ పటేల్‌కు సంబంధించి కల్పితమైన హిందూ అనుకూలతకు మాత్రమే

ప్రాధాన్యతనిస్తున్నాడు. ప్రపంచంలోనే అతి ఎత్తైన పటేల్ విగ్రహాన్ని గుజరాత్‌లో నెలకొల్పారు. దాన్ని ప్రారంభించింది బిజెపి ప్రభుత్వం. కానీ అది గౌరవిస్తున్నది. 'ఆర్‌యస్‌యస్‌వారిని తన పార్టీలో చేరమన్న' శక్తి సంపన్నుడైన కాంగ్రెస్ నేత పటేల్‌ను. తద్వారా పటేల్ స్థానాన్ని పూర్తిగా వక్రీకరిస్తున్నారు. హోం మంత్రిగా ఆయన మనస్ఫూర్తిగా నెహ్రూతోనే కలసి నడిచారు. గాంధీ హత్యానంతరం ఆర్‌యస్‌యస్, హిందూ మహాసభలపై నిషేధం విధించాడు. దారి తప్పించబడిన ఆర్‌యస్‌యస్‌లోని యువతను కాంగ్రెస్‌లోకి రాబట్టి, వారిలో నూతన వరవడిని చొప్పించి, జాతీయ విలువలవైపు మళ్లించాలని పటేల్ కోరుకున్నాడు. అందుకే ఆర్‌యస్‌యస్‌ను కాంగ్రెస్‌లో చేరమని సూచించాడు. ( ఆధారం –1947 డిసెంబరు 21, పంజాబ్ యూనివర్శిటీ– అంబాలాలో పటేల్ ఉపన్యాస పత్రం. )

> "లౌకిక జాతీయవాదానికి, మతోన్మాదానికి మధ్యగల తేడాను నిర్మూలించటంలో సామ్రాజ్యవాద ప్రేరణలోని కేంబ్రిడ్జి మేధావులు, విశిష్టులమనుకునే మేధావులు, కొందరు మార్క్సిస్టుల మధ్య ఏకీభావం కొనసాగుతున్నది. కాంగ్రెస్, బిజెపి,దాని పూర్వీకులకు మధ్య ఎలాంటి తేడా లేదన్న కల్పిత కథనంతోనే, జాతీయవాదాన్ని, మతతత్వాన్ని రెండింటినీ ఒకే గాటన కట్టేందుకు దారితీస్తున్నది."

లౌకిక జాతీయవాదానికి, మతోన్మాదానికి మధ్యగల తేడాను నిర్మూలించటంలో సామ్రాజ్యవాద ప్రేరణలోని కేంబ్రిడ్జి మేధావులు, విశిష్టులమనుకునే మేధావులు, కొందరు మార్క్సిస్టుల మధ్య ఏకీభావం కొనసాగుతున్నది. కాంగ్రెస్, బిజెపి,దాని పూర్వీకులకు మధ్య ఎలాంటి తేడా లేదన్న కల్పిత కథనంతోనే, జాతీయవాదాన్ని, మతతత్వాన్ని రెండింటినీ ఒకే గాటన కట్టేందుకు దారితీస్తున్నది. ఆండర్‌సన్ ఉద్దేశం : " బిజెపి, కాంగ్రెస్‌లు రెండూ సాంస్కృతికంగా ఒక ఉమ్మడి వాతావరణంలోనే జలకాలాడుతున్నాయి. ఆ వాతావరణంలో, మతపరమైన లాంఛనాలు, చిహ్నాలు, విగ్రహాలు, గీతాలు వాణిజ్య సముదాయాల్లోనూ, ప్రభుత్వ జాగాల్లోనూ ఒకే మాదిరిగానే వున్నాయి.... ఆచరణలో వాటి మధ్య తేడాలు తక్కువ. తమకు, రెండంటిలో ఏ మతతత్వం ఎక్కడ అనువుగా వుంటుందో దాన్ని ఎంపికచేసుకోవటంలో ఆ పార్టీల మధ్య తేడా స్వల్పమే."

హిందూ, ముస్లిం జాతీయవాదాల గురించి జాఫ్రిలాట్, గిల్‌మార్టిన్, హసన్, అహమ్మద్‌వంటి కొందరు మేధావులు మాట్లాడుతున్నారు. అవి రెండూ అత్యంత సమస్యాత్మకమైన విభాగాలు. అందుకు రెండు కారణాలు : ఒకటి, దేశం కంటే ఒక ప్రాంతంలోని జన సమూహాల(సంఘాలు)కు విశేష ప్రాధాన్యతనిస్తాయి. రెండు, _మతతత్వానికి చట్టబద్ధతను కల్పిస్తూనే దాన్ని జాతీయవాదానికి జతచేస్తారు. లౌకిక జాతీయవాదాన్ని, మతతత్వాన్ని కూలగొట్టేందుకు హిందూ, ముస్లింవంటి జాతీయవాద విభాగాలను భిన్నమైన దృక్కోణంలో వినియోగించు కుంటారు.

కానీ అలాంటి వాదనల వెనుకగల సైద్ధాంతిక అంశాలు సహితం చాలా సమస్యాత్మకంగా వుంటాయి. మతతత్వము, జాతీయవాదము రెండూ కూలిపోతే బహుళత్వము, మరియు సమ్మిళిత సంస్కృతి, సమాజమన్న భావన రద్దవుతుంది. హింస ద్వారా ఏర్పడిన సమూహాలు (కమ్యూనిటీ) మాత్రమే ఏకైక సత్యంగా నివేదించబడుతుంది. అపుడు శూన్యవాదం ఒక్కటే మిగులుతుంది. అలాంటి హింసాకాండ జరిగే క్రమపరిణామాల నుండి పడక కుర్చీ మేధావులు దూరమౌతారు. అలాంటివారికి మినహా మరెవరికైనా, మేధోపరమైనన రక్షణ కరువైన పరిస్థితి ఎదురౌతుంది. బహుశా లౌకిక వాదాన్ని అపహాస్య చేయటం సులభమే కావచ్చు. లౌకికవాదపు మేధో వనరులు లేకుండా మతపరమైన భయానక హింసాకాండతోను, అభివృద్ధి ముసుగులో నిస్సిగ్గుగా జరిపే మతతత్వపు విన్యాసాలతోను మనం తలపడలేము. సైద్ధాంతిక భూమికపై మాత్రమే చారిత్రక చర్చలను ధృఢంగా నిలబెట్టగలము.

స్వాతంత్రోద్యమ పోరాట పత్రాలను 'టువర్డ్స్ ఫ్రీడం' సీరీస్ ప్రచురణతోనే భిన్న రకాల చరిత్ర రచనలకు అవకాశం ఆరంభమైనది. బ్రిటీష్ అధికారుల కథనాలతో రూపొందించిన 'ట్రాన్స్ఫర్ ఆఫ్ పవర్' సంపుటాలకు ప్రతి సమాచారాలు (కౌంటర్‌పాయింట్)గా 'టువర్డ్స్ ఫ్రీడం' సీరీస్ సంపుటాలు మొదట ఉద్దేశించబడినాయి. ఈ 'టువర్డ్స్ ఫ్రీడం' సీరీస్ సంపుటాలు సర్వేపల్లి గోపాల్, సవ్యసాచి భట్టాచార్య వంటి సుప్రసిద్ధ చరిత్రకారుల నేతృత్వంలో చారిత్రక వనరుల నుండి సేకరించిన సమాచారంతో రూపొందాయి. 1947 సంపుటం సంపాదకునిగా గత దశాబ్దకాలంగా నేను పనిచేస్తున్నాను. దుమ్ము ధూళితో నిండిన గిడ్డంగులు, ప్రైవేటు ప్రాచీన పత్రాలు, వార్తా పత్రికల నుండి విలువైన అనేక పత్రాలను సేకరించాము. వాటిని ఒక క్రమ పద్ధతిలో అమర్చి రెండు పెద్ద సంపుటాలను ప్రచురించాము. మూడవ సంపుటం ప్రచురణకు సిద్ధమౌతున్నది. ఈ సంపుటాల్లో –రాజకీయ ప్రక్రియలు, రాష్ట్రాల ప్రజల ఆకాంక్షలు, కార్మికులు, కర్షకుల పోరాటాలు, సరిహద్దులు నిర్వాసితులు, విభజన ఆర్థిక పర్యవసానాలు, 1947 ఆగస్టు 15 ఉత్సవాల నాటికి విదేశీ సంబంధాలు వంటి పలు శ్రేణుల్లోని విలువైన విషయాల సమాహారంగా రూపొందాయి.


స్వతంత్ర భారతం 75 సంవత్సరాల శిఖరాగ్రానికి చేరుతున్నది. దేశ స్వాతంత్ర్యము, విభజనలు ఒక దానిలో మరొకటి అల్లుకుపోయాయి. చరిత్రలోని ఆ గజిబిజిని అధిగమించాలి. ఆ సరైన దృక్పథంతో 1947ను పరికించేందుకు ఇది సరైన సమయము. ఈ పరివర్తనా స్థితిలో జరిగే అంతర్గత మధనం, పాత నుండి కొత్తదనం ఆవిర్భావానికి, పాత కొత్తల మేలుకలయికకు వుపకరిస్తుంది. పాత సంస్థల పునర్నిర్మాణము, నూతన నిర్మాణాలను నాగరికంగా తీర్చిదిద్దటం ద్వారా మాత్రమే నూతన రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థల రూపకల్పన సాధ్యమౌతుంది. వలసవాదం నుండి స్వాతంత్ర్యానికి పూర్వం వరకుగల పరివర్తనా క్రమాన్ని పౌరసత్వం సమస్యలు, ప్రజాస్వామ్యపు ఆకాంక్షలు, కలయికలు, విలువలు, అస్తిత్వము, లింగము, కులము, భాష వంటి సమస్యలు ప్రభావితం చేసినట్లు అర్థమౌతున్నది. ఈ కాలపు కొన్ని రచనలు, పరిశోధనల ద్వారానే పై సమాచారం తెలుస్తున్నది. 1947 ఆగష్టు 15కు సంబంధించి సామ్రాజ్యవాదులు, మతోన్మాదులు రూపొందించిన చారిత్రక అవగాహన నుండి బైటపడాలి. ఆ చారిత్రక సంఘటనకు దారితీసిన విప్లవకర పరివర్తనలను గుర్తించగల్గాలి.

**(అనువాదం: వై సిద్ధయ్య)**

ఆర్థిక రంగం

# వర్ధమానదేశాలను దెబ్బతీస్తున్న అమెరికా విధానాలు

**సిపి చంద్రశేఖర్**



రచయిత ప్రముఖ ఆర్థిక వేత్త. ఆర్థిక వ్యవహారాలపై పుస్తకాలు, పత్రికల్లో వందలాది వ్యాసాలు, రాశారు.

సెప్టెంబర్ మాసంలో జరిగిన అమెరికా ఫెడరల్ రిజర్వు మార్కెట్ కమిటీ సమావేశంలో వడ్డీరేట్లు 0.75 శాతం పెంచాలని నిర్ణయించారు. అప్పటి వరకూ గరిష్టంగా 3 నుండి 3.25 శాతం వడ్డీ రేట్లు ఉండాలన్న నిర్ణయాన్ని 4.4 శాతం వరకు పెంచవచ్చుని, వచ్చే ఏడాది చివరకు 4.6 శాతం వరకు చేర్చవచ్చుని నిర్ణయించారు.

గత కొంతకాలంగా జరుగుతున్న క్రమాన్ని గమనిస్తే ఇది గణనీయమైన పెరుగుదల అనే చెప్పుకోవాలి. ఫెడరల్ నిధుల లక్ష్యాన్ని కుదించి, ఫిబ్రవరి 2020 నాటికి ఉన్న 1.75 శాతం నుండి, ఒక నెల తరువాత కోవిడ్ -19 మహమ్మారి దృష్ట్యా, 0.25 శాతానికి తగ్గిస్తున్నట్టు ఫెడరల్ రిజర్వు ప్రకటించింది. 2022 మార్చి వరకు సున్నా వడ్డీరేటు విధానం అమలవుతుండేది. ఆ తరువాత నుండే వడ్డీరేట్లు పెరగడం మొదలైంది. మొదట్లో ఫెడరల్ నిధుల వడ్డీరేటు సున్నాగా ఉండేది. ఆ తరువాత వడ్డీరేట్లను క్రమంగా పెంచుకుంటూపోయారు. జులైలో 2.25 శాతం నుండి 2.50 శాతంకి, ఆ తరువాత సెప్టెంబర్లో 3.0 శాతం నుండి 3.25 శాతంకి పెంచారు.

2022 ఆగస్టు చివరికి ధరలు 8.3 శాతం పెరుగుతాయని అమెరికా కార్మికశాఖ అంచనా వేసింది. ధరలను అదుపు చేయాలని గట్టి నిర్ణయం తీసుకుంది. ఆర్థిక వ్యవస్థలోకి ధనాన్ని గుప్పించటంతో పాటు బాండ్ల కొనుగోలును కూడా నిలిపివేయాలని నిర్ణయించుకుంది. 2008 తరువాత ఆర్థిక మాంద్యం కాలంలో అమలు చేసిన సులభ, చౌక ద్రవ్య విధానానికి స్వస్తి పలకాలని నిర్ణయించుకుని, తన జమా ఖర్చుల పట్టికలో బాండ్ల నిల్వలను తగ్గించుకుంది.

బ్లూమ్ బర్గ్ ఎకనామిక్స్ అంచనాల ప్రకారం 2022 మే-డిసెంబర్ మధ్య కాలంలో జి 7 దేశాల కేంద్ర బ్యాంకులు తమ జమా ఖర్చులలో 41,000 కోట్ల డాలర్లను తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయి. 2021 లో రెండు లక్షల కోట్ల డాలర్లను, కోవిడ్ మహమ్మారి ఆవరించిన నాటి నుండి ఎనిమిది లక్షల కోట్ల డాలర్లను ఆర్థిక వ్యవస్థలోకి జొప్పించిన విధానానికి ఇది పూర్తిగా విరుద్ధమైనది.

**ఆర్థిక మార్కెట్లలో అల్లకల్లోలం**

ఫెడరల్ రిజర్వు తీసుకున్న ఈ చర్య ద్రవ్య మార్కెట్లో కల్లోలాన్ని సృష్టించింది. ఫెడరల్ రిజర్వు ధరల పెరుగుదలను అదుపు చేయడానికి తీసుకున్న ఈ చర్యల వల్ల ధరలు అదుపు అవడంతో పాటుగా నిజమైన ఆర్థిక మాంద్యం కూడా ఆవరిస్తుంది. 2023కి అమెరికాలో నిరుద్యోగం ఇప్పుడున్న 3.7 శాతం నుండి 4.4 శాతానికి పెరుగుతుందని ఫెడరల్ రిజర్వు అంచనా. స్థూల జాతీయోత్పత్తి ఏడాది చివరి నాటికి 0.2 శాతం పడిపోతుందని, తిరిగి 2023లో 1.23 పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ప్రపంచానికి ఇదేమంత మంచి వార్త కాదు. అయితే నిజంగానే ఇలా జరిగడం మరీ అంత చెడ్డ వార్త కూడా కాదు. అమెరికా కేంద్ర బ్యాంకు తీసుకున్న ఈ నిర్ణయం అభివృద్ధి చెందని దేశాలపై ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తుందా అన్నదే అసలైన ప్రశ్న. ముఖ్యంగా ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయిన దేశాల పరిస్థితి ఏమిటా అన్నది ఆందోళన కలిగించే అంశం.

అమెరికా వడ్డీ రేట్లను పెంచడం వల్ల అభివృద్ధి చెందుతున్నదేశాలు, అభివృధి చెందని దేశాలు కూడా తమ దేశాలలో అధిక ధరలను అదుపుచేయడానికి ఆయా కేంద్ర బ్యాంకులు పెంచాలనుకుంటున్న వడ్డీ రేట్ల కంటే ఎక్కువగా పెంచక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. అమెరికాలో వడ్డీరేట్లు ఇతర దేశాలలో కన్నా ఎక్కువగా ఉంటే, డాలర్ల ప్రవాహం అమెరికా వైపుకు ఉంటుంది. ఇతర దేశాల నుండి డాలర్లు బయటికి వెళ్లడంతో ఆయాదేశాల కరెన్సీ పై ఒత్తిడి పెరిగి, వాటి ధరలు విపరీతంగా పడిపోతాయి. కొంతవరకైనా మాంద్యాన్ని అరికట్టే చర్యలలో భాగంగా ఆయా ప్రపంచదేశాల కేంద్ర బ్యాంకులు, వారి వడ్డీరేట్లను పెంచుకోవలసి వస్తుంది. ఆ మేరకు వారి దేశాలలో రుణాలపై ఆధారపడిన పెట్టుబడులు తగ్గుతాయి. ఆయా రంగాలలో వినిమయ సరుకుల డిమాండ్ కూడా తగ్గుతుంది. ఆ రంగాలకు మాంద్యం విస్తరిస్తుంది. అసలే ప్రపంచవ్యాప్తంగా ఆవరించిన మాంద్యం ఆ రంగాలకు కూడా విస్తరించే క్రమం ఎలాగూ ఉండనే ఉంటుంది.

ఈ ధోరణికి అభివృద్ధి చెందని దేశాలు బలవుతాయి. ఈ దేశాలు అప్పులు తీర్చలేకపోయిన మొత్తం, 25 వేలకోట్ల డాలర్ల పైగానే ఉంటుందని అంచనా. ఇప్పటి ఆర్థిక మాంద్యం శ్రీలంకపై ముందుగా ప్రభావం చూపగా ఎల్ సాల్వడార్, ఘానా, ఈజిప్ట్, ట్యునీషియా, పాకిస్తాన్లు ఆ దిశలో పయనిస్తున్నాయి. వడ్డీరేట్లు పెరగడంతో ఈ దేశాలు మరింత సంక్షోభంలో చిక్కుకునే అవకాశాలు ఉంటాయి. అయితే అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ ఈ వలయంలో చిక్కుకుపోతాయని అనలేము. అభివృద్ధి చెందుతున్న దేశాలలో కాస్తంత అభి వృద్ధి చెందిన దేశాలు ఈ విపత్తును దాటేయవచ్చు.

2022 మధ్య కాలానికి ప్రపంచ దేశాల అప్పు 305 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ అంచనా వేసింది. అంటే స్థూల జాతీయోత్పత్తికన్నా 350 శాతం ఎక్కువ. అయితే ఈ అప్పులో చాలా భాగం అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలకు సంబంధించినదే. అవి ఆ అప్పును సులభంగానే తీర్చగలవు. అభివృద్ధి చెందిన అర్థిక వ్యవస్థల సమూహం అప్పులు మూడింట రెండొంతులు ఉంటాయి. ఈ దేశాలలోని కొంతమంది రుణగ్రహీతలు అప్పు తీర్చలేని పరిస్థితిలో ఉండవచ్చు, కానీ అది అందరికీ వర్తించే పరిస్థితి లేదు.

దాదాపు 100 లక్షల కోట్ల డాలర్ల రుణాలు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలున్న దేశాలకు, చిన్నపాటి దేశాలకు సంబంధించినవి. చివరికి అభివృద్ధి చెందుతున్న దేశాల అప్పులలో కూడా పెద్ద మొత్తం స్థానిక కరెన్సీలో ఉంది. భారతదేశం, చైనాల స్థూల జాతీయ

ఉత్పత్తిలో 10–15 శాతం రుణం మాత్రమే విదేశీ కరెన్సీలో ఉందని అంచనా. కానీ స్థానిక కరెన్సీలో చైనా అప్పు 336 శాతం, భారతదేశం 164 శాతంగా ఉంది. అందువల్ల అప్పు ఎక్కువగా ఉన్నప్పటికీ శ్రీలంక, ఘనా, జాంబియా, ట్యునీషియా, ఎల్ సాల్వడార్, అర్జెంటినాలలో ఏర్పడినంత పెద్ద సంక్షోభం ఈ దేశాలలో ఏర్పడదు.

### నిర్లక్ష్యం తగదు

అలా అని తృప్తిగా ఉండలేము. కారణాలు అనేకం. మొదటిది, ఈ మధ్య పెరిగిన వడ్డీ రేట్లు, ఫలితంగా ఇప్పటికే విదేశీ నిల్వలపై ఉన్న ఒత్తిడి మరింత పెరగడం. పైగా కోవిడ్–19 వలన ఏర్పడిన విదేశీ నిల్వల లోటు. వీటికి అదనంగా ఉక్రెయిన్‌పై రష్యా దాడి వలన ఆహారం, ఇంధనం ధరలు విపరీతంగా పెరిగాయి. వీటి వలన దిగుమతుల చెల్లింపులు అనూహ్యంగా పెరిగాయి. వీటికి తోడు ప్రైవేటు ద్రవ్య పెట్టుబడిదారులు అభివృద్ధి చెందుతున్న దేశాల నుండి తమ పెట్టుబడులను, వడ్డీ రేట్లను పెంచిన అభివృద్ధి చెందిన దేశాలకు తరలిస్తుండడం. విదేశీ నిల్వలు మందగించ డంతో డాలరు అప్పులతో ముడి పడి ఉన్న ఏ దేశం కూడా మాంద్యం నుండి సురక్షితమని భావించలేము.

రెండవది, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇంకా వెనకబడి ఉన్న దేశాల అప్పులు చాలా అధిక స్థాయిలో ఉన్నాయి. ఉదాహరణకి టర్కీ విదేశీమారక అప్పు, స్థూల జాతీయోత్పత్తిలో 97 శాతం; చీలి 62 శాతం, ఆర్జెంటినా 48 శాతం, దక్షిణ ఆఫ్రికా 31 శాతం, బ్రెజిల్ 28 శాతం, మెక్సికో 26 శాతంగా ఉంది. ఇందులో కొన్ని దేశాలు ఇప్పటికే అప్పులు తిరిగి చెల్లించలేని స్థితిలో ఉన్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పతనం అయితే లేదా మెరుగుపడకపోతే మిగిలిన దేశాలు కూడా అదే బాటలోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

మూడోది, అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక సంస్థలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో అప్పులు కలిగి ఉన్నాయి. జులైలో బ్లుమ్‌బెర్గ్ ఇచ్చిన నివేదికలో అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు గల దేశాలు డాలర్లు, యూరో, యెన్‌లలో 1.4 లక్షల కోట్ల విదేశీ అప్పులు కలిగి ఉన్నాయి. ఇందులో 20 శాతం, అంటే 23,000 కోట్ల డాలర్లు బాండ్ల రూపంలో ఉంది. ఇప్పుడు ఆ బాండ్ల వ్యాపారం మందకొడిగా, నష్టాలలో సాగుతున్నది. లేదా వీటి వడ్డీ రేటు అమెరికా ట్రెజరీ రేట్ల కంటే 10 శాతం ఎక్కువగా ఉన్నాయి. ఈ దేశాలు గనక తాము తీసుకున్న అప్పులు తీర్చలేని పరిస్థితికి చేరితే దాని పరిణామాలు ఆర్థిక రంగం పై తీవ్రంగా ఉంటాయి. ఇప్పటికే అలజడికి గురైన ప్రపంచ మార్కెట్‌పై, అభివృద్ధి చెందిన దేశాలలోని మార్కెట్లపై కూడా ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది.

చివరిగా అభివృద్ధి చెందుతున్న దేశాలు అప్పుల ఊబిలో కూరుకుపోవటంతో పాటు పర్యావరణ కాలుష్యపు కోరలలో కూడా చిక్కుకున్నాయి. పెద్దఎత్తున సంభవించే పర్యావరణ మార్పుల వల్ల భరించవలసిన నష్టాలను వ్యక్తిగతంగా ఎదుర్కోవలసి రావటంతో పాటు దిగజారిన వాతావరణ ప్రభావానికి అలవాటు పడవలసి వస్తుంది. వాళ్ళు గనక అప్పులు ఎక్కువగా ఉండి, ఆ పరిస్థితులను ఎదుర్కోలేక పోతే, అభివృద్ధి చెందిన దేశాలు ఆ ఖర్చులను భరించడానికి సిద్ధపడకపోతే, ఈ దేశాలలో సంక్షోభం సుదీర్ఘకాలం కొనసాగుతుంది. వాటి పర్యవసానాలు కేవలం విదేశీ అప్పు తీర్చడానికే పరిమితమవక, మరింత నష్టదాయకమైన పరిణామాలకు దారితీస్తాయి.

### కేంద్ర బ్యాంకుల పాత్ర

తమ దేశాలలో ధరలను అదుపులో ఉంచుకోడానికి వడ్డీరేట్లను పెంచుకోవడంతోనే అభివృద్ధి చెందిన దేశాల కేంద్ర బ్యాంకుల బాధ్యత తీరిపోదు. ఇతర దేశాలపై వాటి ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. తక్కువగా అభివృద్ధి చెందుతున్న దేశాల అప్పులు పోగు పడడానికి కారణం అభివృద్ధి చెందిన దేశాల కేంద్ర బ్యాంకులు సులభ ద్రవ్య విధానాన్ని అమలు చేయడమే. అభివృద్ధి చెందిన దేశాలు, విదేశీ మార్కెట్ల నుండి తక్కువ వడ్డీకి అప్పులు తెచ్చి, లాభదాయకంగా ఉండే వడ్డీరేట్లకి అభివృద్ధి చెందుతున్న దేశాలలోని ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలకు సట్టా వ్యాపార సంస్థలు బాండ్లు, ఇతర ద్రవ్య రూపాలలో అప్పులు ఇచ్చాయి. అప్పు తీసుకున్న దేశం మరింత రిస్క్ ఉన్నదేశం అయితే, మొత్తం అప్పులో ప్రభుత్వ వాటా ఎక్కువగా ఉంటుంది.

ఈ క్రమం కొనసాగుతున్న దశలో విదేశీ రుణదాతలు సరైన జాగ్రత్తలు తీసుకోలేదు. ఐఎంఎఫ్ కూడా ఈ దేశాలు ఇక రుణాలు తీసుకోకూడదనే ఆంక్షలు విధించలేదు. "మహా ఆధునికత" అని చెప్పబడే 1990, 2000 లలో సులభతర ద్రవ్య విధానాలు, తక్కువ ధరలు ఉండడం న్యాయబద్ధం గానే గుర్తించబడినందువలన, అప్పులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. కానీ ఇప్పుడు ధరలు పెరిగే విధానాల వైపుకు మరలడంతో, వడ్డీలు పెరిగి అప్పులు తీర్చడం తలకుమించిన భారంగా మారే పరిస్థితి ఏర్పడింది.

అయితే ఈ పద్ధతి కొత్తేమీ కాదు. 1960, 1970లలో ఉదారవాద ద్రవ్య విధానాలు, అమెరికా అనుసరించిన సులభ ద్యవ్య విధానం, చమురు ఎగుమతి దారులు తమ అదనపు నిధులను అంతర్జాతీయ బ్యాంకింగ్ సంస్థలలో నిల్వచేసుకో వడం వలన, ఆ నిధులు అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా ఆ దేశాల అప్పులు ఒక్కసారిగా పెరిగాయి. లాటిన్ అమెరికా దేశాలకు అమెరికా వాణిజ్య సంస్థలు ఇచ్చిన అప్పులు 1970లలో ఉన్న 30 బిలియన్ల డాలర్ల నుండి 1978లో 159 బిలియన్ల డాలర్లకు చేరాయి. 1982కి ఇది 327 బిలియన్ల డాలర్లకు చేరింది. 1980లలో అమెరికాలో ధరలు పెరగడం మొదలై, పాల్ వాల్కేర్ ఫెడరల్ రిజర్వ్‌కి అధిపతి అయిన తరువాత వడ్డీరేట్లు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. దానితో 1980లలో అప్పుల సంక్షోభం మొదలైంది.

ఇప్పుడు పేద దేశాలు అదే పరిస్థితిని ఎదుర్కోవలసి రావచ్చు.

**(అనువాదం: కె ఉషారాణి)**


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 18, issue : 6 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36



# అత్యధిక భారతీయుల ఇళ్లు జైలు గదులకన్నా చిన్నవి

భారత దేశంలో 80 శాతం మంది గ్రామీణ పేద కుటుంబాలు సగటున 449 చదరపు అడుగుల స్థలంలో నివసిస్తున్నాయి. పట్టణాల్లో 60 శాతం మంది పేద కుటుంబాలు సగటున 380 చదరపు అడుగుల విస్తీర్ణం గల స్థలంలో నివసిస్తున్నాయి. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ మెజారిటీ భారతీయ కుటుంబాలు జైలు గదుల కోసం సిఫార్సు చేసిన కనీస స్థలం కన్నా తక్కువ స్థలంలో నివసిస్తున్నాయని జాతీయ నమూనా సర్వే కార్యాలయం (ఎన్‌ఎస్‌ఎస్‌ఓ) 69వ దఫా సర్వే వెల్లడించింది.

గ్రామాల్లో ఒక్కో కుటుంబం సగటున 449 చదరపు అడుగుల ఇళ్లలో నివసిస్నున్నదంటే అర్థం గ్రామీణ వ్యక్తి 94 చందరపు అడుగుల విస్తీర్ణంలో జీవనం కొనసాగిస్తున్నాడన్నమాట. ఎందుకంటే సగటు గ్రామీణ కుటుంబంలో 4.8 మంది ఉంటున్నారు. జైలులో ఒక్కో వ్యక్తికి 96 చదరపు అడుగుల విస్తీర్ణంలో గదులు ఉండాలని 2016 మోడల్ జైలు మాన్యువల్ సిఫార్సు చేసింది. అయితే భారతీయ జైళ్లలో విపరీతమైన రద్దీ మూలంగా ఖైదీలకు సిఫార్సు చేసినంత నివాస స్థలం అందడం లేదు అది వేరే విషయం.

అదే విధంగా పట్టణాల్లో సగటున ఒక్కో కుటుంబం 380 చదరపు అడుగుల విస్తీర్ణంలో నివసిస్తోంది. భారతీయ పట్టణ కుటుంబంలో సగటున 4.1 మంది సభ్యులుంటున్నారు. అంటే ఒక్కో వ్యక్తి 93 చదరపు అడుగుల విస్తీర్ణంలో నివసిస్తున్నారు. ఇది కూడా జైలు గదులకు సిఫార్సు చేసిన విస్తీర్ణం కన్నా తక్కువ.

ఇందులో కూడా దళితులు, ఆదివాసీలు మరింత తక్కువ విస్తీర్ణంలో నివసిస్తున్నారు. పేద రాష్ట్రాల్లో ఈ నివాస స్థలం మరింత తక్కువగా ఉంది. షెడ్యూల్ కులాల వ్యక్తికి సగటున 70.3 చదరపు అడుగుల నివాస స్థలం మాత్రమే లభిస్తోంది. షెడ్యూల్ తెగల వ్యక్తికి 85.7 చదరపు అడుగులు లభిస్తోంది. అత్యంత పేదలైన 20 శాతం గ్రామీణులకు సగటున లభిస్తున్నది 78 చదరపు అడుగుల స్థలం మాత్రమే. పట్టణ ప్రాంతాల్లో వారికి లభిస్తున్నది 75 చ॥ అడుగులు. భారత దేశంలో అత్యంత తక్కువ స్థలంలో నివసిస్తున్న ప్రజలు బీహార్‌లో ఎక్కువగా ఉన్నారు.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**
**పోస్టు స్టాంపు**
ఇంటి నెంబరు........................................................
వీధి.....................................................................
గ్రామం.................................................................
మండలం లేదా పట్టణం.........................................
జిల్లా......................................................................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao,